

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-6-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 134 పేజీలు: 8+4 వెల: 8.00





**శత్రు మిస్సైళ్లను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థ** 5లో

యాంటీ షిప్ మిస్సైళ్లను ఢీకొట్టే టెక్నాలజీని పరీక్షించిన డిఆర్‌డిఓ

# ఇక భారీ టూరిజం ప్రాజెక్టులు

### పెట్టుబడులకు ముందుకు వస్తున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థలు
### రాజమండ్రి సహా వివిధ ప్రాంతాల్లో మరిన్ని హోం స్టేలు
### అరకు, చింతపల్లి సహా 1015 చోట్ల కారవాన్ పార్కులు
### టెంపుల్ టూరిజానికి మరింత ప్రోత్సాహం: సిఎం చంద్రబాబు



**విజయవాడ, జూన్ 13 తర్వాత వార్త ప్రతినిధి :** రాష్ట్రం టూరిజం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఎపి పర్యాటక పాలసీతో టూరిజం రంగంలో తీసుకుని వచ్చిన మార్పులకు గుర్తింపు లభించిందన్నారు. ఈ రంగంలో పెట్టుబడులకు జాతీయ. అంతర్జాతీయ సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా ఎపిలో హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొని వస్తున్నామని తెలిపారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సిఎం చెప్పారు వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటు లోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూస్తామన్నారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు.

హోంస్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని ఆదేశించినట్లు సీఎం చంద్రబాబు సిఎంవో విడుదల చేసిన ప్రకటనలో వివరించారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో టూరిజంశాఖ ప్రగతిని వివరించారు. ఈ శాఖ నిర్వహిస్తున్న మంత్రి కందుల లక్ష్మీ దుర్గేష్ కుమార్ అభినందించారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 1015 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సిఎం సూచనలు జారీ చేశామన్నారు.

అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని సిఎం పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు వివరించారు. గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కర ఘాట్‌ను ఆగస్టు నాటికి, హేవ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయానే సంకల్పంతో ఉన్నట్లు సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యే >>2



# వార్‌కు ఫుల్‌స్టాప్!

### జెనీవాలో ఇరాన్, అమెరికా శాంతి ఒప్పందానికి అంతా సిద్ధం
### ఉభయ పక్షాల మధ్య తుది దశకు చర్చలు
### ఒప్పందం ఖాయమన్న పాక్ ప్రధాని షరీఫ్

**ఇస్లామాబాద్, జూన్ 13:** దాదాపు 3 నెలలకుపైగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు ముగింపు కార్డు పడుతోంది. స్విట్జర్లాండ్ రాజధాని జెనీవా వేదికగా ఒప్పందంపై అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ ప్రతినిధులు సంతకాలు చేస్తారన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. దీనికితోడు ట్రంప్ కూడా తన ట్రూత్‌పోస్టులో ఐరోపాదేశాల్లోనే ఒప్పందం జరుగుతుందని కూడా ధృవీకరించారు. ఇపుడు తాజాగా పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం మరో 24 గంటల్లో ఖరారయ్యే అవకాశం ఉందని పాకిస్థాన్ ప్రకటన చేసారు. అమెరికా ఇరాన్ మధ్య >>2

# పెట్టుబడులు లక్ష్యంగా నేడు సింగపూర్‌కు సిఎం చంద్రబాబు



సింగపూర్ సెక్రటేరియట్

### సిఐఐ రోడ్‌షోలో పాల్గొననున్న సిఎం
### సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామిక వేత్తలతో వరుస భేటీలు

**విజయవాడ జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. 14 తేదీ ఉదయం 11.35 గంటలకు బెంగళూర్ నుంచి సిఎం సింగపూర్ బయల్దేరి వెళ్లనున్నారు. సింగపూర్ చేరుకున్న అనంతరం 15వ తేదీన సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ఆ దేశంలోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో మొదటగా సిఎం సమావేశం అవుతారు. పర్యటనలో తొలిరోజు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు సిఎం హాజరవుతారు. అనంతరం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రాస్ బాచ్‌తో విందు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్‌తో సమావేశం అవుతారు. తర్వాత గూగుల్ క్లౌడ్ ఏపీఏసీ అధ్యక్షుడు కరణ్ భజ్వా, జిఐసి ఎగ్జిక్యూటివ్ కమిటీ అడ్వైజర్ లిమ్ సియాంగ్ గౌన్‌తో చర్చిస్తారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ రాబర్ట్ యాప్‌తోనూ, నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టాన్ యెంగ్ చెయ్‌తో భేటీ అవుతారు. సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తోనూ పలు అంశాలపై చర్చిస్తారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ భేటీ అవుతారు. సిఐఐ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందంతోనూ సమావేశం అవుతారు. హోం మంత్రి కె షణ్ముగమ్, మానవ >>2

### వైజాగ్ విషాదం
# స్టీల్‌ప్లాంట్ ఘటనలో మరొకరి మృతి
### పదికి చేరిన మృతుల సంఖ్య



**విశాఖపట్నం (గాజువాక), జూన్ 13, ప్రభాతవార్త:** వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదం మరో కుటుంబంలో విషాదాన్నినింపింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు సూరిబాబు శనివారం మృతి చెందడంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి చేరింది. ప్రమాదం జరిగినప్పటి నుంచి తీవ్ర గాయాలతో విశాఖపట్నంలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సూరిబాబు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యుల ప్రయత్నాలు ఫలించక కన్నుమూశారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. సూరిబాబు భార్య వరలక్ష్మి, >>2

### 'చిన్నారి అదృశ్యం'పై
# వీడని మిస్టరీ
### కేసుకు ఆధారంగా ఉన్న పెంపుడు కుక్క మృతి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 13,ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారం గ్రామంలో ఈనెల 6వ తేదీన మూడేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి (జాహ్నవి) అదృశ్యమైన సంఘటన మిస్టరీగా మారింది. అగ్రహారం గ్రామంలో కొండను ఆనుకుని ఉన్న పామాయిల్ తోటలో కాపలాదారుగా ఉంటున్న సుంకర గణేష్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి. అదే పామాయిల్ తోటలో గణేష్ కుటుంబం నివాసం ఉంటుంది. చిన్నారి జ్ఞానేశ్వరి ఆడుకుంటూ పెంపుడు కుక్కతో సహా ఈనెల 6వ తేదీన అదృశ్యమైంది. ఈ సంఘటనపై నమోదైన కేసులో భాగంగా చిన్నారి కోసం పోలీసులు అప్పటినుండ గాలింపు చర్యలు మొదలు పెట్టారు. నిర్విరామంగా పోలీసులు పాపకోసం గాలింపు చర్యలు చేపడుతున్నా ఎటువంటి ఆధారం లభించలేదు. మూడు రోజుల తర్వాత చిన్నారితో పాటు అదృశ్యమైన పెంపుడు కుక్క చిన్నచిన్న గాయాలతో తిరిగి ఇంటికి చేరుకుంది. దీంతో పోలీసులు, కుటుంబ సభ్యులు కుక్క ద్వారా పాప ఆచూకీ లభిస్తుందని భావించారు. ఇంటికి వచ్చిన కుక్క ప్రవర్తన భిన్నంగా ఉండడంతో పోలీస్ అధికారులు వెటర్నరీ వైద్యులతో కుక్కకు వైద్య సేవలు అందించారు. కుక్క సాధారణ స్థితికి వచ్చిన తర్వాత సాంకేతిక నిపుణుల సహకారంతో పోలీసులు కుక్క మెడకు జిపిఎస్ ట్రాకర్‌ని అమర్చి వదిలిపెట్టారు.

జిపిఎస్ ట్రాకర్ ఆధారంగా కుక్క వెళ్లిన ప్రాంతాలలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా పాపకు సంబంధించి ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో చిన్నారి మిస్సింగ్ కేసు మిస్టరీగా మారింది. పోలీసులు చిన్నారి అదృశ్యం కేసును చేదించేందుకు ఆధారంగా భావించిన ట్రాకర్ అమర్చిన పెంపుడు >>2

# కార్మిక సంక్షేమంలో సంస్కరణలు



### పారిశ్రామిక భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం
### డిజిటల్, ఇఎస్ఐ వైద్యసేవల విస్తరణ
### నిర్మాణ కార్మికులకు పలు సంక్షేమ పథకాలు
### - మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా సామాజిక బాధ్యతగా, అభివృద్ధి లక్ష్యంగా భావించి పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు. ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు సహకారంతో కార్మిక శాఖతో సహ తమ పరిధిలోని మంత్రిత్వ శాఖలన్ని అభివృద్ధి దిశలో అడుగులు వేస్తున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి పునాదులు కార్మికుల శ్రమతోనే నిర్మితమవుతాయని, అందువల్ల కార్మిక సంక్షేమం, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రెండేళ్లకాలం తమ పరిధిలోని మంత్రిత్వశాఖలపై మంత్రి ఒక సమాచార పత్రం విడుదల చేసారు. గత రెండేళ్లలో కార్మిక శాఖలో చేపట్టిన సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు, డిజిటల్ సేవలు, నిర్మాణ కార్మిక సంక్షేమ చర్యలు, ఇఎస్ఐ వైద్య సేవల విస్తరణ, పారిశ్రామిక భద్రతా కార్యక్రమాల పురోగతిని వివరించారు.

ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మిక సంక్షేమ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చర్యలు ప్రారంభించిందన్నారు. నిర్మాణ కార్మికుల కోసం నిలిచిపోయిన సంక్షేమ పథకాలను మళ్లీ ప్రారంభించడమే కాకుండా వాటిని మరింత బలోపేతం చేసే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గతంలో నిలిచిపోయిన భవన. ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వం మార్చి 2026 నుండి పునరుద్ధరించిందన్నారు. వివాహ బహుమతి రూ..20,000, ప్రసూతి ప్రయోజనం రూ..20,000, సహజమరణ సహాయం రూ.60,000, అంత్యక్రియల ఖర్చులు రూ.20,000 చొప్పున అందజేస్తోందన్నారు. ఈ మొత్తాలను మరింత పెంచే ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయన్నారు. అన్ని ప్రయోజనాలను ఆధార్ ఆధారిత డిబిటిద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేయడం ద్వారా పారదర్శకతను తీసుకురావడం జరిగిందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం 2024-25లో రూ.675.39 కోట్లు, 2025-26లో రూ.733.19 కోట్లు, మొత్తంగా రూ.1,408.58 కోట్లు సెస్ వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులను కార్మికుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రతా కార్యక్రమా >>2



శనివారం తడవద్ద దగ్ధమవుతున్న బస్సు

# కార్మికుల బస్సు దగ్ధం
### తప్పిన ప్రాణాపాయం

**తడ, జూన్ 13 ప్రభాతవార్త:** శ్రీసిటీ కార్మికులు ప్రయాణిస్తున్న బస్సు తిరుపతి జిల్లా తడ పట్టణ సమీపంలోని జీరో పాయింట్ వద్ద అగ్నికి ఆహుతైంది. శనివారం ఉదయం 8 గంటల సమయంలో శ్రీ సిటీ ఐఎంఓపి పరిశ్రమకు చెందిన ఎస్‌బిఎల్‌టి ప్రవేట్ ట్రావెల్ బస్సు కార్మికులను ఎక్కించుకొని వెళుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. కార్మికులు బస్సు దిగిపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టంజరగలేదు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా బస్సులో మంటలు చెలరే >>2

# కూలిన విమానం



### ఐదుగురు మృతి

**గౌహతి, జూన్13:** అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఎఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. మృతులను స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభమ్ కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్‌కు చెందిన ఖేమరామ్ కుమావత్, డానిష్, ఆలమ్‌గా గుర్తించారు. విమాన ప్రమాదంలో వాయుసేనకు చెందిన అయిదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోవడంపై రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వాయుసేన యోధుల కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. దేశానికి వారు అందించిన సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామన్నారు. ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

**కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్** 5లో

# వర్షంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

### అనంతపురం జిల్లాలోని పలు మండలాల్లో వర్షాలు
### తుంగభద్ర రిజర్వాయర్ ఎగువ భాగంలో వానలు నిల్!
### ఎల్‌నినో ప్రభావంతో రైతుల్లో కొనసాగుతున్న ఆందోళన

**అనంతపురం, జూన్ 13 ప్రభాతవార్త బ్యూరో:** ఈ యేడాది ఎలినినో సూపర్ ఎలినినోగా మారి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, తద్వారా రుతు పవనాలకు ఆటంకాలు ఏర్పడుతాయని, తద్వారా వర్షాలు తగ్గే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్న నేపథ్యంలో రైతుల్లో ఎక్కడో తెలియని ఆందోళన నెలకొంది. ఎక్కువ పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే ఫలితం ఉంటుందా లేదా అనే సందిగ్ధ పరిస్థితి వెనుకబడిన అనంతపురం జిల్లాలో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితుల్లో రెండు రోజులుగా ఆకాశం మేఘావృతం కావడం, అడపాదడపా వర్షాలు వస్తుండటం, కొన్ని మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ యేడాది కూడా వర్షాలు వస్తాయన్న ఆశతో ఎక్కువ పెట్టుబడితో పంటలు సాగు చేసేందుకు, సేద్యం పనులు చేసుకునేందుకు రైతులు సిద్దం అవుతున్నారు. ప్రభుత్వం సబ్సిడి విత్తన వేరుశనగ విత్తనాలను కూడా పంపిణీకి సిద్ధం కావడంతో రైతుల్లో ఉత్సాహం వస్తోంది. శుక్రవారం రాత్రి అనంతపురం జిల్లాలో వివిధ మండలాల్లో వర్షాలు పడ్డాయి. వర్షాలు పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పామిడిలో 84.6, పెద్దవడుగూరు 44.8, యాడికిలో 44.2, పెద్దపప్పూరులో 40.4, బొమ్మనహాళ్‌లో 40.2, అనంతపురం రూరల్‌లో 36, అనంతపురం అర్బన్‌లో 30.2, కుందుర్పిలో 28.2, బుక్కపట్నంలో 27.00, కణేకల్లు, కళ్యాణదుర్గంలో 21 చొప్పున, శింగనమలలో 20.8 మి.మీ వర్షం కురిసింది. అదే విధంగా మడకశిరలో 74.6, రొళ్లలో 57.4, రొద్దంలో 53.6, 53.2 లేపాక్షి, సోమందేపల్లిలో 52.2, చిలమత్తూరులో 43.6, హిందూపురంలో 42.6, పరిగిలో 36.4, నల్లమాడలో 32, గుడిబండలో 31.2, పెనుకొండలో 19.6 మి.మీ వర్షం కురిసింది. ఇదే విధంగా మరో వారం రోజులు అన్ని మంవడలాల్లో వర్షాలు పడాలని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. తాడిపత్రి, గుత్తి, వజ్రకరూరు, యల్లనూరు, యాడికి, కళ్యాణదుర్గం, శింగనమల, గార్లదిన్నె, రాప్తాడు, రాయదుర్గం, నార్పల, గుంతకల్లు లాంటి మండలాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి అనుకున్న స్థాయిలో వర్షాలు పడలేదని తెలుస్తోంది.

**ఒట్టి కుండలా తుంగభద్ర రిజర్వాయర్ :**
ఆంధ్ర-కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతమైన అగుంబే, తీర్థహల్లి తదితర ప్రాంతాల్లో ఈ సమయంలో భారీ వర్షాలు పడేవి. కర్ణాటకలోని పశ్చిమ కనుమల్లో విస్తారంగా భారీ >>2



శనివారం అగర్తలాలో శాంతినికేతన్ మెడికల్ కాలేజీలో ఒక మహిళా ఉద్యోగిని హత్యచేసారన్న ఆరోపణపై నిరసన తెలుపుతున్న సిఐటియు మద్దతుదారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

# మరొకరి మృతి

>> కుమారుడు లోకేష్, కుమార్తె ప్రమీలతో కలిసి పెదగంట్యాడ మండలం సీతానగరం గ్రామంలో నివాసం ఉంటున్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న సూరిబాబు మృతితో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. మృతదేహం గ్రామానికి చేరుకోనున్న నేపథ్యంలో సీతానగరం గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గ్రామస్తులు, బంధువులు పెద్దసంఖ్యలో కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ ధైర్యం చెబుతున్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో వరుసగా ప్రాణనష్టాలు చోటుచేసుకోవడం కార్మిక వర్గాలను కలచివేస్తోంది. ఇప్పటికే తొమ్మిదిమంది ప్రాణాలు కోల్పోగా, సూరిబాబు మృతితో ఆ సంఖ్య పది మందికి చేరింది. ఈ ఘటనపై కార్మిక సంఘాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా కఠిన భద్రతాచర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. వైజాగ్ ఉక్కు కర్మాగార చరిత్రలో ఈ ప్రమాదం విషాదకర అధ్యాయంగా నిలవగా, మరో కార్మికుడి మృతి కార్మిక కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# కార్మికుల బస్సు దగ్ధం

>> గాయి. కొద్ది సమయంలోనే బస్సు అగ్నికి ఆహుతి అయింది. దట్టమైన మంటలు కమ్ముకోవడంతో తడ పరిసర ప్రాంతాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఎస్సై కొండప్ప నాయుడు వారి సిబ్బంది సమస్యను అదుపులోకి తీసుకొచ్చారు. తరచూ అపాచీ, శ్రీ సిటీపరిశ్రమల బస్సులు ప్రమాదాలు జరుగుతుండడంతో కార్మికులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యం ఇష్టమొచ్చిన రీతిలో నాణ్యతా ప్రమాణాలు లోపించిన కాలం చెల్లిన బస్సులు నడపడం అవగాహన అనుభవం లేని డ్రైవర్లతో వాహనాలు నడిపించడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు బస్సుల నాణ్యత ప్రమాణాలపై దృష్టి సారిస్తే లైసెన్సులు లేకుండా బస్సులు నడుపుతున్న డ్రైవర్లపై బస్సుల యాజమాన్యంపై చర్యలు చేపట్టితే ప్రమాదాలు అరికట్టే అవకాశం ఉందని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని ప్రయాణించవలసిన పరిస్థితి ఏర్పడిందని కార్మికులు స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

# సింగపూర్‌కు సిఎం చంద్రబాబు

>> వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్‌తో చివరిగా భేటీ అవుతారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా 16వ తేదీ ఉదయం కాకతీయ కల్చరల్ అసోసియేషన్ సిబిఎన్ 361ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఏపీఏసీ సెమికండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. సుర్బానా జురాంగ్‌అమరావతి ప్లానింగ్ సమావేశానికి హాజరవుతారు. అనంతరం సింగపూర్ ఉప ప్రధానమంత్రి, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్ బృందంతో సమావేశం అవుతారు. తర్వాత 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్షిప్ ప్లీనరీలో పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత వరల్డ్ సిటీస్ సమ్మిట్ ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. సింగపూర్ పెవిలియన్, ఇన్నోవేటర్ల అలయ్, గూగుల్ టెక్నాలజీస్ స్టాల్స్ ప్రధానంగా పరిశీలిస్తారు. సీట్రియమ్ సమావేశంలోనూ పాల్గొంటారు. పర్యటనలో చివరిగా సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్ షోలో పాల్గొంటారు. సింగపూర్ పర్యటనకు ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఇడిబి సిఇఒ షన్మోహన్, సిఆర్‌డిఎ అధికారుల బృందం కూడా వెళ్లనుంది. రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులు సహా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు సిఎం బృందం సింగపూర్‌లో పర్యటించనుంది. 16 తేదీ రాత్రి 10 గంటలకు ముఖ్యమంత్రి స్వదేశానికి తిరిగి రానున్నారు.

# వీడని మిస్టరీ

>> కుక్క శనివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులలో ఆందోళన మరింత పెరిగి పాప కోసం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెద్దాపురం ఎస్డిపిఒ తిలక్ నేతృత్వంలో తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చెన్నకేశవ రావు ఆధ్వర్యంలో తుని రూరల్ ఎస్సై కృష్ణమాచారి, కోటనందూరు ఎస్సై టి. రామకృష్ణ, తొండంగి ఎస్సై జగన్మోహన్‌తో పాటు పెద్దాపురం డివిజన్ పరిధిలోని పోలీస్ యంత్రాంగం వారం రోజులుగా చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎటువంటి ఫలితం లేకపోవడం తో పాప కుటుంబ సభ్యులు, పోలీసులు విస్మయం చెందుతున్నారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ సుమారు 300 మంది పోలీసులు చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. డ్రోన్లు,డాగ్ స్క్వాడ్‌తో కొండలను,తోటలను జల్లెడ పట్టిన పోలీసులు కిడ్నాప్ కోణంలో కూడా దర్యాప్తు వేగవంతం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న సిసి కెమెరాల పుటేజీ పరిశీలించారు. తుని బస్టాండ్, రైల్వే స్టేషన్, నర్సీపట్నం రోడ్డు తదితర ప్రాంతాల్లో సైతం పోలీసులు గాలిస్తున్నారు. ఎనిమిది రోజులు గడుస్తున్న చిన్నారి మిస్సింగ్‌కు సంబంధించి ఒక్క ఆధారం లభించకపోవడంతో పాప క్షేమంగానే ఉంటుందా అనే కోణంలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది . ఏది ఏమైనా ప్రజల ప్రార్థనలు, పోలీసుల శ్రమ ఫలించి చిన్నారి తల్లి జ్ఞానేశ్వరి క్షేమంగా అమ్మ ఒడికి చేరాలని కోరుకుందాం.

## చిన్నారి అదృశ్యం ఘటనపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆరా

**విజయవాడ.జూన్ 13,ప్రభాతవార్త ప్రతినిధి:** తుని మండలంలో చిన్నారి అదృశ్యం ఘటనపై డి.సిఎం పవన్ ఆరా తీశారు. ఈ మేరకు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల సేవలు కూడా వినిగియోగించుకోవాలని పవన్ తెలిపారు. అటవీశాఖ, బేస్‌క్యాంప్ వాచర్స్, నిపుణుల సాయం తీసుకోవాలని చెప్పారు. పాప ఆచూకీ కోసం 400 మంది సిబ్బంది గాలిస్తున్నట్లు ఎస్పీ బిందుమాధవ్, పవన్‌కు వివరించారు. అత్యాధునిక డ్రోన్లతో గాలింపు జరుపుతున్నామని తెలిపారు. చిన్నారి ఇంటి పరిసరాల్లో 38 సిసి కెమెరాల ఫుటేజ్ పరిశీలించామని చెప్పారు. ఈ క్రమంలోనే దర్యాప్తు మరింత వేగవంతం చేయాలన్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఎస్పీని ఆదేశించారు.

# ఇక భారీ టూరిజం ప్రాజెక్టులు

>> కంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని సిఎం నిర్ణయించామన్నారు. ఆ క్రమంలో కార్యచరణ చేపట్టామన్నారు.. పర్యాటకశాఖ, అటవీ, దేవాదాయ, పోలీసు, మెరైన్ ఇలా వేర్వేరు శాఖల సమన్వయం కోసం సిఎస్ అధ్యక్షతన దీనిని ఏర్పాటయి కార్యచరణ సాగిస్తుందన్నారు.స్పష్టం చేశారు. హౌస్ బూట్లు, హెలీ టూరిజంతో పాటు ఉడాన్ పథకం కింద సీ ప్లేన్‌లను కూడా ప్రోత్సహించాలని అన్నారు. విశాఖ, విజయవాడ, శ్రీశైలం, గండికోట, కంభం చెరువు లాంటి చోట్ల వాటర్ ఏరో డ్రోమ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని సూచించారు. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను కూడా నిర్వహించేలా చూడాలన్నారు. తెలంగాణా లాంటి ల్యాండ్ లాక్డ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు దీనికి పెద్ద ఎత్తున ఆకర్షితులు అవుతారన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే టెంట్ సిటీలను కేటగిరీలుగా విభజించి ప్రోత్సహిస్తే అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. కనీసం వెయ్యి టెంట్ సిటీలను గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి తేవాలని సీఎం సూచనలు జారీ చేశారు. క్రియేటివ్ ఎకనామినీ ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్ద ఎత్తున జరగాలన్నారు. క్రియేటివ్ ఎకానమీని సృష్టించేలా అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలన్నారు. బాలివుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా క్రియేటివ్ ఎకనామీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీమ్ కింద విశాఖ, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలని.. ప్రతీ ఐకానిక్ డెస్టినేషన్‌కు రూ.500 కోట్ల వరకూ వెచ్చించేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. గత ఏడాదిలో పర్యాటక ప్రాంతాలకు 30.92 కోట్ల మంది పర్యాటకుల ఫుట్ ఫాల్ నమోదైందని ఈ ఏడాదిలో 9 నెలల కాలానికిగానూ 21 శాతం మేర వృద్ధి కనిపించిందని.. ఇది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ఆలయాలను అనుసంధానించి టెంపుల్ టూరిజం కూడా ఇంటిగ్రేట్ చేయాలని సీఎం సూచించారు. సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ చేపట్టాలన్నారు. వీటితో పాటు తిరుపతిలో ఉన్న చెరువులు, అమరావతి ప్రాంతంలోని కాలువలు, విశాఖ సహా వేర్వేరు ప్రాంతాలను సుందరీకరణ చేపట్టాలని సిఎం స్పష్టం చేశారు.

# కార్యాచరణ దిశగా తిరుపతి ఫిల్మ్ సిటీ విజన్: మంత్రి దుర్గేష్

**తిరుపతి,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతిని చిత్ర నిర్మాణ , పోస్ట్‌ప్రొడక్షన్ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పారడాక్స్ పిక్చర్స్ చేపట్టిన ప్రైవేట్ రంగ ప్రయత్నానికి గుర్తింపుగా రాష్ట్రపర్యాటక మంత్రి కందుల దుర్గేష్ "తిరుపతి ఫిల్మ్ సిటీ" విజన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తూ, పారడాక్స్ పిక్చర్స్ వ్యవస్థాపకురాలు, నిర్మాత కావ్య పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని కలిసి, ప్రతిపాదిత "తిరుపతి ఫిల్మ్ సిటీ" కార్యక్రమం పురోగతిని వివరించారు.సిఎం చంద్రబాబునాయుడు ఆశయాలకనుగుణంగా సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ దిశగా కృషి చేయాలని సూచించారు. గత రెండు సంవత్సరాలుగా తిరుపతిలో సినీ మౌళిక వసతుల అభివృద్ధి కోసం పారడాక్స్ పిక్చర్స్ చేపట్టిన కార్యక్రమాలను కావ్య మంత్రికి వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న స్టూడియో సౌకర్యాలలో చిత్ర నిర్మాణ మౌళిక వసతులు,ఎడిటింగ్ సూట్లు,డబ్బింగ్ థియేటర్లు, రీరికార్డింగ్ సౌకర్యాలు సంగీత నిర్మాణ కేంద్రాలు,పోస్ట్‌ప్రొడక్షన్ సేవలు వంటి విభాగాలు ఉన్నాయి. ప్రస్తుతం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నాలుగు అంతస్తుల కార్యాలయ సముదాయం నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతుండగా, విస్తరణ ప్రణాళికలు కూడా కొనసాగుతున్నాయని మంత్రికి వివరించారు. రాష్ట్రంలో విశాఖపట్నం, అమరావతి, తిరుపతి నగరాల్లో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలనే విస్తృత దృక్పథం నుంచే ఈ కార్యక్రమానికి స్ఫూర్తి లభించిందని కావ్య తెలిపారు.

హైదరాబాద్‌కు పరిమితం కాకుండా ఇతర నగరాల్లో కూడా సినిమా మౌళిక వసతులు ఏర్పడాలనే చర్చలు మొదలైనప్పుడు, ఎదురు చూడకుండా మేమే ముందడుగు వేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. తిరుపతిలో సినీ మౌళిక వసతుల నిర్మాణాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. స్వయం సమృద్ధిగల సినీ పరిశ్రమను నిర్మించడం, నైపుణ్యాధారిత ఉపాధి అవకాశాలను సృష్టించడం, దీర్ఘకాలిక సినీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే మా ధ్యేయం" అని ఆమె అన్నారు.. తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి గణనీయ సంఖ్యలో నటులు, సాంకేతిక నిపుణులు, సహాయక కళాకారులు, సిబ్బందికి అవకాశాలు కల్పించబడుతున్నాయన్నారు. స్థానికంగా అందుబాటులో ఉండే సినీ పరికరాల వ్యవస్థను సృష్టించడం ఈ ప్రాజెక్ట్ సాధించిన ముఖ్య విజయాలలో ఒకటిగా నిలిచింది. ఈ.కార్యక్రమాన్ని మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. త్వరలోనే సిఎం చంద్రబాబునాయుడును కలసి వివరిస్తామన్నారు.

# ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

## మెగా జాబ్ మేళాతో యువతకు ఉద్యోగావకాశాల వేదిక

## కర్నూలులో 1,500 ఉద్యోగాలు.. యువతకు మంత్రి భరత్ పిలుపు

**కర్నూలు, జూన్ 13: ప్రభాతవార్త :** ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకొని అనుభవాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రొసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ పిలుపునిచ్చారు. కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీలో నిర్వహించిన నాలుగో మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కర్నూలులో ఇప్పటివరకు నిర్వహించిన మూడు మెగా జాబ్ మేళాల్లో కేవలం 50 శాతం మంది మాత్రమే ఉద్యోగ అవకాశాలను వినియోగించుకున్నారని మంత్రి తెలిపారు. ఈసారి 19 కంపెనీలు సుమారు 1,500 ఉద్యోగాలతో యువతకు అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయని, ఉద్యోగాలు సాధించిన వారు వెంటనే చేరి అనుభవం సంపాదించాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌లో రిలయన్స్, అగస్త్యా, గ్రీన్ హైడ్రోజన్, సోలార్, విండ్ పవర్ వంటి భారీ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని, వాటి ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

## మళ్లీ దేవాదాయ శాఖలోకే బ్రాహ్మణ కార్పొరేషన్

**విజయవాడ జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** బ్రాహ్మణుల సుదీర్ఘ డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం నెరవేర్చింది.మళ్లీ దేవాదాయ శాఖలోకే బ్రాహ్మణ కార్పొరేషన్‌ను తీసుకుని వచ్చింది బ్రాహ్మణ కార్పొరేషన్ దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకొస్తామని ఎన్నికలు ముందు హామీ ఇచ్చింది. దీంతో ఈ మాటలను నిలబెట్టుకుంది. తాజాగా ఉత్తర్వుల జారీ చేసింది. కాగా ఎంతో కాలంగా బ్రాహ్మణ కార్పొరేషన్ కొనసాగిన వారిని జగన్ ప్రభుత్వం బిసి సంక్షేమ శాఖ పరిధిలోకి తీసుకెళ్లింది. దీంతో తమను దేవాదాయశాఖ కార్పొరేషన్‌లోనే ఉంచాలని డిమాండ్ చేశారు. కానీ గతప్రభుత్వం పెడచెవిన పెట్టింది. దీంతో 2024 ఎన్నికల ముందు కూటమి నాయకులను బ్రాహ్మణులుకలిసి సమస్యను విన్నవించారు. దీంతో తాము అధికారంలోకి వస్తే కచ్చితంగా సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తాజాగా అడుగులు వేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవాదాయ శాఖలోనే ఉంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో తమకు అందాల్సిన సంక్షేమ పథకాలు, దక్కాల్సిన ప్రాధాన్యత దక్కుతుందని బ్రాహ్మణుల ఆనందనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

# నేడు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు

**విజయవాడ, జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం మేఘావృతం కానుంది. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.అంతేకాకుండా పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షం పడే సమయంలో చెట్లు, హోర్డింగ్స్ వద్ద నిలబడొద్దని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. ఇవాళ సాయంత్రం 6 గంటల నాటికి మార్కాపురం జిల్లా కోవిలంపాడులో 41 మిల్లీమీటర్లు, అనంతపురం జిల్లా తేరన్నపల్లిలో 24 మిల్లీ మీటర్లరు, వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురంలో 22.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీనికితోడు వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ వీలైనంత దూరంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు.

## జూలై 1న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనంతపురం రాక

**అనంతపురం జూన్ 13 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండల పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ప్రథమ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరుకానున్నట్లు తెలియ వచ్చింది. జూలై 1న జంతులూరు గ్రామంలో జ్ఞానసీమ ప్రాంగణంలో ఘనంగా స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతివిశ్వవిద్యాలయ విజిటర్ హోదాలో విచ్చేయనున్నట్లు సమాచారం.

2020 నుంచి 2026 బ్యాచ్‌లకు చెందిన 1,200 మందికి పైగా విద్యార్థులకు పట్టాలు,61 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానంచేయనున్నట్లు సమాచారం.

## వారం - వర్జ్యం

14-06-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
చతుర్దశి మ.2.19
రోహిణి రా.10.13
వర్జ్యం : మ.3.14-సా.4.37
2) రా.3.06 -తె.4.30
దు.సా.4.51-సా.5.43
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**వృషభం:** ఇంటా బయటా అనుకూల స్థితి. జీవితభాగస్వామి సలహాలు తీసుకుంటారు. ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం తగదు.

**మిథునం:** ఆప్తుల నుండి సహాయం అందుతుంది. పోటీ పరీక్షలలో ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు.

**కర్కాటకం:** దూరప్రాంతాలలో ఉన్న మీ వారి క్షేమ సమాచారం ఆనందానికి కారణం అవుతుంది. వాహనసౌలభ్యం కలదు.

**సింహం:** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. వ్యాపారాలకు తగిన లాభాలు పొందుతారు ఆరోగ్యం జాగ్రత్త అవసరం.

**కన్య:** ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

**తుల :** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. కీలక సమాచారం అందుకుంటారు. బాకీలు వసూలవుతాయి.

**వృశ్చికం:** పెట్టుబడులకు అనుకూలమైన కాలం. కాంట్రాక్టులు లాభిస్తాయి. ప్రముఖుల నుండి కీలక సమాచారం.

**ధనుస్సు:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. మొండి బాకీలు వసూలవుతాయి. ధనలాభం పొందుతారు. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది.

**మకరం:** ఉద్యోగంలో అనుకోని చిక్కులు ఎదురవుతాయి. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** ప్రతి చిన్న విషయానికి జీవిత భాగస్వామితో సంప్రదింపులు సాగిస్తారు. సహోద్యోగుల అండదండగా నిలుస్తారు.

**మీనం:** ముఖ్యమైన దరఖాస్తు ఫారాలకు జత చేయవలసిన పత్రాలను పరిశీలించుకోవడం చెప్పదగిన సూచన.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం భోపాల్‌లో ఎన్డీయే ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నాగేశ్వర్ మహదేవ్ ఆలయంలో జరిగిన స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

# కార్మిక సంక్షేమంలో సంస్కరణలు

>> లకు వినియోగించేందుకు కార్యాచరణ రూపొందించబడిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 25 ఇంటిగ్రేటెడ్ లేబర్ అమినిటీస్ కాంప్లెక్సుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కేంద్రాల ద్వారా ఉపాధి సమాచారం, మంచి నీరు, వైఫై, పారిశుధ్య సౌకర్యాలు, కార్మికుల నమోదు, సంక్షేమ అవగాహన, నైపుణ్యాభివృద్ధి సేవలు ఒకేచోట అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ నమూనాను విస్తరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

**ఇఎస్ఐ సేవల విస్తరణ - కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు**

గత రెండు సంవత్సరాలలో ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ కార్మికుల ఆరోగ్య భద్రత, వైద్య సేవల విస్తరణ, మౌలిక సదుపాయాల బలోపేతం మరియు డిజిటల్ గవర్నెన్స్ రంగాలలో విశేష పురోగతి సాధించిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 15.32 లక్షల మంది ఇఎస్ఐ. భీమా వ్యక్తులు మరియు దాదాపు 60 లక్షల మంది లబ్ధిదారులకు సమగ్ర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరోగ్య సేవల సామర్థ్యాన్ని పెంచేందుకు 92 మంది వైద్య, పారామెడికల్ మరియు పరిపాలనా సిబ్బందికి పదోన్నతులు కల్పించడం జరిగిందన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 30 కొత్త ఇఎస్ఐ డిస్పెన్సరీలు, 57 ప్రస్తుత డిస్పెన్సరీల అప్‌గ్రేడేషన్, అలాగే విశాఖపట్నం మరియు అమరావతిలో రెండు ఇఎస్ఐసి మెడికల్ కాలేజీల స్థాపనకు చర్యలు చేపట్టబడ్డాయన్నారు. అత్యవసర వైద్య సేవల బలోపేతం కోసం సిఎస్ఆర్ భాగస్వామ్యంతో 3 అంబులెన్సులను సమీకరించడం జరిగిందన్నారు. అదే విధంగా, గ్రీవెన్స్ రీడ్రెస్సల్ వ్యవస్థ, మొబైల్ హెల్త్ అప్లికేషన్లు, ధన్వంతరి-ఇఔషధి సమన్వయం వంటి కార్యక్రమాల ద్వారా డిజిటల్ హెల్త్ గవర్నెన్సుకు శ్రీకారం చుట్టి, పారదర్శకమైన మరియు ప్రజాకేంద్రిత వైద్య సేవల అందుబాటును మరింత మెరుగుపర్చడం జరిగిందని మంత్రి తెలిపారు.

**పారిశ్రామిక భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత....**

రాష్ట్రంలో పారిశ్రామిక భద్రతను అత్యున్నత ప్రాధాన్య అంశంగా గుర్తించిన ప్రభుత్వం 'జీరో యాక్సిడెంట్స్' లక్ష్యంతో సమగ్ర కార్యాచరణను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. పరిశ్రమల్లో ప్రమాదాలను ముందస్తుగా నివారించడం, కార్మికుల ప్రాణభద్రతను కాపాడడం మరియు సురక్షితమైన పనివాతావరణాన్ని నెలకొల్పడం కోసం విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# వార్‌కు ఫుల్‌స్టాప్!

>> చర్చలు దాదాపు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందం ఖరారైన వెంటనే డీల్‌పై ఎలక్ట్రానిక్ విధానంలో సంతకాలు జరిగేలా పాకిస్థాన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు షరీఫ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో శనివారం ఓ పోస్టు చేశారు. శాంతి ఒప్పందానికి మేం ఎప్పుడూ ఇంత దగ్గరగా రాలేదు. మరో 24 గంటల్లోనే ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది. తర్వాత ఎలక్ట్రానిక్ సంతకాలు, వచ్చే వారమే సాంకేతిక స్థాయి చర్చలు జరుగుతాయని పాకిస్థాన్ పిఎం పేర్కొన్నారు. ఈ క్రమంలోనే చర్చల సమయంలో ఎంతో సహకరించిన అమెరికా ఇరాన్ ప్రభుత్వాలకు షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. మద్దతు ఇచ్చిన పశ్చిమాసియాలోని ఇతర దేశాలకు కూడా ధన్యవాదాలు చెప్పారు. దీర్ఘకాలిక శాంతి దిశగా ఈ చారిత్రక ఒప్పందం బలమైన పునాది వేస్తుందని విశ్వసిస్తున్నట్లు వెల్లడించారు. షరీఫ్ ప్రకటనకు ఒకరోజు ముందుగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకూడా ఈ ఒప్పందం గురించి వ్యాఖ్యలు చేశారు. ఇస్లామాబాద్ అవగాహనా ఒప్పందం ఇంతకుముందెన్నడూ లేనంత దగ్గరలో ఉంది. తుది ఒప్పందం పూర్తయ్యే వరకు మీడియా ఊహాగానాలన్నింటికీ దూరంగా ఉండాలని చెప్పారు. అరాగ్చీ పోస్ట్‌ను యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేయడం విశేషం. అయితే ఇక్కడ ఒప్పందం తుది దశకు చేరుకుంటుందన్న తరుణంలోనే ఇరాన్‌పై ట్రంప్ మరోసారి విమర్శలు గుప్పించారు. ఇరాన్ మీడియా కథనాల్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇరాన్ మీడియా ప్రకటనలకు, చర్చల్లో అంగీకరించిన అంశాలకు సంబంధం లేదని వ్యాఖ్యానించారు. ఒప్పందంలోని విషయాల్ని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ వెల్లడించారు. ఇరాన్ ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఎత్తి వేయడం సహా హార్ముజ్ జలసంధి నిర్వహణలో పలు కీలక మార్పులు వంటివి ప్రతిపాదిత ఒప్పందంలో ఉన్నట్లు తెలిపారు. ఇదే సమయంలో ఇరాన్ వద్ద ఉన్నటువంటి యురేనియం అంశాన్ని కూడా చర్చల్లో పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటు ఒప్పందానికి చేరువైనట్లు ప్రకటనలు వస్తుండగా మరోవైపు హార్ముజ్ జలసంధిలో శనివారం వాణిజ్య నౌకల్ని లక్ష్యంగా చేసుకున్న పలు ఇరాన్ డ్రోన్లను అమెరికా కూల్చివేసినట్లుగా ప్రకటించడం ఆందోళనలు రేకెత్తిస్తోంది. ఇస్లామాబాద్‌లో మొదటి విడత చర్చలు ఫలితం ఇవ్వకపోయినా ఇప్పుడు ఒప్పందం దిశగా పురోగతి కనిపిస్తోంది.ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్వయంగా పాల్గొని ఒప్పందంపై సంతకం చేసే వీలుందని సమాచారం. ఇరాన్ పార్లమెంట్‌స్పీకర్ మొహమ్మద్‌బాకర్ ఘాలిబాఫ్ కూడా ఈపత్రాలపై సంతకాలు చేయనున్నట్లు దౌత్యవర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈ సమావేశ వేదికను అధికారికంగా ఖరారు చేయాల్సి ఉంది.

# వర్షంతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

>> వర్షాలు వస్తే తుంగభద్ర జలాశయంలోకి తుంగ, భద్ర నదుల నుంచి భారీగా నీరు వచ్చేది. అయితే ప్రస్తుతం ఎలినినో ప్రభావం వల్ల వర్షాలు లేకపోవడంతో తుంగభద్ర జలాశయం ఒట్టి కుండలా ఉంది. తుంగభద్ర జలాశయంలో కేవలం 10 టీఎంసీల లోపే నీరు ఉంది. మంచి పథకాల కోసం ఆ నీటిని నిల్వ ఉంచినట్లు కనిపిస్తోంది. గత ఏడాది తుంగభద్ర డ్యాం గేట్ కొట్టుకు పోవడంతో కేవలం 68 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయగలిగారు. ఆ నీటినే ఆంధ్ర-కర్ణాటక రైతులకు విడుదల చేశారు. కానీ ఈ యేడాది సరికొత్తగా తుంగభద్ర రిజర్వాయర్‌కు సంబంధించి గేటుతోపాటు అన్నింటినీ కొత్తగేట్లు బిగించారు. ఎపిలోని కూటమి ప్రభుత్వం కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం సహకారంతో తుంగభద్ర బోర్డు 33 క్రస్ట్ గేట్లను విజయవంతంగా మార్చడంలో సక్సెస్ అయ్యింది. ఈ సీజన్‌లో తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతంలో వర్షాలు పడితే డ్యాం పూర్తి సామర్థ్యం 105.78 టిఎంసిల నీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో జలాశయం పై భాగంలో వర్షాలు వస్తే ఎక్కువ సామర్థ్యంతో నీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉన్నందున అనంతపురం, కర్నూలు జిల్లాలకు సాగునీరు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు. ఎలినినో ప్రభావం రుతు పవనాలపైన ఏ మేరకు ఉంటుందో వేచి చూడాల్సిందే. గత యేడాది తుంగభద్ర రిజర్వాయర్‌లోకి ఇదే రోజుకు 25.589 టిఎంసిల నీరు ఉంటే, ఈ యేడాది ఇదే రోజుకు 9.90 టిఎంసిల నీరు ఉంది. గత ఏడాది ఇదే రోజు టిబి డ్యాంలోకి 8,269 క్యూ సెక్కుల నీరు వస్తుంటే, ఈ ఏడాది ఇదే రోజు సగటున 157 క్యూసెక్కుల నీరు వస్తోంది. తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతం తీర్థహల్లి, అగుంబే ప్రాంతాల్లో త్వరలో భారీ వర్షాలు వస్తాయని ఆశిద్దాం.

# కాల్వలు, కరకట్టలు పటిష్టపరచాలి

## నీటి ప్రవాహాలకు ఆటంకం లేకుండా చూడాలి

## జలధార- జలహారతి పనులపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుతం జరుగుతోన్న జలధార- జలహారతి పనుల్లో గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణఅభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతివ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. జలధార పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. శనివారం సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జలధారజలహారతి పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఉపాధి హామీ నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా జలధార పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ నిధుల వినియోగంలో అలసత్వాన్ని ప్రదర్శించవద్దన్నారు. నీటి మిగులు బేసిన్ల నుంచి తక్కువ నీటి లభ్యత ఉన్న బేసిన్లను కనెక్ట్ చేసే పనులను చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.

జలధార పనుల కింద చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్‌లు, కాంటూర్ కందకాల పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. చిన్న వాగుల అభివృద్ధికి వాల్మీకిపురం వాగు అభివృద్ధి మోడల్ పరిశీలించాలని సూచించారు. నీటి భద్రత విషయంలో ప్రతీ జిల్లా ఒక వినూత్నమైన విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. జలధార మొదటి విడత పనులు పూర్తయిన తర్వాత చెక్ డ్యామ్‌లు, ఫామ్ పాండ్‌లు, చెరువులకు గండ్లు పడకూడదన్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా కాలువలు, కరకట్టలలో అడ్డంకులు తొలగించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. జలధార వల్ల కలిగే లాభాలను ఇరిగేషన్, అవేర్ వంటి సంస్థలు ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. జిల్లాల వారీగా భూగర్భ జలాల పునరుద్ధరణ లెక్కలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.



## కేశినేని నానిపై కేసు

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ లోక్‌సభ నియోజకవర్గ మాజీ సభ్యుడు కేశినేని శ్రీనివాస్(నాని)పై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు కేశినేని నానిపై కేసు నమోదు చేశారు. ఇటీవల కాలంలో తనను లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని కేశినేని చిన్ని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపడుతున్నారు. కాగా తనపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులకు కూడా కేశినేని నాని ఫిర్యాదు చేయడమే కాకుండా, చంద్రబాబుకు లేఖలు రాయడం చికాకుగా మారడంతో చిన్ని కేశినేని నానిపై ఫిర్యాదు చేసినట్లు ఆయన వర్గీయులు వెల్లడించారు. ఇక తనపై నమోదైన కేసుపై నాని స్పందించారు. కేసులకు, బెదిరింపులకు తాను భయపడబోనని ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. తాను విజయవాడ ఎంపీ చేసిన దానిపై చంద్రబాబు కు పద్నాలుగు నెలల క్రితం లేఖ రాశానని, అయితే పద్నాలుగు నెలల తర్వాత తనపై పోలీసు కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు.ప్రభుత్వ, ప్రజాసంబంధిత ఆస్తుల విషయంలో మాజీఎంపీగా తాను ప్రశ్నించే అధికారం ఉందని కేశినేని నాని అభిప్రాయపడ్డారు. కేసులతో తనను భయపెట్టలేరని, అలాగే బెదిరింపులకు తాను లొంగేవ్యక్తిని కానని కేశినేని నాని స్పష్టంచేశారు.

# నలుగురు మావోయిస్టులకు బెయిల్

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ శివారుల్లో గత ఏడాది అరెస్టైన నలుగురు మావోయిస్టులకు ఎట్టకేలకు బెయిల్ లభించింది. బెయిల్ జారీ సందర్భంలో న్యాయస్థానం విధించి షరతులను అనుగుణంగా నిందితులు పూచీకత్తు అందజేసిన తరువాత మాత్రమే జైలు నుంచి విడుదల అవుతారు.మావోయిస్టు తరపు న్యాయవాదులు అందించిన సమాచారాన్ని పొడియం రెంగు అలియాస్ బీమ (ఏ1), మడకం మడన్ అలియాస్ మదన్న (ఏ2), సోది మనీలా (ఏ3), సోది మంగి (ఏ4)లకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపీ షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కోర్టు ఉత్తర్వులను అనుసరించి ప్రతి నిందితుడు రూ.25వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాల్సి ఉంటుంది.అందులో ఒకరు స్థానిక వ్యక్తి పూచీకత్తుదారుగా ఉండాలని కోర్టు ఆదేశించింది. కోర్టుఅనుమతి లేకుండా మావోయిస్టులు పటమట పోలీస్ స్టేషన్ పరిధిని దాటి వెళ్లరాదని స్పష్టం చేసింది. ఈ షరతులు పాటించిన అనం తరం నలుగురు మావోయిస్టులు జైలు నుంచి విడుదల కానున్నారు.గత ఏడాది నవంబర్‌లో విజయవాడలోని కానూరు వద్ద ఉన్న కొత్త ఆటో నగర్ లోని ఓ భవనంలో మావోయిస్టులు బస చేస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో ఆక్టోపస్, గ్రేహౌండ్స్ పోలీసులు విస్తృతస్థాయిలో తనిఖీలు జరిపారు. స్థానిక పోలీసుల సహకారంతో నలువైపుల నుంచి భవనాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆ క్రమంలోనే నవంబర్ 18వ తేదీన విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి ఈ నలుగురు మావోయిస్టులను అరెస్టు చేశారు. అనంతరం వారిపై పటమట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి వీరు నెల్లూరులోని కేంద్రకారాగారంలో జ్యుడీషియల్ రిమాండలో ఉన్నారు నిందితులు 200 రోజులకు పైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నేపథ్యంలో డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని వారి తరఫు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్ జిల్లాకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌పై కోర్టు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసి తిరిగి పంపించిందని ఆయన వాదించారు. మావోయిస్టుల తరఫున న్యాయవాది శ్రీనివాస్ మాట్లాడుతూ నిందితులు చాలా కాలంగా జైలులో ఉన్నారని, చట్టపరంగా వారికి డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాల్సిన అవసరం ఉందనివాదించారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ప్రభావంతో మావోయిస్టులు ఆయుధాలు వదిలి లొంగిపోతున్న పరిస్థితులు ఏర్పడ్డాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంక టేశ్వరరావు తమ వాదనలు వినిపించారు. ఈ నెల 2వ తేదీన ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపీ, నిందితుల తరఫు వాదనలతో ఏకీభవిస్తూ నలుగురికీ బెయిల్ మంజూరు చేశారు.

## ఆర్జీయూకేటీ బీటెక్ ప్రవేశాల ఫలితాలు విడుదల: మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సు 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక ఎంపిక జాబితాను ఏపీ విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో ఎంపిక ఫలితాలను ఏపీ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు.మొత్తం 44,104 దరఖాస్తులు అందగా, వాటిలో 4,040 మంది విద్యార్థులను



తాత్కాలికంగా ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో 96.7 శాతం మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉండటం విశేషం. గ్రామీణ ప్రతిభకు పెద్దపీట వేస్తూ ప్రవేశాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల ఎంపిక లేఖలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల సహాయం కోసం వాట్సాప్ హెల్ప్‌డెస్క్ నంబర్ 9552300009 ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యారంగంలో సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పని చేస్తోందని, గ్రామీణ విద్యార్థుల సాధికారతకు ఈ ప్రవేశాలు దోహదపడతాయని ఏపీ విద్యాశాఖ అధికారులు తెలిపింది.

## రాజధాని పరిధిలో మొత్తం 69 బ్రిడ్జిలు: మంత్రి నారాయణ

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి పరిధిలోని కొండవీటి వాగు, పాలవాగులపై మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. ఈ రెండు వాగులపై జరుగుతున్న వంతెనల పనులను మంత్రి పి. నారాయణ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అమరావతిలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ రెండువాగులపై మొత్తం 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోందని, వర్షపు నీరు సాఫీగా సాగిపోయేలా ఇంజనీరింగ్ ప్రణాళికలతో పనులు వేగవంతం చేశామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా



ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. అమరావతి భవనాల నిర్మాణ వ్యయంపై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలను మంత్రి తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి చదరపు అడుగుకు రూ. 3,945 ఖర్చు అవుతుంటే, అమరావతి హ్యాపీనెస్ట్ నిర్మాణానికి రూ. 3,393, గెజిటెడ్ అధికారుల నివాసాలకు రూ. 3,684 మాత్రమే వ్యయం అవుతోందని తెలిపారు. ఐకానిక్ భవనాలు కావడం వల్లే కొన్నింటికి కొద్దిగా ఖర్చు ఎక్కువ అవుతుందని, పార్లమెంట్ భవనానికైనా, తెలంగాణ సచివాలయం నిర్మాణానికైనా తొలిసారి పిలిచిన టెండర్లుకి, పూర్తయ్యేనాటికి భారీగా ఖర్చయిందని, ఖర్చు పెరగడం సహజమేనని పేర్కొన్నారు. వైసిపి నాయకులు ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానకపోతే వచ్చే ఎన్నికల్లో వారికి 11 సీట్లు కూడా రావంటూ వ్యాఖ్యానించారు.

## గవర్నర్ నజీర్‌కు గుమ్మడి గోపాలకృష్ణ కృతజ్ఞతలు

**విజయవాడ, జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతిష్టాత్మక కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా తన గురించి గౌరవపూర్వకంగా ప్రస్తావిస్తూ ప్రశంసలు తెలియజేసిన రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ పద్యనాటక రంగానికి తాను చేసిన సేవలను గుర్తించి, తెలుగు శాస్త్రీయ నాటక సంప్రదాయ పరిరక్షణకు, ప్రోత్సాహానికి అవసరమైన ప్రేరణను అందించినందుకు గవర్నర్‌కి వినమ్ర ప్రణామాలు తెలియజేశారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం తనకు లభించడం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా, తెలుగు పద్యనాటక రంగానికి, కళాకారులకు, నాటకాభిమానులకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ పురస్కారం తెలుగు నాటక రంగం, సంస్కృతి, సాంప్రదాయ కళారూపాల అభివృద్ధికి మరింత అంకితభావంతో సేవలు అందించేందుకు తనకు నూతన ఉత్సాహాన్ని, స్ఫూర్తిని కలిగించిందన్నారు. తెలుగు నాటక సంప్రదాయ వైభవాన్ని భావితరాలకు అందించేందుకు, యువతలో నాటక కళపై ఆసక్తి పెంపొందించేందుకు, రాష్ట్ర నాటక అకాడమీ ద్వారా మరింత కృషి కొనసాగిస్తానని గోపాలకృష్ణ తెలిపారు.

## లిక్కరు స్కామ్‌లో కీలక లబ్ధిదారు జగనే: మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యపాన నిషేధం చేస్తామని లిక్కరును పూర్తిగా ఆదాయ వనరుగా మార్చుకున్నారని గత వైసీపీ ప్రభుత్వంపై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మద్యం కుంభకోణంలో రూ. 3500 కోట్లు దోచుకొని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారుడు గొడ్డలి పార్టీ నాయకుడు జగనే అని వ్యాఖ్యానించారు. కల్తీ మద్యం తయారు చేసి 30 వేల మంది మహిళల పుస్తెలు తెంచారని దుయ్యబట్టారు.

చిన్నాన్నను చంపిన వ్యక్తికి ప్రజల ప్రాణాలు ఒక లెక్క కాదన్నారు. కల్తీ మద్యం ద్వారా దోచుకున్న సొమ్ముతో సినిమాలు, వ్యాపారాలు చేశారని మంత్రి తెలిపారు. వైసీపీ మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు మద్యం రవాణా దోపిడీ చేశారని ఆరోపించారు. డొల్ల కం పెనీల ద్వారా రవాణా ఛార్జీలు పెంచి రూ.400 కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో సురక్ష యాప్ ద్వారా నాణ్యమైన మద్యం అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రజలు గొడ్డలి పార్టీని తిరస్కరించిన విషయాన్ని గొడ్డలి పార్టీ నాయకులు గుర్తు చేసు కోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌తో సూపర్ హిట్ కొట్టిందన్నారు. మద్యం కుంభకోణంలో తాడేపల్లి గేట్‌ను ఈడీ టచ్ చేసిందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా గొడ్డలి పార్టీని ప్రజలు మూసివేశారని డోలా బాల వీరాంజనేయ స్వామి వ్యాఖ్యానించారు.

## ఒపి నుంచి వైద్య సేవల వరకు సరికొత్త మార్పులు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ,జూన్ 13, ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య రంగంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కల్పిస్తున్నామని ఏపీ ఆర్యోగ,వైద్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేసారు.అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని. రెండేళ్లలో ఆరోగ్యశాఖ పరంగా చేసిన అభివృద్ధి, ప్రణాళికలను ప్రజలకు చెబుతున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు.అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. రెండేళ్లలో ఆరోగ్య శాఖ పరంగా చేసిన అభివృద్ధి, ప్రణాళికలను ప్రజలకు చెబుతున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు.ఆర్యోగశ్రీ, 108 అత్యవసర సేవలను దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకుని వచ్చారన్నారు.ఈ సేవలను అమలు చేస్తూనే మెరుగైన సంస్కరణలు తెచ్చామన్నారు. పథకాల పేర్లు మారినంత మాత్రం చేత సేవలు నిర్వీర్యం కావన్నారు.మాజీ ముఖ్యమంత్రి జగన్ కనీస అవగాహన లేని రీతిలో మాట్లాడుతున్నా



రన్నారు. ఆరోగ్య శాఖలో అనేక సంస్కరణలను సీఎం చంద్రబాబు తీసుకువచ్చారని మంత్రి తెలిపారు. రియాక్టివ్, క్యూరేటివ్ స్థాయి నుంచి ప్రిడెక్టీవ్ విధానాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ముందుగానే వారి సమస్యలను గుర్తించి అవసరమైన మందులు అందిస్తున్నామని తెలిపారు. టెలిమెడిసిన్ ద్వారా ప్రజలకు ఉన్న సందేహాలను వైద్యుల ద్వారా సమాధానాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. మీడియా కూడా తమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. ఎక్కడా ఎటువంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తెచ్చి పరిష్కారం అయ్యేలా చేశారన్నారు. నేడు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మంచి సేవలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇది తాము చెబుతున్న మాటలు కాదని గణాంకాలే తమ పని తీరును చెబుతున్నాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

## మద్యం కుంభకోణంలో అడ్డంగా దొరికిన జగన్ అండ్ కో: మంత్రి కొల్లు

**విజయవాడ జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యంలో రూ.వేల కోట్ల కుంభకోణం చేసి జగన్ అండ్ కో అడ్డంగా దొరికిందని ఎక్సైజ్ శాఖ మంత్రికొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. గొడ్డలి పోటు, వెన్నుపోట్లకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని వ్యాఖ్యానించారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగన్ లాంటి వారు ఆంధ్రప్రదేశ్‌లో ఉండకూడదనే 11 సీట్లు ఇచ్చి కూర్చోబెట్టారు. సెంటు స్థలం పేరుతోనూ వేల కోట్ల స్కామ్ చేశారు. కులాల, మతాల మధ్య చిచ్చుపెట్టాలని గొడ్డలి పార్టీ కుట్ర చేస్తోంది. వాటిని దీటుగా ఎదుర్కొంటాం. గొడ్డలి పార్టీని ప్రజలు భూస్థాపితం చేసే రోజు దగ్గరలోనే ఉంది. కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం అని అన్నారు.కూటమి ప్రభుత్వంపై కుట్రలు జల్లే క్రమంలో జగన్ ప్రతి సారి అభాసుపాలవుతున్నాడన్నారు.ఆయన చవకబారు ఎత్తుగడలతో ప్రజలు విసిగిపోయారన్నారు.ఈ సారి జగన్ అసెంబ్లీలోకి అడుగు పెట్టే పరిస్థితులుండవేమో అన్నారు.

## కాపు మహిళలను మోసగించిన డీసీఎం: వరుదు కళ్యాణి

**విజయవాడ, జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** సూపర్ సిక్స్ అమలు చేసే వరకు తాము పోరాటం చేస్తామని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణ వెల్లడించారు. కాపు మహిళలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మోసం చేశారని,దీనిపై తీవ్ర ఆందోళన చేస్తామన్నారు. తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఆమె ఎండగట్టారు. అంతేకాదు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పై పలు అభియోగాలు చేసారు. ఆడబిడ్డ నిధికి ముఖ్యమంత్రి చంద్రబాబు తూట్లు పొడిచారని మండిపడ్డారు. 2కోట్ల మంది మహిళలకు ఆయన వెన్నుపోటు పొడిచ3ఆరని వరుదు కల్యాణి ఆరోపించారు. తిరుపతి సభకు విజయోత్సవ సభకు బదులుగా వెన్నుపోటు సభ అని పేరు పెడితే బాగుండేదని వరుదు కల్యాణి విమర్శించారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం ఇస్తామని చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తు చేసిన వరుదు కల్యాణి తల్లికి వందనం మొదటి ఏడాది ఎగ్గొట్టారని చెప్పారు. నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఏమైందని ప్రశ్నించారు. సిడిఎన్ అంటే చీటింగ్ బోగస్ నాయుడు అని ఎద్దేవా చేశారు.

కూటమి నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రజలు ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ అమలు చేశామని చెప్పాలన్నారు. వైఎస్ జగన్ కంటే ఎక్కువ పథకాలు ఇస్తామని పవన్ కల్యాణ్ చెప్పారని మంత్రి లోకేశ్‌ను సైతం గల్లా పట్టుకొని నిలదీయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి హెచ్చరించారు.

## తిరుమలలో డిసిఎం పవన్ చిత్రపటం ప్రదర్శన


### ఆలయం ముందు భక్తుల అత్యుత్సాహం: చల్లంగా ఉండాలని దీవెనలు

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో గోవింద నామం తప్ప మరేనామం ఉచ్ఛరించడానికి వీలులేదంటూ ఏకంగా తీర్మానం చేసిన టిటిడి అందుకు విరుద్ధంగా ఓ భక్తబృందం శనివారం సాయంత్రం ఏకంగా ఆలయం ముందు పవన్‌కల్యాణ్ ఫోటో చూపి మాట్లాడటం సంచలనంగా మారింది. కొందరు జనసేన పార్టీ అభిమానులు ఇలా చేయడంతో అక్కడ ఉన్న భక్తులు కొంత అవాక్కయ్యారు. తిరుమలలో దేవుని నామస్మరణ తప్ప మరెలాంటి మాటగానీ, పదంగానీ వినిపించదు. మరీ ఏకంగా శనివారం సాయంత్రం జనసేనపార్టీ అభి మానులైన భక్తులు రాష్ట్రంలో పవన్ కల్యాణ్ పాలన, ఆయన చేస్తున్న మంచి పనులు గురించి వివరించారు. ఒక్కసారిగా ఆయన చల్లంగా ఉండాలని, పవన్ బిడ్డా అంతా మంచి జరగాలని ఆశీర్వదిస్తూ ఓ భక్తకుటుంబం అఖిలాండం వద్ద వ్యాఖ్యలు చేసింది. తిరుమలలో జనసైనికుల అత్యు త్సాహంతో ఆలయం ఎదుట రాజకీయ చిత్రపటం ప్రదర్శన చేయడం కలకలం రేపింది. "పవన్ కళ్యాణ్ అనే నేను" పుస్త కాన్ని ప్రదర్శించి వీడియో చిత్రీకరించిన యువకులు సామాజిక మాధ్యమంలో వైరల్‌చేశారు. దీంతో ఇదీ కాస్తటాఫిక్‌గా మారింది. తిరుమలలో రాజకీయ ప్రచారంపై నిషేధం ఉన్నా ఉల్లంచారని భక్తులు ఆగ్రహం వెలిబుచ్చారు. మరీ అక్కడ ఎలాంటి తీవ్రపదజాలం లేకున్నా చిత్రపటం ప్రదర్శన విమర్శలకు దారి తీసింది. దీనిపై టిటిడి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది వేచిచూ డాల్సిందే.




# తిరుమల సమాచారం

## 25 నుంచి ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా వడమాలపేటమండలం అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 25 నుండి జూలై 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ముందుగా 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 24న సాయంత్రం అంకురార్పణ ఘనంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామివారు వివిధ దివ్య వాహనాలపై విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. జూన్ 25 న ధ్వజారోహణం, పెద్దశేష వాహనం, జూన్ 26న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 27 న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం, 28న ఉదయం కల్పవృక్ష వాహనం, కల్యాణోత్సవం, రాత్రి సర్వభూపాల వాహనం, 29 న మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం, 30న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, జులై 1న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, జూలై 2న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, జూలై 3న చక్రస్నానం, ధ్వజావరోహణం జరుగుతాయి. జూన్ 28వ తేదీ సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు ప్రసన్న వేంకటేశ్వరస్వామికల్యాణోత్సవం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించనున్నారు. గృహస్తులు (ఇద్దరు) 500 రూపాయలు చెల్లించి పాల్గొనవచ్చు. పాల్గొనే దంపతులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డు, ఒక అప్పం బహుమానంగా అందజేయనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ మ్యూజిక్ కళాశాలల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక ప్రసంగాలు, భక్తి సంగీత కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, భజనలు, కోలాటాలు నిర్వహించి భక్తులను ఆధ్యాత్మిక పరవశంగా జరుగుతాయి.

## 16 నుంచి పెరియాళ్వార్ ఉత్సవాలు

### ప్రబంధ పాశురాల గానామృతంతో ఆధ్యాత్మిక వైభవం

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 16 నుండి 25వ తేదీ వరకు పెరియాళ్వార్ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి తమ శిష్యబృందంతో కలిసి పెరియాళ్వార్‌వారి సన్నిధిలో దివ్య ప్రబంధ పాశురాలను నివేదించనున్నారు. పాశురాల గానామృతంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మార్మోగనుంది. 25న తిరుమంజనం, గరుడ–గజ వాహనాలపై దివ్య విహారం చేయనున్నారు. ఉత్సవాల చివరి రోజైన జూన్ 25న ఉదయం పెరియాళ్వార్‌కు తిరుమంజనం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం గోవిందరాజ స్వామి గరుడవాహనంపై, పెరియాళ్వార్ గజవాహనంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దివ్యమంగళ దర్శనం ప్రసాదించనున్నారు.

పెరియాళ్వార్ మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రుడైన పరమభక్తుడు. భక్తి సంప్రదాయంలో విశిష్ట స్థానాన్ని పొందిన ఆయన, ఆండాళ్ అమ్మకి తండ్రి. ప్రతిరోజూ తులసీమాలలను తయారు చేసి స్వామివారికి సమర్పిస్తూ భగవత్సేవలో జీవితాన్ని అంకితం చేశారు. ఆయన సాన్నిధ్యంలో పెరిగిన ఆండాళ్ అమ్మవారు మన్నారాయణునినే తన భర్తగా భావించి భక్తి మార్గంలో ఆదర్శంగా నిలిచారు. దివ్య ప్రబంధాలలో ఎన్నో అమూల్యమైన పాశురాలను రచించిన పెరియాళ్వార్‌కు శ్రీమహావిష్ణువు సాక్షాత్కారం కలిగిన మహాభాగవతుడిగా వైష్ణవ సంప్రదాయం కీర్తిస్తుంది.



## టిటిడికి ట్రక్కు విరాళం

**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి పలు రకాలుగా విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. దాతలు శ్రీవారిపై భక్తి విశ్వాసాలతో విరాళాలందిస్తున్నారు. శనివారం ఉదయం అశోక్ లేలాండ్ లిమిటెడ్ సంస్థ టిటిడికి 31,72,532 లక్షల రూపాయలు విలువైన ట్రక్కును విరాళంగా అందించింది. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ట్రక్కు తాళాలను ,రికార్డులను టిటిడి ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి రవాణా విభాగం ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీ ప్రసన్న, తిరుమల డిఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

## రూ.44లక్షలు విరాళమిస్తే దాతపేరున అన్నప్రసాదాలు వడ్డింపు



**తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటే శ్వర స్వామి దర్శనార్థమ్ తిరుమలకు వస్తున్న లక్ష లాదిమంది భక్తులకు రుచిగా, శుచిగా అన్నప్ర సాదాలు వడ్డించేందుకు దాతలకు అవకాశం కల్పించారు. ఈ పథకం క్రింద దాత ఒకరోజుకు 44లక్షలు రూపాయలు విరాళాలిస్తే దాత స్వయంగా వచ్చి వడ్డించే అవకాశమేగాక దాత పేరు ప్రదర్శన చేస్తారు. తిరుమలకొండపై భక్తు లు ఆకలి అనేది తెలియకుండా అక్షయ పాత్రలా వచ్చిన ప్రతి ఒక్క భక్తుడికి రుచిగా అన్నప్రసా దాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్ర సాదం భవనంలోనేగాక మరికొన్ని ప్రాంతాల్లో అన్నప్రసాదాలు అందిస్తున్నారు. ఇం దుకుగాను ఒకరోజు విరాళ పథకం ప్రారంభించి, ఉదయం అల్పాహారం కోసం 10లక్షలు రూపా యలు, మధ్యాహ్నం భోజనం కోసం 17లక్షలు, రాత్రి భోజనం కోసం 17లక్షలు రూపాయలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించవచ్చు. అన్నప్రసాద భవ నంలో ఉదయం 8.30గంటల నుండి 10.30 గంటల వరకు చట్నీతో కలిపి ఉప్మా, పొంగళి, సేమ్యా ఉప్మా అందిస్తారు. ఉదయం 11గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ,తిరిగి సాయంత్రం 5గంటలనుండి రాత్రి11.30గంటల వరకు చక్కెరపొంగలి, చట్నీ,అన్నం, కూర, సాంబారు, రసం ,మసాలవడ మజ్జిగతో భక్తులకు వడ్డిస్తున్నారు. ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్ కు విరాళాలు కూడా 2,500 కోట్ల రూపాయలకు చేరిన విషయం విదితమే. ఈ ఆదాయంపై వచ్చే వడ్డీతోనే ఇప్పుడు ఎంతో నాణ్యతతో,రుచిగా అన్నప్రసాదాలు భక్తులకు వడిస్తున్నారు. రోజుకు లక్షమందివరకు భక్తులుఅన్నప్రసాదాలను భక్తితో స్వీకరిస్తున్నారు.

కార్మిక రాజ్య బీమా సంస్థ
(కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
कर्मचारी राज्य बीमा निगम
(श्रम एवं रोजगार मंत्रालय, भारत सरकार)
Employees' State Insurance Corporation
(Ministry of Labour & Employment, Govt. of India)
E.S.I.C.

ప్రాంతీయ కార్యాలయం/क्षेत्रीय कार्यालय /Regional Office
ఈ ఎస్ ఐ రోడ్డు, గుణదల, విజయవాడ – 520 004
ईएसआई रोड, गुणदला, विजयवाड़ा–520 004
ESI Road, Gunadala, Vijayawada-520 004
Telephone: 0866-2453498
e-mail : rd-andhrapradesh@esic.gov.in

**అడ్వకేట్స్ ఎంప్యానల్మెంట్ కోసం దరఖాస్తుల ఆహ్వానం ప్రకటన**

ఆంధ్రప్రదేశ్ లోని వివిధ న్యాయస్థానాలు, ట్రిబ్యూనల్స్, మరియు ఇతర జ్యుడీషియల్-క్వాజీ జ్యుడీషియల్ ఫోరంల ముందు కార్పొరేషన్ తరపున కేసులను నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్, విజయవాడలో ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ESIC), ప్రాంతీయ కార్యాలయంతో జాబితాలో చేర్చడానికి అర్హులైన అడ్వకేట్స్ నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.
అర్హత ప్రమాణం, నియమాలు మరియు షరతులు మరియు నిర్దేశించిన దరఖాస్తు ఫారంను కలిగిన వివరణాత్మకమైన నోటిఫికేషన్ ను ESIC, ప్రాంతీయ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ వెబ్ సైట్ : https://roap.esic.gov.in నుండి డౌన్ లోడ్ చేయవచ్చు.
కావలసిన డాక్యుమెంట్లతో పాటు పూర్తిగా భర్తీ చేసిన దరఖాస్తులు ప్రాంతీయ కార్యాలయం, ESIC, విజయవాడకు 10.07.2026న లేదా అంతకంటే ముందే చేరాలి.
ఎలాంటి కారణం చెప్పకుండానే దరఖాస్తు పత్రాన్ని తిరస్కరించడానికి లేదా స్వీకరించడానికి ESICకి హక్కు ఉంది.


**ప్రాంతీయ డైరెక్టర్**
**ప్రాంతీయ కార్యాలయం, ESIC, ఆంధ్రప్రదేశ్**

తుమ్మిహట్టి బ్యారేజీ సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేసే బాధ్యతను ఏడు నెల క్రితం డిసెంబర్ మొదటివారంలో ప్రభుత్వం ఆర్వీ అసోసియేట్స్‌కే అప్పగించింది. ఆ సంస్థ సర్వే ప్రక్రియను ప్రారంభించింది. ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఈ డిపిఆర్ ను సిద్ధం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. బ్యారేజీ ప్రతిపాదిత నిర్మిత ప్రదేశం నుంచి మైలారం గ్రామందాకా 75కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ సర్వే, మైలారం నుంచి సుందిళ్ల బ్యారేజీ దాకా టన్నెల్ అలైన్‌మెంట్‌పై సర్వే కూడా ఆ సంస్థ చేపట్టాల్సి ఉంటుంది. డీపీఆర్‌కు అనుమతులు సాధించే బాధ్యతను కూడా ప్రభుత్వం ఆ సంస్థకే అప్పగించింది. డిపిఆర్ తయారీ మూడు నెలల్లో, కేంద్ర జల వనరుల సంఘంలోని వివిధ డైరెక్టరేట్లనుంచి క్లియరెన్స్ తీసుకోవడం వంటి ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. బ్యారేజీని 148, 150, 152 మీటర్ల ఎత్తుతో కట్టడం వల్ల కలిగే ముంపుపై పుణెలోని కేంద్ర నీరు, విద్యుత్ పరిశోధన సంస్థ ఇప్పటికే అధ్యయనం చేసింది. ఈ విషయంలో నిపు ణుల అంచనాలు,లెక్కలు సరైనవేనా? కావా? నిర్ధారించే బాధ్యతను కూడా ప్రభుత్వం ఆర్ వి అసోసియేట్‌కే అప్పగించింది. ఇప్పటిదాకా కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ జోలికి పోకుండానే తుమ్మిడిహెట్టి డిపిఆర్ సిద్ధం చేయడానికి సూచనలు వస్తున్నాయి. అయితే కాళేశ్వరం లో భాగంగా అయితేనే ప్రాజెక్టు బెన్‌ఫిట్ కాస్ట్ రేషియో (ప్రాజెక్టుకు వెచ్చించేది ఎంత.. తిరిగి వచ్చేదెంత)పై కచ్చితంగా లెక్కలు సరిపోతాయని అధికారులు చెబుతున్నారు. మేడి గడ్డ నుంచైనా తుమ్మిడిహెట్టి నుంచైనా నీళ్ల అంతిమంగా చేరాల్సింది శ్రీపాద ఎల్లంపల్లికే నని, ఆ ప్రాజెక్టు వద్ద ఉన్న కాళేశ్వరం పంపులతో పాటు సుందిళ్ల బ్యారేజీని కూడా వాడుకుంటున్నప్పుడు తుమ్మిడిహెట్టి బ్యారేజీ కూడా కాళేశ్వరంలో భాగంగానే కడుతున్నా మని ప్రభుత్వం ముమ్ముందు ప్రకటించనుంది.

# ముదురుతున్న 'తెలుగు' జలవివాదాలు

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాల విస్తరణ మందకొడిగా కొనసాగుతోంది. దేశంలో వర్షాభావంతో సాగునీటికి, తాగునీటికి కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉందని దేశ,అంతర్జాతీయ పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆలమట్టి నుంచి కృష్ణాడెల్టావరకు గైక్వార్డు ప్రాజెక్టు నుంచి గోదావరి డెల్టాల సిస్టమ్ వరకు 18 ప్రధాన రిజర్వాయర్లలలో గరిష్ఠంగా 793.94 టిఎంసి నీరు నిల్వ ఉండాల్సి ఉండగా అందులో ప్రస్తుతం 280.39 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉంది. గత ఏడాది జూన్ మొదటి వారం వరకు 292.55 టిఎంసిలు ఈ రిజర్వాయర్లలో నీరు నిలిచి ఉంది. కృష్ణ బేసిన్‌లో గత ఏడాది నైరుతి రుతుపవనాలు మంచి వర్షాన్ని ఇచ్చాయి. పోయిన ఏడాది జూన్ 10 జూరాల గేట్లు ఎత్తి కిందికి లక్ష కూసెక్కుల నీటిని కిందికి వదిలారు. శ్రీశైలంలో జూన్ మూడోవారం వరకు జూరాల నుంచి సుమారు 8టిఎంసిల నీరు చేరుకొన్నది. గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఆలస్యంగా ప్రాజెక్టుల్లోకి నీరు వచ్చి చేరింది. తెలుగు రాష్ట్రాలకు జీవనాడులుగా ఉన్న కృష్ణా గోదావరి నదుల్లో పుష్కలంగా నీరు ప్రవహించిన రోజుల్లోనే నీటి పంపకాల విషయంలో గిల్లికజ్జాలు పెట్టుకొంటున్నాయి. నాగార్జున సాగర్‌పై ఇరు రాష్ట్ర పోలీసులు బాహాబాహీకి దిగిన రోజులున్నాయి. తెలంగాణ ఆధీనంలోని ఎన్ఎస్‌పి ఆనకట్టను సగం వరకు ఆంధ్రాపోలీసులు ఆక్రమించుకొన్నారు. కెఆర్ఎంబి సూచనలు పక్కనబెట్టి ఆంధ్రప్రదేశ్ నీటిని ఎక్కువ తరలించుకొని పోతుందని తెలంగాణ ఆరోపణలు చేయడం లేదు మా వాటాను మేం తీసుకొని పోతున్నామని ఆంధ్రప్రదేశ్ పాలకులు విమర్శలు చేయడం నిత్యకృత్యంగా మారింది. ఈ యేడు పుష్కల వర్షం ఉన్నా కూడా కృష్ణ జలాలలో కేవలం25శాతం మాత్రమే నీటిని ఉపయోగించుకొన్నామని తెలంగాణ అంటోంది. గోదావరి జలాలు కృష్ణాబేసిన్‌కు తరలించడంతో ఎగువ రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నీటివాటాను కర్ణాటక 16 టిఎంసిలు పైనే కృష్ణా జలాల నుంచి వాడుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకపక్షంగా అనుమతి ఇవ్వడంతో వివాదంగా మారింది. సూపర్ ఎల్‌నినో ప్రభావం వర్షాభావ పరిస్థితులు ఎదురవుతే ప్రాజెక్టుల్లో ఆశించిన స్థాయిలో నీరు చేరకపోతే రాబోయే రోజుల్లో మరింత ముదిరిపోయే అవకాశం ఉంది. కృష్ణా ట్రిబ్యునల్ అవార్డు తీర్పు త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. తెలంగాణకు ఆంధ్రప్రదేశ్‌కు నీటి వాటాలు కొత్తగా పంపిణీ చేయనున్నారు. ఇలాంటి సమయంలో పోలవరం కావేరి లింక్ చేయడం కూడా వివాదానికి



దారితీస్తోన్నది. తెలంగాణ సమాజం మొత్తం గోదావరి జలాలలో 968 టిఎంసిలకు అనుమతులు ఇచ్చాకే ఇంటర్ లింక్ చేయాలని కోరుతోన్నది. ఇచ్చంపల్లి కావేరి అనుసంధానం చేయాలని ఇంటర్ లింక్ చేసిన నీళ్లలో సగం తెలంగాణకు ఇవ్వాలని పేచి పెడుతోంది. పోలవరం కావేరి లింక్ చేయడం తెలంగాణ నుంచి వ్యతిరేకత వస్తోంది. ఆంధ్రకు ఇప్పటికే ఒక జాతీయ ప్రాజెక్టు ఉందని ఇచ్చంపల్లి కడితే ఇక్కడ కూడా ఒక జాతీయ ప్రాజెక్టు వస్తోందని భావిస్తోంది. అంతేకాదు ఇచ్చంపల్లి నాగార్జున సాగర్ అనుసంధానం వల్ల తెలంగాణలో అనేక కరవుపీడిత ప్రాంతాలకు నీటివసతి ఏర్పడే అవకాశం ఏర్పడుతోంది. గోదావరిపై ఇప్పటికే తెలంగాణ సుమారు 139 టిఎంసిల వినియోగంకు కేంద్ర జలసంఘం చేసిన విన్నపాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ పాలక పార్టీలు భాగస్వాములు కావడంతో జలశక్తి కార్యాలయంలో తన పట్టును చంద్రబాబు పెంచుకొన్నారు. జలశక్తి మంత్రిత్వ శాఖ సెక్రటరీగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కాంతారావుకు పోస్టింగ్ ఇచ్చుకొని ఆ రాష్ట్రం నీటి ప్రయోజనాలు పరిక్షణకు అనువైన వాతావర్ణం ఏర్పాటు చేసుకొన్నారు. దీనితో తెలంగాణకు చెందిన గోదావరిపై నీటి వినియోగం కోసం సిడబ్ల్యుసిలోఉన్న ప్రతిపాదనల పెండింగ్‌లో పడ్డాయి. 139 టిఎంసిలకు అనుమతులు వస్తాయా రావా అనే సంశయం ఇప్పుడు తెలంగాణ సమాజంలో నెలకొంది. రాబోయే రోజుల్లో గోదావరి మీద తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇస్తారా అనే శంక కూడా మొదలైంది. ఇది ఇలా ఉంటే పోల వరం కావేరి అనుసంధానం చేస్తే గోదావరిలో 213 టిఎంసిల నీరు తెలంగాణ కోల్పో యే అవకాశం ఉందని తెలంగాణ ప్రాంత నీటినిపుణులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇస్తే గోదావరిలో తెలంగాణకుఅన్యాయం జరుగుతుందని భయాందోళనలు మొదలైనాయి.గోదావరి జలాలను కృష్ణా పరివాహకానికి తరలిస్తే జిడబ్ల్యూడిటి అవార్డు ప్రకారం.. 14: 21: 45 నిష్పత్తి ప్రకారం హక్కులు ఎగువ రాష్ట్రాలకు సంక్రమిస్తాయి. 14 కర్ణాటకకు, 21 మహారాష్ట్రకు, 45 తెలంగాణకు నీటివాటాలు ఆంధ్రప్రదేశ్ ఇవ్వాల్సి ఉంటుంది. పోలవరం విషయంలో అవార్డు పాసైందని ప్రచారం జరుగుతోంది. 80 టిఎంసిల కంటే ఎక్కువ నీళ్ల తీసుకెళ్తే ఇవే హక్కులు సంక్రమిస్తాయి. బనకచర్ల, నల్లమల సాగర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనలు విరమించుకొన్నాడు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గోదావరిలో మిగులు జలాలు ఉన్నాయనీ అంటే బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు మిగులు జలాలు లేవని, మిగులు జలాలపై ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని పేచిపెడుతున్నారు. గోదావరి మిగులు జలాల విషయం కేంద్రమే స్పష్టం చేయడంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు గోదావరికావేరి ఇంటర్ లింకింగ్‌ను ముందుకు తీసుకొచ్చారు.2014 నుంచి గోదావరి కావేరి అనుసంధానం తెరపైకి వచ్చింది. తెలంగాణ భూభాగం టచ్ కాకుండా గోదావరి నీటిని తీసుకెళ్లే ప్రయత్నం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయంజరుగుతోందని తెలంగాణ వారు ఆందోళన చెందుతున్నారు రూపాయి ఖర్చు లేకుండా ఇచ్చంపల్లి వద్ద జాతీయ ప్రాజెక్టు కింద నిర్మించుకునే అవకాశం కోల్పోవడంతోపాటు. సమ్మక్క సాగర్ 47 టిఎంసిలనీటిని కూడా వదులుకోవాల్సి వస్తోందని భావిస్తున్నారు. తుమ్మడి హట్టి ప్రాణహితపై 152 అడుగుల ఎత్తుతో ప్రాజెక్టు కట్టడానికి మహారాష్ట్రా ముఖ్య మంత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి లేఖ రాసినా ఉలుకూపలుకు లేకపోవడంతో తెలంగాణలో రాజకీయంగా వేడెక్కింది. కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం మధ్య మాటల యుద్ధం నడిచింది. ఆంధ్రప్రదేశ్ దాదాపు రూ. 14100 కోట్ల కేంద్ర నిధులతోభారీ సాగు ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకొంది. గోదావరి డెల్టా జీవనాడిఅయిన ధవళేశ్వరం బ్యారేజీని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం రూ. 150 కోట్లు కేటాయించింది. పాత గేట్లను తొలగించి కొత్తవి అమర్చే పనులను ప్రభుత్వం ప్రారంభించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజులు మహబూబ్‌నగర్ జిల్లాలో మకాం వేసి అక్కడి పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. ప్రతి ప్రాజెక్టును కాలపరిమితో పూర్తిచేయడానికి లక్ష్యం కూడా విధించారు. మరోవైపు తెలం గాణలో సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహు ళార్థ సాధక ప్రాజెక్టు లోని సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి అవసరమైన పర్యావరణ అనుమతులను సాధించడానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దేవాదులప్రాజెక్టును ప్రారంభించి పాతిక సంవత్సరాలు గడిచి పోయినా.. ఇప్పటివరకు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ పూర్తికాలేదు. ఇది ఒక ఆందోళనకర పరిస్థితిగా మారింది. ●

పశ్చిమ బెంగాల్

# మరో అవతారం!

**ఎ.వి.వి ప్రసాద్**

రాజకీయ వైకుంఠ పాళిలో ఎవరు ఎప్పుడు నిచ్చెనలెక్కుతారో, ఎవరు ఎటువంటి పాము నోట చిక్కుతారో చెప్పడం కష్టం. నిచ్చెన ఎక్కుతూ హఠాత్తుగా పాము నోట పడే పరిస్థితి వస్తుంది. పైనుంచి మళ్లీ అట్టడుగుకు చేరుకోవలసి వస్తుంది. వరుసగా మూడు సార్లు ముఖ్యమంత్రి కావడమే గాక ప్రత్యర్థి బిజెపిని ఓ ఆట ఆడించిన మమతా బెనర్జీ ఇప్పుడు సరిగ్గా అదే పరిస్థితిలో ఉన్నారని గతవారం పరిణామాలను బట్టి అనుకోవలసి వస్తుంది. పార్టీ ఓడిపోవడం కంటే ఆ పార్టీ నుంచి ఒక్కొక్కరు జారిపోవడమే ఇప్పుడామెను మరింత కృంగదీస్తున్నట్లుగా కనిపిస్తోంది. గతవారం ఆమె ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం తొలుత అందరికి ఆశ్చర్యాన్ని కలిగించింది. తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానంతో ఆమె జరిపిన చర్చలు మరింత ఆశ్చర్యాన్ని కలిగించాయి. రెండో పర్యాయం సిఎం అయినప్పటినుంచే మమత వైఖరిలో చాలా మార్పు వచ్చింది. కాంగ్రెస్‌తో కలిసి నడిస్తే పార్లమెంటులో తగిన స్థానం లభించకపోవచ్చనే ఆలోచనతో క్రమంగా ఆ పార్టీకి చాలా దూరం జరిగారు. సోనియా, రాహుల్‌ను కొన్ని సార్లు నేరుగా విమర్శించారు కూడా. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడినప్పుడుతొలుత ఆ కూటమిలో కీలక పాత్ర వహించినా తర్వాత ఆ కూటమికి కూడా దూరమయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వేర్వేరుగానే పోటీ పడ్డాయి. కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించవలసిందిగా మమత పిలుపునిచ్చారు కూడా. అక్కడితో కూటమితో పూర్తిగా తెగతెంపులు జరిగాయి.కానీ ఎన్నికల్లో ఓడిపోయి పదవి పోగానే ఆమె మళ్లీ కూటమికి చేరువై సోనియా, రాహుల్‌తో సన్నిహితంగా కనిపించడమే విశేషం. అంతేగాక గతవారం సోనియా గాంధీతో రెండుసార్లు 'ఆంతరంగిక' సమావేశం జరిపారని కూడా వినిపించింది. మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయబోతున్నారనే వదంతులు ఆ వెంటనే వ్యాపించాయి. నిప్పు లేనిదే పొగ రాదన్నట్లు ఆ ప్రచారంలో కూడా కొంత నిజం ఉందనే అనిపించింది. కాంగ్రెస్ అధిష్ఠానం పెట్టిన కొన్ని షరతులపై ఇంకా ఒక నిర్ణయం తీసుకోనందువల్లనే ఆలస్యమవుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ పరిస్థితి కూడా నిరాశాజనకంగానే ఉంది.పరిస్థితి క్షీణించిన కాంగ్రెస్‌తో చేతులు కలపడం వల్ల ప్రయోజనం ఉంటుందా! అని మమత ఆలోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. 2024లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కు దేశవ్యాప్తంగా 99 సీట్లు రాగా, తృణమూల్‌కు ఒక్క బెంగాల్‌లోనే 29 సీట్లు వచ్చాయి. కూటమి భాగస్వామ్య పక్షమైన డిఎంకెకు తమిళనాట 22 సీట్లు వచ్చాయి. ఇప్పుడు ఆ డిఎంకె, మూడు సీట్లున్న ఆప్ కూడా కూటమికి దూరమయ్యాయి. అంటే కూటమి నుంచి ఓపాతిక సీట్లు జారిపోయినట్లే. తృణమూల్ కాంగ్రెస్ తిరిగి కూటమిలోకి వచ్చినా ఆ పార్టీకి ఎంపీలు



మమతా బెనర్జీ

గాని, ఎమ్మెల్యేలు గాని మునుపటిలా లేరు. తృణమూల్ లోని 60మంది పైగా ఎమ్మెల్యేలు, 20మంది పైగా ఎంపీలు ఇప్పటికే జారుకున్నారు. వారంతా బిజెపిలోకి వెళ్లబోతున్నారని వేరే చెప్పక్కర్లేదు.అంటే తృణమూల్ తిరిగి ఇండియా కూటమిలో ఉన్నా, కూటమి మొత్తం బలం 200 దాటకపోవచ్చు.ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్‌కు 80 సీట్లు రాగా ఇప్పుడు వారిలో 60 మంది పైగా రెబెల్ గ్రూపుగా ఏర్పడ్డారు. ఆ ఎమ్మెల్యేలే గాక, మమతకు 'లాయల్' ఉన్నారనుకొంటున్న మరి కొందరు ఎమ్మెల్యేలు కూడా గత శుక్రవారం ముఖ్యమంత్రి సువేందు నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరు కావడాన్ని బట్టి చివరికి మమత గ్రూపులో ఓ నలుగురైదుగురు ఎమ్మెల్యేలే మిగలవచ్చనీ, అభిషేక్ బెనర్జీ అనుచరులు కూడా ఎవరూ మిగిలేట్లు కనిపించడం లేదనీ తెలుస్తోంది. ఈ పరిస్థితిలో తృణమూల్‌ను ఇండియా కూటమిలో కొనసాగించినా, లేక కాంగ్రెస్‌లో విలీనం చేసుకున్నాఒరిగే ప్రయోజనం ఏదీ ఉండకపోవచ్చు. ఆ విషయం గ్రహించినందునే తృణమూల్ విలీన ప్రతిపాదనపై నిర్ణయాన్ని కాంగ్రెస్ వాయిదా వేసుకున్నట్లు చెబుతున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రెండు సీట్లు మాత్రమే వచ్చాయి. 1977 వరకు రాష్ట్రంలో ఆధిపత్యాన్ని కొనసాగించిన కాంగ్రెస్ తర్వాత వామపక్షాలు, ఆ తర్వాత తృణమూల్‌కు, తాజాగా బిజెపికి తన సీట్లు, ఓట్లను కోల్పోయింది. ఇప్పుడు కేవలం రెండు సీట్లు, దాదాపు మూడు శాతం ఓట్లు మాత్రమే ఉన్న కాంగ్రెస్‌లో విలీనమైతే 40 శాతం ఓట్లున్న తృణమూల్‌కు కలిగే ప్రయోజనం ఎంత? అనే ప్రశ్న వినిపిస్తోంది. 207సీట్లు,45శాతం ఓట్లు ఉన్న బిజెపిని ఎదుర్కొనడానికి కాంగ్రెస్ బలం సరిపోతుందా? అనే ప్రశ్న కూడా తృణమూల్ నేతల నుంచి వినిపిస్తోంది. తృణమూల్‌లోని మెజారిటీ ఎమ్మెల్యేలు ఇప్పుడు రెబెల్ గ్రూపుగా ఏర్పడి తమకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్‌ను కోరుతున్నారు. వారికి ఆ గుర్తింపు లభిస్తే ఒరిజినల్ తృణమూల్ కాంగ్రెస్ తమదే అని వారు చెప్పవచ్చు. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీకి పట్టిన గతే తృణమూల్‌కు కూడా పట్టవచ్చు. ఆ పరిస్థితిలో మమత తృణమూల్ గ్రూపు కాంగ్రెస్‌లో విలీనం సాధ్యమవుతుందా! అన్నదీ సందేహమే. రెబెల్ ఎమ్మెల్యేల సంఖ్య ఇప్పటికే 68కి,రెబెల్ ఎంపీల సంఖ్య 25కు చేరినట్లు తాజాసమాచారం.అంటే మమత గ్రూపులో 95 శాతం ఖాళీఅయినట్లే అనుకోవాలి. ఈ పరిస్థితిలో ఆమె కొత్త అవతారం ఎత్తినా ఎంతవరకు సక్సెస్ అవుతారనే సందేహం అందరిలో కలుగుతోంది.మమత వ్యూహాలు ఎప్పుడూప్రత్యేకంగానే ఉంటాయి. ఈ తుపాను లోంచి బయటపడడానికి ఆమె ఏ అవతారం ఎత్తుతారో చూడాలి. ఇండియా కూటమిలో కొనసాగినా, లేకపోయినా తృణమూల్ కు కలిగే ప్రయోజనం ఏదీ లేదనే పరిశీలకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితిలో ఆమె వ్యూహం ఎలా ఉంటుందో చూడాలి. ●

బెల్జియం

# 'నాటో' పై ట్రంప్ జులుం!

**గన్ని మోహన్**

పశ్చిమాసియా ఉద్రిక్తతలతో తలమునకలవుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఓ పక్క ఇరాన్‌కు సాయం అందిస్తున్న దేశాలను మచ్చిక చేసుకుంటూనేఇప్పుడు నాటో సైనిక కూటమిపై దృష్టిసారించారు. రెండోప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన నాటో కూటమికి యుద్ధవిమానాలు,యుద్ధనౌకలు సహా నిఘావ్యవస్థలన్నీ కూడా తగ్గించాలని ట్రంప్ నిర్ణయించారు. ఇప్పటివరకూ ఐరోపా రక్షణకు అత్యంత బాసటగా నిలిచిన ట్రంప్ ఈ నిర్ణయానికి కారణం హార్ముజ జలసందిని పూర్తిస్థాయిలో తెరిపించడంలో నాటోకూటమి కలిసిరాలేదన్నదే ఆయన కోపం. అందుకే వైమానిక, నేవీ మద్దతును తగ్గించాలని నిర్ణయించారు. ఇప్పటివరకూ నాటోకు అందుబాటులో ఉన్న 150 ఎఫ్16, ఎఫ్15 ఇ యుద్ధవిమానాలను 100కు తగ్గించాలని అలాగే సముద్రజలాలపై నిఘాకోసం వినియోగించే విమానాల సంఖ్యను కూడా 26నుంచి 15కు తగ్గించాలని నిర్ణయించింది. అలాగే గగనతలంలోనే ఇంధనం నింపే ట్యాంకర్ జట్లను కూడా నాటోకు పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించింది. ఇందుకు కారణం కేవలం హార్ముజ్, బాబ్ ఎల్‌మండెజ్ జలసంధుల్లో నెలకొన్న అనిశ్చితిని కట్టడిచేయడంలో అమెరికాకునాటో కూటమి కలిసిరాలేదన్న అక్కసుఒక్కటే. ఉత్తర అట్లాంటిక్ ఒప్పంద సంస్థగా పిలిచే ఈ నాటోఐరోపా కూటమి దేశాలకు అత్యంత భద్రతనిచ్చే అతిపెద్ద సైనిక కూటమిగా నిలిచింది. ముందు 12దేశాలతో ఏర్పాటైన ఈ కూటమి32 దేశాలకు విస్తరించింది. రష్యా దూకుడును కట్టడిచేసేందుకు ఆనాడు ఏర్పాటు చేసిన ఈ కూటమి ప్రపంచంలోనే అతిపెద్ద ఉమ్మడి సైనిక కూటమి అని చెప్పాలి. సభ్యదేశాల్లో ఏ ఒక్క దేశంలో భద్రత కొరవడినా, దాడులు జరిగినా నాటో స్పందించి రక్షణగా నిలుస్తుంది. బెల్జియంలోని బ్రస్సెల్స్ కేంద్రంగా పనిచేస్తోంది. ప్రస్తుతం నెదర్లాండ్స్ మాజీ ప్రధాని మార్క్‌రుట్టే సెక్రటరీ జనరల్‌గా వ్యవహరిస్తున్నారు. ఆనాడు రష్యాను నిలువరించేందుకు సరిహద్దు దేశాలు నార్వే, ఫిన్‌ల్యాండ్, ఎస్తోనియా,లాత్వియా, లిథువేనియా, పోలండ్ దేశాలు కూడా నాటో సభ్యదేశాలుగా ఉన్నాయి. అలాగే ఉక్రెయిన్‌పై రష్యా దూకుడును కట్టడిచేసేందుకు నాటో సభ్యదేశాలు కూడా దౌత్యపరంగా పనిచేస్తున్నాయి. అవి పోలండ్,రొమేనియా, స్లోవేకియా దేశాలున్నా రష్యా తనదాడులు నిలపడంలేదు. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత 'మాగా' లక్ష్యగా దూకుడుగా వెళుతున్న సంగతి తెలిసిందే.ప్రపంచదేశాలకు కొరకరాని కొయ్యగా తయారయిన ట్రంప్ తాజాగా నాటోపై ఫోకస్ పెంచారంటే ఆ సైనిక కూటమిని నిర్వీర్యంచేసి నిస్తేజం చేయాలన్న కాంక్ష ఆయనలో కనిపిస్తోంది. కొత్తగా నాటోలో ఫిన్‌ల్యాండ్, స్వీడన్ దేశాలు కూడా చేరాయి. ఈ కూటమి మొత్తం రష్యా విస్తరణ కాంక్షను అడ్డుకునేందుకేనని స్పష్టంగా చెప్పవచ్చు. రష్యాకు పాశ్చాత్యదేశాల మధ్య



మార్క్ రుట్టే

ఉన్న ఉద్రిక్తతలను కట్టడిచేసి రష్యా ఆధిపత్యం తగ్గించేందుకే ఈ కూటమి పనిచేస్తుంది.ఇందులో భాగంగానే నాటో ఆధ్వర్యంలో ఉక్రెయిన్‌కు సైనిక, ఆయుధ సాయం అందించాలనేది వ్యూహం అయితే ఇందుకు రష్యా ససేమిరా అంగీకరించకపోవడంతో ఉక్రెయిన్‌కు ఆయుధ సమస్య కూడా పెరిగిందనే చెప్పాలి. నాటోలో ఉన్న 32 దేశాల కూటమి మొత్తం జిడిపి 38 లక్షలకోట్ల డాలర్లుగా ఉంటుంది. అత్యంత శక్తివంతమైన సైనిక కూటమిగా ప్రపంచంలో విస్తరించింది. ప్రస్తుతం 30లక్షల దళాలున్నాయి. మరింతగా విస్తరించేందుకు ఈనాటో పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ఈకూటమిపై ట్రంప్ ఫోకస్ పెంచడానికి ప్రత్యేక కారణం అటు హార్ముజ్, బాబ్ఎల్‌మండెజ్ జలసంధుల్లో ఇరాన్‌ప్రభావం తగ్గించడంలో కలిసిరాలేదన్న దుగ్ధతోపాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణి దాడులుచేయడం కూడా ట్రంప్‌ను కలవరపరిచింది. అంతేకాకుండా చైనా,రష్యాలు ఇరాన్‌కు రహస్యంగా ఆయుధసాయం అందిస్తున్నాయన్న అనుమానాలు కూడా ట్రంప్‌లో పెరిగిపోయాయి. వీటన్నింటి దృష్ట్యా నాటో కూటమి స్పందించలేదన్న అక్కసు ట్రంప్‌లో బలంగా నాటుకుపోయింది. ట్రంప్ భావిస్తున్నట్లుగానాటో కూడా ప్రత్యక్షంగా స్పందించిన సందర్భాలుకూడా లేవు. ప్రత్యేకించి ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా సైనిక చర్యల్లో పాల్గొనలేదు. నాటో సభ్యదేశాలు కూడా అమెరికా పిలుపునకు స్పందించలేదు.గత సంఘటనలు దృష్టిలో ఉంచుకున్న ట్రంప్ నాటోపైఫోకస్ పెంచారని స్పష్టం అవుతోంది. సభ్యదేశాలైన ఫ్రాన్స్,బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు కూడా హార్ముజ్‌పై స్పందించకపోగా నాటోపరంగా ఒత్తిడి కూడా తీసుకురాకపోవడం కూడా ట్రంప్ కన్నెర్రకు కారణమైంది. అంతేకాకుండా నాటోకు నిధుల సాయంలో అతిపెద్ద వాటా కూడా అమెరికాకు ఉంది. 600 మిలియన్ డాలర్లు సాలీనా నిధులు అందించడంతోపాటు ఆయుధసామగ్రి కూడా అందిస్తోంది.నాటో నిర్వహణ వ్యయంలో 15.88 శాతం అమెరికాయే భరిస్తోంది.అందువల్లనే నాటోపై ట్రంప్ ఆగ్రహంతో ఉన్నారు.ఇతరదేశాలు కూడా తమ జిడిపిలో 2శాతం చొప్పున నిధులు అందిస్తున్నాయి. అమెరికా తన రక్షణరంగ బడ్జెట్ 980 బిలియన్ డాలర్లు అంటే నాటోమొత్తం 32 సభ్యదేశాల జిడిపిలో 60శాతానికి సమానంగాఖర్చుచేస్తోంది. అందువల్లనే అమెరికా నాటోపై పెత్తనం మాదేనన్నట్లుగా వ్యవహరిస్తోంది. కేవలం రష్యాను కట్టడిచేసేందుకే ఏర్పాటు చేసిన ఈ కూటమి భవిష్యత్తులో నిర్వీర్యం అవుతుందా?ట్రంప్ తన హఠాత్ నిర్ణయాలతో ఒకవేళ నాటో నుంచి వైదొలుగుతారా అన్నది ఐరోపా కూటమి దేశాలతోపాటు ప్రపంచదేశాల్లో నలుగుతున్న జవాబు లేని ప్రశ్న.ఈప్రశ్నకు సమాధానం కూడా సమీప భవిష్యత్తులో ట్రంప్ నుంచే వెలువడాల్సి ఉంటుందని ఐరోపా కూటమిబలంగా విశ్వసిస్తోంది. అమెరికానాటోపట్ల అనుసరించే భవిష్యత్తు వైఖరి ట్రంప్ సమాధానంపైనే ఆధారపడి ఉంది. ●

# వాతావరణ సంక్షోభానికి ప్రకృతే పరిష్కార మార్గం

**డి జె మోహన రావు**

ఒకప్పుడు వాతావరణ మార్పులు అంటే భవిష్యత్తులో సంభవించే ప్రమాదంగా మాత్రమే భావించేవారు. శాస్త్రవేత్తల నివేదికలు, అంతర్జాతీయ సదస్సులు, పర్యావరణవేత్తల హెచ్చరికలకే పరిమితమైన అంశంగా కనిపించేది. అయితే నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వాతావరణ సంక్షోభం ఇక భవిష్యత్తు ముప్పు కాదు. మన దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తున్న వాస్తవం. వేసవి పూర్తిగా ప్రారంభం కాకముందే దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటుతున్నాయి. మరో వైపు, కొన్ని గంటలపాటు కురిసే భారీ వర్షాలు నగర జీవితాన్ని స్తంభింపజేస్తున్నాయి. ప్రపంచ వాతావరణసంస్థ ప్రకారం 2024 సంవత్సరం ప్రపంచ చరిత్రలోనే అత్యంత వేడిగా నమోదైంది. పారిశ్రామిక యుగానికి ముందున్న సగటుతో పోలిస్తే భూగోళ సగటు ఉష్ణోగ్రత దాదాపు 1.5 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగింది. కరవులు, వరదలు, అటవీ అగ్నిప్రమాదాలు, తుఫాన్లు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఇవన్నీ ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందన్న హెచ్చరికలే. ఈ హెచ్చరికలు మన అభివృద్ధి నమూనాలను, జీవన విధానాలను పునఃపరిశీలించుకునే అవకాశంగా మారాలి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కార్బన్ ఉద్గారాల తగ్గింపు, పునరుత్పాదక ఇంధనాల వినియోగం, హరిత సాంకేతికతల అభివృద్ధిపై చర్చ జరుగుతోంది.ఇవన్నీ అవసరమైన చర్యలే. అయితే వాతావరణ సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోవాలంటే ఒక ప్రాథమిక ప్రశ్నకు సమాధానం వెతకాల్సిందే. భూమిపై జీవం కోట్లాది సంవత్సరాలుగా అనేక మార్పులను ఎదుర్కొంటూ ముందుకుసాగింది. ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, ప్రకృతి విపత్తులు, పర్యావరణ పరిణామాల మధ్య ప్రకృతి తనను తాను పునర్నిర్మించుకుంటూ నిలబడింది. అందుకే ప్రకృతిని కేవలం సంరక్షించాల్సిన వనరుగా మాత్రమే కాకుండా, నేర్చుకోవాల్సిన గురువుగా కూడా చూడాలి. వాతావరణ సంక్షోభానికి పరిష్కార మార్గాలను సూచించే అనేక సూత్రాలు ప్రకృతిలోనే నిక్షిప్తమై ఉన్నాయి. ప్రకృతి చెప్పే మొదటి పాఠం వైవిధ్యమే బలం అని. ప్రకృతిలో ఏ వ్యవస్థా ఏకరూపంగా ఉండదు. అడవుల్లో వందలాది రకాల చెట్లు, మొక్కలు, పక్షులు, జంతువులు, సూక్ష్మజీవులు పరస్పర సహకారంతో జీవిస్తాయి. ఈ వైవిధ్యమే వాటి స్థిరత్వానికి, మనుగడకు మూలం. ఐక్యరాజ్యసమితి జీవవైవిధ్య అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10లక్షల జాతులు అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఒక జాతి నష్టపోయినా మొత్తం వ్యవస్థ కుప్పకూలదు. వాతావరణ మార్పుల కాలంలో ఈపాఠం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. వ్యవసాయ రంగాన్నే తీసుకుంటే, ఒకే పంటపై ఆధారపడే విధానాలు అధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. వర్షపాతం మారినా, తెగుళ్ల వ్యాపించినా రైతు ఆదాయం మొత్తం దెబ్బతింటుంది. అదే మిశ్రమ పంటలు, స్థానిక విత్తనాలు, వ్యవసాయ అటవీ విధానాలు అదనపు రక్షణ కల్పిస్తాయి. కాబట్టి జీవ వైవిధ్య పరిరక్షణ అనేది కేవలం పర్యావరణ అంశం మాత్రమే కాదు, అది ఆహార భద్రత, ఆర్థిక భద్రత, సామాజిక స్థిరత్వానికి కూడాపునాది. ప్రకృతి చెప్పే రెండో పాఠం పునరుద్ధరణ సామర్థ్యం. శాస్త్రీయ పరిభాషలో దీనిని రెసిలియెన్స్ అంటారు. ప్రకృతిలో ఏ వ్యవస్థా శాశ్వత స్థితిలో ఉండదు. పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ ముందుకు సాగుతుంది. వరదల తర్వాత నదులు మళ్లీ తమ ప్రవాహాన్ని సర్దుబాటు చేసుకుంటాయి. అగ్నిప్రమాదాల అనంతరం అడవులు క్రమంగా పునరుజ్జీవనం పొందుతాయి. ఇదే ప్రకృతి అసలు బలం. నేడు ఇదే లక్షణం మానవ సమాజానికీ అత్యవసరం. నగరాలు, గ్రామాలు, వ్యవసాయ వ్యవస్థలు, మౌలిక సదుపాయాలు వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకోవాలి. వరదలు వచ్చినప్పుడు నీటిని పూర్తిగా బయటకు పంపే ప్రయత్నం చేయడం కంటే, దానిని నిల్వ చేసుకునే సహజ వ్యవస్థలను బలోపేతం చేయడం మరింత ప్రయోజనకరం. వర్షపు నీటి సంరక్షణ,



చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పునర్భరణ వంటి చర్యలు వాతావరణ అనుకూలతను పెంచుతాయి. ప్రకృతి చెప్పే మూడో పాఠం పరిమితుల పట్ల గౌరవం. ప్రకృతిలో ప్రతి వ్యవస్థకు ఒక భరించే సామర్థ్యం ఉంటుంది. నదులు, అడవులు, నేలలు, సముద్రాలు అన్నింటికీ హద్దులు ఉన్నాయి. ఆ పరిమితులను దాటినప్పుడు సమతుల్యత దెబ్బతింటుంది. ప్రస్తుతం ఎదురవుతున్న అనేక పర్యావరణ సమస్యలకు మూల కారణం ఇదే. అధిక భూగర్భ జల వినియోగం, అడవుల నరికివేత,తీరప్రాంతాల ఆక్రమణ, సహజ జలవనరుల విధ్వంసం వంటి చర్యలు ప్రకృతి పరిమితులను విస్మరించిన ఫలితాలే. అభివృద్ధి అంటే ప్రకృతిని జయించడం కాదని, దానితో సమన్వయంగా ముందుకు సాగడమేనని ఈ పాఠం గుర్తు చేస్తుంది. భవిష్యత్తు అభివృద్ధి నమూనాలు కూడా ప్రకృతి సామర్థ్యాలను గౌరవించే విధంగానే రూపుదిద్దుకోవాలి. వాతావరణ మార్పులను ఎదుర్కొనే క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి ఆధారిత పరిష్కారాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, అంతర్జాతీయ సంస్థలు ప్రకృతి అందించే సేవల విలువను మరింత స్పష్టంగా గుర్తిస్తున్నాయి. దీనికి అడవులే ఉత్తమ ఉదాహరణ. ప్రపంచంలో అతిపెద్ద సహజ కార్బన్ నిల్వ కేంద్రాలుగా అవి పనిచేస్తాయి. ప్రపంచ కార్బన్ ఉద్గారాల్లో సుమారు 30 శాతం వరకు శోషించడంలోఅడవులు, ఇతర సహజ పర్యావరణ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమంఅంచనా వేస్తోంది. వర్షపాతం చక్రాన్ని ప్రభావితం చేయడం, నేల సారాన్ని కాపాడటం, జీవ వైవిధ్యానికి ఆశ్రయం కల్పించడం వంటి అనేక సేవలను అవి అందిస్తాయి. అందువల్ల అడవుల సంరక్షణ అనేది కేవలం పర్యావరణ కార్యక్రమం కాదు, వాతావరణ విధానంలో కీలక అంశం.చిత్తడి నేలలు, చెరువులు, సరస్సులు, మడ అడవులు కూడా అమూల్యమైన సేవలను అందిస్తున్నాయి. ఇవి వరద నీటిని నిల్వ చేస్తాయి, తీర ప్రాంతాలను రక్షిస్తాయి, భూగర్భ జలాలను పునరుద్ధరిస్తాయి. అయితే పట్టణీకరణ, భూ వినియోగ మార్పుల కారణంగా ఈ వ్యవస్థలు వేగంగా కనుమరుగవుతున్నాయి. ఈ నష్టాన్ని పూడ్చుకోకుండా వాతావరణ అనుకూల అభివృద్ధి గురించి మాట్లాడటం అసంపూర్ణమే. నగరాల్లో ప్రకృతి పాత్రను కూడా కొత్తగా నిర్వచించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ జనాభాలో సగానికి పైగా ప్రజలు ఇప్పటికే నగరాల్లో నివసిస్తున్నారు. భారతదేశంలోనూ పట్టణీకరణ వేగంగా విస్తరిస్తోంది. కాంక్రీటు నిర్మాణాలు పెరగడం, పచ్చదనం తగ్గిపోవడం వల్ల నగరాలు అధిక ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్నాయి. చెట్లు, పార్కులు, నగర అడవులు, గ్రీన్ కారిడార్లు ఉష్ణోగ్రతలను తగ్గించడమే కాకుండా గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి. ప్రజారోగ్యానికి కూడా తోడ్పడతాయి. భారతదేశానికి నీటి వనరుల పరిరక్షణ మరింత కీలకం. ప్రపంచ జనాభాలో దాదాపు 18శాతం మంది భారతదేశంలో నివసిస్తున్నప్పటికీ,ప్రపంచ మంచినీటి వనరుల్లో కేవలం 4 శాతం మాత్రమే మనకు అందుబాటులో ఉన్నాయి. నీతి ఆయోగ్ అంచనాల ప్రకారం దేశంలో సుమారు 60 కోట్ల మంది ప్రజలు ఇప్పటికే నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఈ ఒత్తిడి మరింత పెరుగుతోంది. అందువల్ల సంప్రదాయ నీటి సంరక్షణ వ్యవస్థలు, చెరువులు, కుంటలు, వర్షపు నీటి సేకరణ పద్ధతుల పునరుద్ధరణ అత్యవసరంగా మారింది. అంతేకాదు, భారతీయ సమాజంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న స్థానిక పర్యావరణ జ్ఞానం కూడా విలువైన సంపద. నీటి నిర్వహణ, భూసార పరిరక్షణ, సామూహిక వనరుల సంరక్షణకు సంబంధించిన అనేక సంప్రదాయ పద్ధతులు గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కనిపిస్తాయి. ఆధునిక శాస్త్ర సాంకేతికతతో వాటిని అనుసంధానిస్తే మరింత స్థిరమైన ఫలితాలు సాధ్యమవుతాయి. వాతావరణ చర్య అనేది ప్రభుత్వాలకే పరిమితమైనబాధ్యత కాదు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, పౌర సమాజం, ప్రతి వ్యక్తి ఇందులో భాగస్వాములు కావాలి. శక్తి వినియోగాన్ని తగ్గించడం, నీటిని పొదుపుగా వినియోగించడం, వ్యర్థాలను తగ్గించడం, పచ్చదనాన్ని పెంచడం వంటి చర్యలు వ్యక్తిగత స్థాయిలో చిన్నవిగా కనిపించినా, సమిష్టిగా అవి పెద్ద మార్పుకు దారితీస్తాయి. ప్రకృతి స్ఫూర్తితో ముందుకు సాగే సమాజమే భావితరాలకు సురక్షితమైన, స్థిరమైన ప్రపంచాన్ని అందించగలదు. ●



# భారతీయ నౌకపై దాడి అవాస్తవం

## తప్పుడు సమాచారం నమ్మవద్దని విదేశాంగశాఖ వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్ 13:** ఒమన్ తీరం లో భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై దాడి జరిగిందన్న సమాచారంపై భారత విదేశాంగ శాఖ ్పందించింది. మరో నౌకపై దాడి జరిగిందన్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నది. భారత సిబ్బందితో ఉన్న లియాకీ ఫ్రీడమ్ అనే నౌక ఒమన్ తీరం వెంబడి ప్రయాణిస్తుండగా దాని నుంచి ఒక్కసారిగా స్పందన ఆగిపోయింది. దాంతో అమెరికా దాడి చేసిందంటూ పలు వార్తా పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ ఘటనలో నలుగురు భారతీయ నావికులు మరణించారంటూ ప్రచారం జరిగింది. సామాజిక మాధ్యమాల్లో కూడా పెద్దఎత్తున పోస్టులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే విదేశాంగశాఖ స్పందించింది. ఆ నౌకలోని మాస్టర్‌తో మాట్లాడినట్లు పేర్కొన్నది. నౌకపై ఎలాంటి దాడి జరగలేదని ధ్రువీకరించింది. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని స్పష్టంచేసింది. ఇలాంటి తప్పుడు వార్తల ప్రచారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. కాగా ఇటీవల ఒమన్ తీరం సమీపంలో భారతీయులు ఉన్న నౌకలపై వరుసగా దాడులు జరిగాయి. వారం వ్యవధిలో మూడు నౌకలను అమెరికా సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు భారత నావికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ఆందోళన రేకెత్తించింది. భారత్ ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. తక్షణమే ఈ చర్యలను ఆపేయాలంటూ అమెరికాపై నిరసన వ్యక్తం చేసింది. కాగా హార్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలే లక్ష్యంగా ఇరాన్ డ్రోన్‌లు ప్రయోగించిందని అమెరికా దళాలు ఆరోపించాయి. ఈ ఆరోపణలను ఇరాన్ ఖండించింది.అమెరికాయే దాడులుచేసి తమపై అభియోగాలు నెట్టేస్తోందని ఇరాన్‌ప్రతినిధి ఆరోపించారు.

# మమత, అభిషేక్‌లకు ఉచ్చుబిగిస్తున్న సిఎం సువేందు!



**కోల్‌కత్తా,జూన్ 13:** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సంబంధించిన సంతకాల ఫోర్జరీ ఆరోపణల కేసు దర్యాప్తు ముమ్మరం అయింది. ఈ కేసులో సీఐడీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటివరకు 13 మంది ఎమ్మెల్యేల వాంగ్మూలాలను నమోదు చేసింది. ఈ వ్యవహారంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, లోక్ సభ సభ్యుడు అభిషేక్ బెనర్జీ ఆరోపణలను ఎదుర్కొంటోన్నారు. ఆయనకు సీఐడీ తాజాగా నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో ఆయన నివాసంపై కోల్‌కతా పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కేంద్ర బలగాలు సైతం ఇందులో పాలుపంచుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ తెల్లవారు జామున 3 గంటల సమయంలో కోల్ కత కాళీఘాట్ లోని నివాసంలో ఈ సోదాలు ఆరంభం అయ్యాయి. ఉదయం వరకూ కొనసాగాయి. కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సాగిన ఈ ఆపరేషన్ పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. అభిషేక్ బెనర్జీ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్‌కు సంబంధించిన ఓ కేసు ఆధారంగా ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. నాలుగు గంటల పాటు సాగిన ఈ శోధన ముగిసిన అనంతరం అభిషేక్ విలేకరులతో మాట్లాడారు. తాళం పగలగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి ప్రతి గదిలోనూ సోదాలు చేశారని ఆరోపించారు. ఈ పోలీస్ ఆపరేషన్ విషయం తెలియగానే మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆయన నివాసానికి చేరుకున్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలకు అడ్డు అదుపు ఉండట్లేదని, నానాటికీ దిగజారుతున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీ సంతకాల ఫోర్జరీ కేసులో అభిషేక్ బెనర్జీని ఇటీవలే సీఐడీ అధికారులు దాదాపు ఆరు గంటల పాటు అభిషేక్ ను సంగతి తెలిసిందే. ఈ విచారణ ముగిసిన రెండు రోజుల వ్యవధిలోనే ఆయన నివాసంపై జరిగిన ఈ తాజా దాడి తృణమూల్ నేతల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. దర్యాప్తు సంస్థలు మరోసారి ఆయనకు సమన్లు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్యే మదన్ మిత్ర కూడా టార్గెట్ అయ్యారు. ఆయనకు చెందిన నివాసాలు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏకకాలంలో ఏడు చోట్ల సోదాలు నిర్వహించింది. మున్సిపల్ నియామకాల కుంభకోణంలో భాగంగా దక్షిణేశ్వర్‌లోని ఆయన నివాసంలో ఈ తనిఖీలు చేపట్టారు. సుమారు 125 కంటే ఎక్కువ అక్రమ నియామకాలతో మిత్రాకు సంబంధాలు ఉన్నాయని, దళారుల ద్వారా ఆయన పెద్ద ఎత్తున లంచాలు తీసుకున్నారని ఈడీ అధికారులు ప్రాథమికంగా ఆరోపిస్తున్నారు.

# లీకేజిలపై రాహుల్ ఆందోళనలు!



**న్యూఢిల్లీ,జూన్ 13:** పేపర్ లీకేజీ, పరీక్షల్లో స్కాంలు వంటి అంశాల్లో కేంద్ర సర్కార్ వైఫల్యాలపై పోరాడేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఆ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఇటీవల నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్‌ఈ పరీక్షా ఫలితాల్లో అవకతవకలు, నిరుద్యోగం వంటి అంశాలపై రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, పలు సంస్థలతో కలిసి భారీ ఎత్తున వరుస నిరసనలు చేపడుతామన్నారు. ప్రస్తుతం కేంద్ర వైఫల్యం వల్ల యువత, విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వేణుగోపాల్ అన్నారు. ఈ నేపథ్యంలో అనేక ప్రాంతాల్లో రాహుల్ పర్యటించి ఆందోళన చేస్తారు. ముందుగా జూన్ 17న కోటలో విద్యార్థులతో సమావేశమవుతారు. అనంతరం ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) జూలై 10న, పాట్నాలో జూలై 11న, జూలై 14న ఢిల్లీలో రాహుల్ విద్యార్థులు, యువతతో కలిసి ఆందోళన చేస్తారు.

దేశంలో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలతో మిలియన్లకొద్దీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వారి తల్లిదండ్రులు అదనపు ఖర్చులు భరించలేకపోతున్నారని, ఉద్యోగాల నియామకాల్లో, పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపించిందని వేణుగోపాల్ విమర్శించారు. ఈ నిరసనల్లో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, పీసీసీలు, డీసీసీలు పాల్గొంటారని వేణుగోపాలు తెలిపారు. కేంద్రానికి నిరసన తగిలేలా, అందరినీ ఏకం చేసే లక్ష్యంతో ఈ ఆందోళన కార్యక్రమాలుంటాయన్నారు.

# కొత్త ఆర్మీచీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్!




**న్యూఢిల్లీ,జూన్ 13:** ఆర్మీ కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్‌సేథ్ నియమితులయ్యారు. ఆయన నియామకం ఈనెల 30వ తేదీనుంచి అమలులోకి వస్తుంది. ప్రస్తుత చీఫ్ ఆఫ్‌ది ఆర్మీస్టాఫ్ జనరల్‌ఉపేంద్ర ద్వివేది రిటైర్ అవుతున్న సంగతి తెలిసిందే. ఆర్మీస్టాఫ్‌కు వైస్‌చీఫ్‌గా లెఫ్టినెంట్ ఝనరల్ సేథ్ కొనసాగుతున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమి పూర్వ విద్యార్థి అయిన సాయుధ దళాల్లోకి 1986 డిసెంబరులో వచ్చిచేరారు. నాలుగు దశాబ్దాలపాటు మిలిటరీలో కెరీర్‌ను కొనసాగించారు. నిర్వహణ, వ్యూహాల అమలులో మంచి సామర్థ్యం ఉన్న వ్యక్తి. సంస్థాగతంగా కూడా మంచి పట్టు ఉన్న అధికారిగా పేరుంది. భారత్ ఆర్మీ దళాల తుదముట్టించే వ్యూహాలకు ఆయనే పదును పెడతారు.

దళాల ఆధునీకరణపై లెఫ్టినెంట్ గవర్నర్ ఎక్కువ ఫోకస్‌పెట్టారు. భవిష్యత్తు యుద్ధ తంత్రాలను అమలుచేయడంలో ఆయన దిట్ట అని పేరుంది. జమ్ముకాశ్మీర్‌లో కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఫోర్స్‌కు కమాండెట్‌గా వ్యవహరించారు. సుదర్శన్‌చక్ర కార్ప్స్‌కు లెఫ్టినెంట్ జనరల్ హోదాలో పర్యవేక్షణచేసారు. నైరుతి కమాండ్, దక్షిణ కమాండ్‌లను పర్యవేక్షించిన ఆయన సంక్లిష్టపరిస్థితులను అధిగమించే వ్యూహాలు అమలుచేసారు. లెఫ్టినెంట్‌ఝునరల్‌సేత్ వృత్తిపరంగా మిలిటరీ విద్యలో కూడా నిపుణులు. శిక్షణలో కూడా ఆయన ఉన్నతస్థాయి పదవుల్లోకొనసాగారు. ఎన్డీసీలో హైయ్యర్ కమాండ్ కోర్సు కూడా అభ్యసించారు. మధ్యప్రదేశ్‌లోని సైనిక్‌స్కూల్ పూర్వ విద్యార్థి. 1984లో జమ్ముకాశ్మీర్ రైఫిల్స్‌కు 1984లో పర్యవేక్షించారు

# శత్రు మిస్సైళ్లను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థ

## - యాంటీ షిప్ మిస్సైళ్లను ఢీకొట్టే టెక్నాలజీని పరీక్షించిన డిఆర్‌డిఒ - పెరిగిన స్వదేశీ రక్షణ సామర్థ్యం - బిఎండి సామర్థ్యం ఉన్న ఎలైట్ దేశాల్లో భారత్



**న్యూఢిల్లీ,జూన్ 13:** భారత రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ అత్యాధునిక డిఫెన్స్ సిస్టమ్‌ను పరీక్షించింది. బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థలతో పాటు యాంటీ షిప్ మిస్సైళ్లను ఎదుర్కొనే టెక్నాలజీని పరీక్షించినట్లు శనివారం డీఆర్డీవో వెల్లడించింది. ఈ ట్రయల్ పరీక్షలు జూన్ 10,11వ తేదీల్లో నిర్వహించారు. ప్రస్తుతం ఆధుని టెక్నాలజీతో వస్తున్న క్షిపణులు, మారీటైం ముప్పును ఎదుర్కొనే రీతిలో ఉండే కొత్త తరహా టెక్నాలజీ ఆధారిత ఆయుధాలను పరీక్షించినట్లు డీఆర్డీవో పేర్కొన్నది. స్వదేశీ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవాలన్న దీక్షతో భారత్ తన ఆయుధ పరీక్షలను చేపట్టింది. మూడు రకాల ఫ్లయిట్ టెస్ట్‌లను నిర్వహించినట్లు రక్షణ శాఖ ప్రకటించింది. ఈ విన్యాసాల్లో భాగంగా ఇంటర్‌సెప్టార్ క్షిపణులను లాంచ్ చేశారు. నిర్దేశిత టార్గెట్లపై వాటిని పరీక్షించారు. అనుకున్న లక్ష్యాలను అందుకున్నట్లు తెలిసింది. బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌కు చెందిన పలు దశలను ఈ పరీక్షల్లో టెస్ట్ చేశారు. దూసుకు వస్తున్న క్షిపణులను నిర్వీర్యం చేసేందుకు కావాల్సిన టెక్నాలజీని పరీక్షించారు. మిస్సైల్‌ను డిటెక్ట్ చేసి, ట్రాక్ చేసి దాన్ని ధ్వంసం చేసే టెక్నాలజీని పరీక్షించారు. భారత వ్యూహాత్మక భద్రత అంశంలో ఇదొక ముందడుగు అని ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు. బాలిస్టిక్ క్షిపణుల నుంచి వచ్చే ముప్పును ఎదుర్కొనే దేశాల్లో ఇప్పుడు ఇండియా కూడా చేరినట్లు రక్షణ శాఖ పేర్కొన్నది. కొన్ని దేశాల వద్ద మాత్రమే ఈ టెక్నాలజీ అందుబాటులో ఉన్నది. బాలిస్టిక్ నుంచి ఖండాతర క్షిపణులను కూడా ఎదుర్కొనే రీతిలో కొత్త టెక్నాలజీని పరీక్షించారు. బీఎండీ సామర్థం ఉన్న ఎలైట్ దేశాల్లో ఇండియా చేరినట్లు రక్షణ శాఖ తెలిపింది. నావల్ యాంటీ షిప్ మిస్సైల్ మీడియం రేంజ్ పరీక్ష కూడా డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. యాంటీ షిప్ మిస్సైల్ ముప్పును కూడా సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అయితే మారీటైం దళాలకు ఇది చాలా శక్తిని ఇస్తుందని అధికారులు చెబుతున్నారు. సముద్రం మార్గంలో ఉన్న శత్రువులను చిత్తు చేసేందుకు యాంటీషిప్ మిస్సైల్ టెక్నాలజీ మన నౌకాదళాన్ని బలోపేతం చేస్తుందన్నారు. విదేశీ రక్షణ వ్యవస్థల కన్నా స్వదేశీ రక్షణ వ్యవస్థలపై ఆధారపడే రీతిలో డీఆర్డీవో పరీక్షలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇవాళ డీఆర్డీవోకు శుభాకాంక్షలు తెలిపారు. మూడు రకాల పరీక్షల్లో పాల్గొన్న బృందాలకు ఆయన కంగ్రాట్స్ చెప్పారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని పెంచే కీలకమైన టెక్నాలజీ పరీక్షలను భారత్ విజయవంతంగా చేపట్టినట్లు ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. విభిన్న రకాల శత్రువులను ఎదుర్కొన్న రీతిలో ఆ రక్షణ పరీక్షలు జరిగినట్లు ఆయన వెల్లడించారు. లాంగ్ రేంజ్ బాలిస్టిక్ మిస్సైళ్లు, యాంటీ షిప్ మీడియం రేంజ్ సామర్థ్యాన్ని పరీక్షించినట్లు ఆయన చెప్పారు. బీఎండీ పరీక్షలో భాగంగా ఇంటర్‌సెప్టార్‌లు కచ్చితత్వంతో టార్గెట్లను ఛేధించినట్లు తెలిపారు. ఐసీబీఎంలను కూడా ఎదుర్కొనే సామర్థం భారత్ వద్ద ఉందన్నారు.

# కోర్టులో విడాకుల కేసు నడుస్తున్నా.. మామపై అల్లుడి దయాగుణం

## సొంతడబ్బుతోఖరీదైన వైద్యం..

## కోర్టులోనే కాళ్లపైపడి క్షమాపణ కోరిన భార్య



**న్యూఢిల్లీ,జూన్ 13:** విడాకులకోసం దరఖాస్తుచేసి భర్త, ఆమె కుటుంబాన్ని ముప్పుతిప్పలు పెట్టిన మామకు అత్యున్నతస్థాయి చికిత్సను అందించి ఆదుకున్న యువకుడి ఉదంతం అన్నివర్గాలప్రశంసలకు నోచుకుంది. ఢిల్లీకి చెందిన శిఖ, సౌరభ్‌లమధ్య చిన్నపాటి అహంకార పోరాటంతో విచ్ఛిన్నం అయింది. 2020లో శిఖ, సౌరభ్‌ల వివాహం ఎన్నో ఆశల మధ్య వైభవంగా జరిగింది. పెళ్లయిన కొద్దిరోజులకే వారి మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తాయి. ఒకరినొకరు అర్థం చేసుకునే సహనం లోపించింది. ఈ క్రమంలో శిఖ భర్తపై, అతని కుటుంబంపై కోర్టులో వరకట్న వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ క్షణం నుంచి ఆ కుటుంబంలో ప్రశాంతత కరువైంది. ఏ తప్పు చేయని భర్త, అతని తల్లిదండ్రులు కోర్టుల చుట్టూ, లాయర్ల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఏళ్ల తరబడి విచారణలు సాగాయి కానీ, అటు శిఖ అహం తగ్గలేదు ఇటు సౌరభ్ వైపు నుంచి సయోధ్య కుదరలేదు. న్యాయపోరాటాలు ఎప్పుడూ ఇరువైపులా విధ్వంసాన్నే మిగులుస్తాయి. కూతురి పెళ్లి పేరిట కోర్టుల చుట్టూ తిరగడం, లాయర్ల ఫీజులు భరించడం, సమాజంలో తలెత్తుకోలేకపోవడం శిఖ తండ్రిని తీవ్ర మానసిక క్షోభకు గురిచేసింది. కూతురి భవిష్యత్తు ఏమైపోతుందోనన్న ఆందోళన, నిరంతర ఒత్తిడి ఆయన ఆరోగ్యాన్ని క్షీణింపజేశాయి. ఒకరోజు ఆ భారం తట్టుకోలేక ఆయనకు తీవ్రమైన గుండెపోటు వచ్చింది. అత్యవసర స్థితిలో ఆయనను ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల, సరైన వైద్య సదుపాయాలు అందక ఆయన అక్కడ మరణంతో పోరాడుతున్నారు. కూతురు పెట్టిన కేసు చివరికి కన్నతండ్రి ప్రాణాలకే ముప్పుగా పరిణమించిన దారుణ పరిస్థితి అది. తనను, తన కుటుంబాన్ని కోర్టుల చుట్టూ తిప్పి నరకం చూపించిన భార్య తండ్రి చావుబతుకుల్లో ఉన్నాడనే వార్త భర్త సౌరభ్‌కు తెలిసింది. సాధారణంగా అయితే కక్ష సాధింపులు, కేసు వ్యవహారాలు.. వాళ్ల మధ్య దూరాన్ని పెంచుతాయి. కానీ, సౌరభ్ తనలోని అహాన్ని పక్కన పెట్టాడు. తక్షణమే స్పందించి, ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రి నుండి దేశంలోనే అత్యుత్తమమైన కార్పొరేట్ హాస్పిటల్ మెదాంత్తకు తరలించాడు. తన సొంత డబ్బు ఖర్చు పెట్టి, దగ్గరుండి పర్యవేక్షించి, ఒక కన్నకొడుకులా నిలబడి ఆ ముసలి ప్రాణాన్ని కాపాడాడు. ఆ తర్వాత కొద్దిరోజులకే కోర్టులో తదుపరి విచారణ వాయిదా వచ్చింది. జడ్జి బెంచ్ మీదకు వచ్చారు. లాయర్లు తమ వాదనలు వినిపించడానికి సిద్ధమయ్యారు. విడాకుల పత్రాలు టేబుల్ మీద ఉన్నాయి. అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తూ శిఖ ముందడుగు వేసింది. లాయర్ చేతిలోని విడాకుల పత్రాలను లాక్కుని, జడ్జి ముందే వాటిని ముక్కలు ముక్కలుగా చింపేసింది. కన్నీళ్లతో భర్త సౌరభ్ కాళ్లపై పడింది. ఏ చట్టాలు, ఏ లాయర్లు, ఏళ్ల తరబడి సాగిన కోర్టు వాదనలు మార్చలేని ఆమె కఠిన హృదయాన్ని భర్త చూపిన ఆ ఒక్క మానవత్వం, నిష్కల్మషమైన కరుణ పూర్తిగా మార్చేసింది. తప్పుడు కేసుల కంటే, ఈగోల కంటే బంధం గొప్పదని గ్రహించిన ఆమె భర్తతో కలిసి జీవించడానికి సిద్ధమైంది. ఈ విడాకుల ఉదంతం నేటి ఆధునిక సమాజానికి, ముఖ్యంగా వైవాహిక బంధాల్లో ఉన్నవారి సంబంధాలకు అద్దం పడుతోంది. కోర్టులు, కాగితాలు మనసులను కలపలేవు.

# జులై 9న ఖొమేనీ అంత్యక్రియలు



**టెహ్రాన్,జూన్ 13:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్య క్రియలు వచ్చే నెల 9న జరగనున్నాయి. ఖమేనీ స్వస్థలమైన మషాద్‌లో అంత్య క్రియలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. జూలై 4 నుంచి ఖమేనీ అంత్యక్రియల ప్రక్రియ మొదలవుతుందని తెలిపింది. అమెరికాఇజ్రా యెల్ సైన్యాలు ఫిబ్రవరి 28న ఇరాన్ పై చేసిన దాడుల్లో ఖమేనీ మర ణించారు. అయితే భీకర యుద్ధం కారణంగా ఆయన అంత్య క్రియలు వాయిదాపడుతూ వస్తున్నాయి. పశ్చిమాసియా లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, భద్రతా కారణాలు, మొహర్రం మాసంలో ప్రజల సంతాప కార్యక్రమాలు ఉన్నందున వాయిదా పడ్డాయి. ఇస్లామిక్ ప్రకారం మొదటి నెల అయిన మొహర్రం ప్రారంభంలో మూడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇరాన్ అంతకుముందు భావించింది. అయితే కర్బలా యుద్ధంలో అమరులైన ప్రముఖ షియా నాయకుడు ఇమామ్ హుస్సేన్ స్మారకార్థం సంతాప కార్యక్రమాలను పూర్తి చేసుకునేందుకు అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు.

# భారత్‌కు భద్రతామండలి సభ్యత్వం సహేతుకమే


## అంతర్జాతీయ అణుఇంధనసంస్థ ఛీఫ్ మారియానో గ్రాస్సీ



**వియన్నా,జూన్ 13:** అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయాలు వేగంగా మారుతున్న త ౦ ౦ ణ ం ల్లో అంతర్జాతీయ వేదికపై భారత్‌కు అరుదైన మైలేజ్ లభించింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లభించాలనే డిమాండ్ అత్యంత సహేతుకమైనదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధినేత రాఫెల్ మరియానో గ్రాస్సీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి తదుపరి సెక్రటరీ జనరల్ రేసులో అత్యంత కీలక అభ్యర్థిగా ఉన్న గ్రాస్సీ వియన్నాలో ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ అణు పర్యవేక్షణ సంస్థ అధినేతగా, సుదీర్ఘ అనుభవం ఉన్న అంతర్జాతీయ దౌత్యవేత్తగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు భద్రతా మండలి విస్తరణపై భారత్ చేస్తున్న సుదీర్ఘ పోరాటానికి బలమైన మద్దతుగా నిలిచాయి. ఐక్యరాజ్యసమితి ప్రస్తుత నిర్మాణాన్ని మార్చాల్సిన అవసరాన్ని రాఫెల్ గ్రాస్సీ బలంగా సమర్థించారు. భారత్ లాంటి దేశాలు ఈ రకమైన ఆకాంక్షను కలిగి ఉండటం కేవలం సహేతుకమే. ఎందుకంటే 1945 నాటి ప్రపంచం వేరు, ప్రస్తుత 2026 నాటి ప్రపంచం వేరని ఆయన వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి ప్రస్తుత నిర్మాణం పాతబడిపోయిందని, సమకాలీన వాస్తవాలకు అనుగుణంగా తక్షణ సంస్కరణలు అవసరమని భారత్ ఎప్పటి నుంచో చెప్తున్న వాదనతో ఆయన ఏకీభవించారు. అయితే ఒక దౌత్యవేత్తగా సమతుల్యతను పాటిస్తూ సమితి సెక్రటరీ జనరల్ పదవికి కొన్ని పరిమితులు ఉంటాయని ఎవరికి సభ్యత్వం ఇవ్వాలనేది సభ్య దేశాల మధ్య విస్తృతమైన ఒకకాభిప్రాయంపైనే ఆధారపడి ఉంటుందని గుర్తుచేశారు. కానీ అధికారిక సభ్యత్వంతో సంబంధం లేకుండానే నేడు ప్రపంచంలో భారత్ యొక్క ప్రభావం, ఆర్థిక, భౌగోళిక రాజకీయ బలం ఎవరూ తిరస్కరించలేని విధంగా పెరిగిందని ఆయన కొనియాడారు. ప్రస్తుత యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ రెండో విడత పదవీ కాలం 2026 డిసెంబర్ 31తో ముగియనుంది. దీంతో 2027 జనవరి నుంచి కొత్త చీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ రేసులో రాఫెల్ గ్రాస్సీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

అయితే ఈసారి ఐరాస చరిత్రలోనే మొదటి సారిగా ఒక మహిళా నేతకు ఈ అత్యున్నత పీఠాన్ని అప్పగించాలనే డిమాండ్ కూడా బలంగా ఉంది. చిలీ మాజీ అధ్యక్షురాలు మిచెల్ బాచెలెట్, సీనియర్ ఐరాస అధికారి రెబెకా గ్రిన్‌స్పాన్ వంటి మహిళా నేతలు ఈ రేసులో ఉన్నారు.

# ట్రంప్ 80వ బర్త్‌డేకు వైట్‌హౌస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు!



**వాషింగ్టన్,జూన్ 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ 80వ పుట్టినరోజు వేడుకలు వేడుకలు స్పెషల్‌గా నిర్వహించేందుకు వైట్‌హౌస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. జూన్ 14న నిర్వహించే రాత్రి ఈవెంట్‌కు దాదాపు రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇక ట్రంప్ పుట్టినరోజును పురస్కరించుకుని వైట్‌హౌస్ దగ్గర అల్టిమేట్ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్ ఫ్రీడమ్ 250 ఈవెంట్‌గా నిర్వహిస్తున్నారు. ఇందుకోసం సన్నాహాలు జరుగుతున్నాయి. పలు దేశాలకు చెందిన ఫైటర్లు ఇందులో పాల్గొననున్నారు. ఒకవైపు ట్రంప్ బర్త్‌డే వేడుకలు ఇంకోవైపు ఛాంపియన్‌షిప్ క్రీడలతో వైట్‌హౌస్ కళకళలాడుతోంది. ఈ వేడకను అమెరికన్ పోరాట స్ఫూర్తికి తరంలో ఒక్కసారే వచ్చే వేడుక అని వైట్ హౌస్ అభివర్ణించింది. ఇక అమెరికా 250 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫ్రీడం 250 అని ఈవెంట్‌కు పేరు పెట్టారు. గతేడాది రెండోసారి ట్రంప్ అధికారంలోకి వచ్చారు.

అయితే ఈసారి చాలా దూకుడుగా వెళ్తున్నారు. రెండోసారి అధికారంలోకి రాగానే ప్రపంచ దేశాలపై వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించారు. ఇక ఏడాది ప్రారంభంలో వెనిజులా అధ్యక్షుడు మదురోను కిడ్నాప్ చేయించారు. ఇక ఇరాన్‌పై యుద్ధం ప్రకటించారు. ప్రస్తుతం ఇరాన్‌తో శాంతి ఒప్పందం దిశగా ట్రంప్ వెళ్తున్నారు. ఇలాంటి తరుణంలో ట్రంప్ బర్త్‌డే సెలబ్రేషన్స్ చేసుకుంటున్నారు. ఇక వచ్చే వారం ఫ్రాన్స్‌లో జరిగే జీ7 సదస్సుకు కూడా హాజరు కాబోతున్నారు.

# సంక్షిప్త వార్తలు

## 130 కిలోమీటర్లు కారు డ్రైవ్ చేసిన సిఎం విజయ్

**చెన్నై,జూన్ 13:** తమిళనాడు రాజకీయాల్లో సంచలన విజయం సాధించి, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన కోలీవుడ్ స్టార్ విజయ్ తనదైన స్టైల్‌తో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. పరిపాలన చేపట్టిన కొన్ని రోజులకే తన అసాధారణమైన శైలితో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా నిన్న ఆయన కర్ణాటకలోని ప్రముఖ కొల్లూరు మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. అక్కడ దర్శనం ముగించుకున్న తర్వాత ఆయన చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గుడి నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు దాదాపు 130 కిలోమీటర్ల మేర తన కారును ఆయనే స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లారు. కొల్లూరు మూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం విజయ్.. అమ్మవారికి 1.6 కేజీల బరువున్న భారీ వెండి ఖడ్గాన్ని కానుకగా సమర్పించారు.

## టెక్సాస్‌లో కాల్పులు.. ఒకరి మృతి, 10 మందికి గాయాలు



**హూస్టన్,జూన్ 13:**అమెరికాలోని టెక్సాస్‌లో కాల్పుల ఘటన జరిగింది. ఓ ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో ఒకరు మృతిచెందగా, మరో పది మంది గాయపడ్డారు. పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో అనుమానిత షూటర్ హతమయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున వెస్ట్ టెక్సాస్ మిడ్‌లాండ్ ఆయిల్ సిటీలో ఈ ఘటన జరిగింది. షూటింగ్ జరుగుతున్న ఎమర్జెన్సీ కాల్స్ రావడంతో ఆ ప్రాంతానికి పోలీసులు వెళ్లారు. ఆ షూటర్‌ను తరిమే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఓ వెటర్నరీ క్లినిక్‌లోకి ప్రవేశించిన దుండగుడిని చుట్టుముట్టి కాల్చేశారు.

## అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.4.27 కోట్ల బంగారం స్వాధీనం

**అహ్మదాబాద్,జూన్ 13:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు రూ.4.27 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనంచేసుకున్నారు. ఈమొత్తం బంగారం ఒక స్పీకర్ బాక్స్‌లో ఉంచి విమానం మరుగుదొడ్డిలో ఉంచారు. సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఇండిగో విమానంలో ఈ సంఘటన జరిగింది. దుబాయ్‌నుంచి వచ్చిన ఈ విమానంలో బంగారం స్మగ్లింగ్ జరుగుతోందన్న సమాచారంతో కస్టమ్స్ అధికారులు నిఘావేసారు. విమానం క్షుణ్ణంగా ఇంజినీర్లతోకలిసి తనిఖీచేసారు. నల్లటి ప్లాస్టిక్ టేపులు వేసి ఉన్న రెండు పౌచ్‌లు స్పీకర్‌బాక్స్‌లో ఉంచినట్లు గుర్తించారు.

## అమెరికా దాడులు.. రక్తపిపాసి హతం

**వాషింగ్టన్, జూన్ 13:** వెనుజులాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై దృష్టి పెట్టిన అగ్రరాజ్యం అమెరికా తాజాగా కీలక ఆపరేషన్ చేపట్టింది. ఇందులో డ్రగ్స్‌ముఠా ట్రెన్ డి ఆరాగ్వా గ్యాంగ్‌కు చెందిన లీడర్ హెక్టర్ రస్తెన్‌ఫోర్డ్ గురెరో ఫ్లోర్స్ హతమయ్యాడు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా వెల్లడించారు. 'ట్రెన్ డి ఆరాగ్వా ఉగ్రవాదులకు వెనుజులాలోనే కాదు.. ఈ భూమ్మీద ఎక్కడా సురక్షిత స్థావరం ఉండదు. హంతకులు, డ్రగ్ లార్డ్స్‌ఎక్కడున్నా వేటాడుతాం. వారిని నరకానికి పంపిస్తాం' అని ట్రంప్ వెల్లడించారు. ఈ వారం ఆరంభంలో అమెరికా ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. అత్యంత పక్కా సమాచారంలో ట్రెన్ డి ఆరాగ్వా ముఠాకు చెందిన ఓ కాంపౌండ్‌పై బాంబుల వర్షం కురిపించింది.

## దారి మళ్లించిన షార్జా సౌదీ అరేబియా విమానం!

**కొచ్చిన్, జూన్ 13:** షార్జా నుంచి కోజికోడ్ చేరుకోవాల్సిన ఎయిర్ అరేబియా విమానాన్ని శనివారం దారి మళ్లించారు. ఆ విమానం కొచ్చిన అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యింది. సాంకేతిక సమస్య తలెత్తడం వల్ల దాన్ని దారి మళ్లించారు. ఎయిర్ అరేబియా ఫ్లయిట్ జీ9 454 విమానంలోని ఇంజిన్ రివర్స్ త్రస్ట్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య తలెత్తిందని, దాని వల్ల దాన్ని కొచ్చిన్‌లో దించారని కొచ్చిన ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ప్రతినిధి తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం ఇవాళ తెల్లవారుజామున కొచ్చిన్ విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ప్రకటించారు.





## అభివృద్ధి పనులు, ప్రయాణికుల సౌకర్యాల సమీక్ష

### తిరుపతి రైల్వే స్టేషన్‌లో సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్

**తిరుపతి,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి:** సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ శనివారం తిరుపతి రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. కొత్తగా ఏర్పాటైన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటైన అనంతరం, ఈ విభాగంలో ఆయన తొలి తనిఖీచేపట్టారు. విజయవాడ– గూడూరు–తిరుపతి రైల్వే మార్గంలో విస్తృత తనిఖీలు నిర్వహించిన అనంతరం, తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న వివిధ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, ప్రయాణికుల సౌకర్యాల కల్పనపై ఆయన సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా స్టేషన్ పునర్వికాస ప్రాజెక్టు పురోగతిని పరిశీలించిన జనరల్ మేనేజర్, సర్క్యులేటింగ్ ఏరియా, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారాలు, కాంకోర్స్ ప్రాంతం తదితర సౌకర్యాలను తనిఖీ చేశారు. నిర్మాణ పనులు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి, పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గుంతకల్ రైల్వే డివిజన్ అధికారులు నిర్వహించిన సమగ్ర ప్రజెంటేషన్‌లో కొనసాగుతున్న ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆపరేషనల్ విజయాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళి కలపై జనరల్ మేనేజర్‌కు వివరించారు. ఈ తనిఖీల సందర్భంగా సౌత్ కోస్ట్‌రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బీఎస్‌కే రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ టెలికాం ఇంజనీర్ ఓబీ సురేష్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్‌ఆపరేషన్స్ మేనేజర్ వినీత్ కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా,గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ముక్కంటీశుని చెంత రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి, జూన్ 13 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిట కిట లాడింది. త్రయోదశి కావటంతో భక్తులు కడలి తరంగాల్లా కదలి వచ్చారు. శనీశ్వరునికి మూడు సార్లు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. శనీశ్వరుని ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితులు, అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడషాభిషేకాలు జరిపారు. ఇక రాహు కేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ఆలయంలో అడుగుపెడితే భక్తిభావంతో తన్మయత్వం చెందుతున్నారు. స్వామి వారిని దర్శించుకొని వచ్చిన భక్తులకు 'అభయ వెంకటేశ్వరస్వామి' దర్శనం పునీతం చేస్తుంది. ముఖ్యంగా రాహు కేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. శనివారం ఓ వైపు సామాన్య భక్తుల తాకిడి మరోవైపు అతిథులతో కళకళ లాడింది.

దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది శనివారం స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు. రికార్డుస్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగినట్లు వివరించారు.

## డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరిపించాలి: మాజీ సిఎం జగన్

**విజయవాడ జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ నియామకాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మెగా డీఎస్సీగా ప్రచారం చేసిన నియామక ప్రక్రియ వాస్తవానికి మెగా స్కామ్‌గా మారిందని ఆరోపిస్తూ ఈ వ్యవహారంపై స్వతంత్ర సీబీఐ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన జగన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కుట్ర కారణంగా లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తు దెబ్బతిన్నదని విమర్శించారు. 16వేల టీచర్ పోస్టుల భర్తీలో పాదర్శకత పూర్తిగా దెబ్బతిందని నియామక ప్రక్రియపై అనేక అనుమానాలు నెలకొన్నాయని పేర్కొన్నారు. డీఎస్సీ ప్రక్రియలో ప్రభుత్వ సంస్థాగత భద్రతా వ్యవస్థలను కావాలనే నిర్వీర్యం చేశారని జగన్ ఆరోపించారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ వంటి కీలక బాధ్యతలను ఒకే అధికారికి అప్పగించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అలాగే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గోప్యమైన బాధ్యతలు అప్పగించడం కూడా ప్రశ్నలు రేకెత్తిస్తోందని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల తయారీ ప్రక్రియలో భాగమైన ఒక ఉద్యోగి ఫస్ట్ ర్యాంక్ సాధించడం పేపర్ లీక్‌కు నిదర్శనమని ఆరోపించారు.

## బిజెపి పాలనలో ప్రజలకు మేలు శూన్యం

### రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఏమయ్యాయి!

### కాణిపాకం దేవస్థాన ఉద్యోగాల్లో దళితులకు ప్రాధాన్యత: మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

**కాణిపాకం, జూన్ 13 ప్రభాతవార్త:** గత పన్నెండు సంవత్సరాల భారతీయ జనతా పార్టీ పాలనలో దేశంలో ప్రజలకు జరిగిన మేలు శూన్యమని, ప్రతి ఇంట్లో ఆర్థిక సంక్షోభం కన్పిస్తోందని, దళితులు దుర్భర జీవితాలను గడుపుతున్నారని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ అన్నారు. 11 సంవత్సరాలు వైఎస్ కుటుంబం, 19 సంవత్సరాలు నారా వారి కుటుంబం కలిపి 30 సంవత్సరాలు రాష్ట్రంను రెండు కుటుంబాలు పాలించాయని, తద్వారా ఆ రెండు కుటుంబాలు కోటీశ్వరులు అయ్యాయని విమర్శించారు. ప్రస్తుతం గ్యాస్ ధర, ఎరువులు, పెట్రోల్,



కాణిపాకం ఎస్సీకాలనీలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్

శనివారం కాణిపాకం ఎస్సీ కాలనీలో మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ పర్యటించి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ కేంద్ర మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలన, అభివృద్ధిపై తిరుపతిలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి సభ నిర్వహించారని, దీనివల్ల ఉపయోగమేమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి 23 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకువచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పున్నారని, అయితే శ్రీకాకుళం నుండి చిత్తూరు జిల్లా వరకు ఏ జిల్లాలో అభివృద్ధి మాత్రం కన్పించడం లేదని ఎద్దేవా చేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎస్సీ, ఎస్టీ, ఓబిసీ కార్పొరేషన్లను చంద్రబాబునాయుడు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు రద్దు చేశాయని ధ్వజమెత్తారు. రద్దు చేసిన ఈ కార్పొరేషన్లను తిరిగి పునరుద్ధరించాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. 19 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని నిలదీశారు. డిజీల్, బియ్యం, మందులు, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, కానీ సామాన్యుల జీవితాల్లో మార్పు రాలేదని చింతా మోహన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలన చూశాక తమిళనాడు రాష్ట్రం తరహాలో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని, కాంగ్రెస్ మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఇదిలా వుండగా కాణిపాకం దేవస్థానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో దళితులకు ప్రాధాన్యత కల్పించాలని మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. దేవస్థానంలో కాణిపాకం ఎస్సీ కాలనీకు చెందిన దళితులు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్దతిలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నారని వారికి వయో పరిమితి విధించి విధుల నుండి తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి తొలగించిన కార్మికులను సత్వరం విధుల్లోకి తీసుకోవాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ కార్యదర్శి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

# యూరియాపై అపోహలు వీడండి

## జిల్లాలో సమృద్ధిగా యూరియా: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**కోవూరు (నెల్లూరు), జూన్ 13, ప్రభాతవార్త :** రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుబిక్షంగా ఉంటుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి పేర్కొన్నారు. శనివారం నెల్లూరులోని తమ కార్యాలయం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు ఉన్నాయని, అన్నదాతలు యూరియా పై అపోహలు వీడాలని అన్నారు. కోవూరు నియోజకవర్గంలో యూరియా కొరత ఉందనేది కేవలం అపోహ మాత్రమే అన్నారు. ప్రతిపక్షాలు పనిలేక చేస్తున్నారని, రైతులు అర్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో కోవూరు నియోజకవర్గంలో మొత్తం 55 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటికే 42 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయన్నారు. మరో 10 రోజుల్లో మిగతా 13 వేల ఎకరాల్లో నాట్లు పూర్తవుతాయన్నారు. నియోజకవర్గానికి మొత్తం 7 వేల టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటికి 4.5వేల టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం వెయ్యి టన్నులు రైతులకు అందుబాటులో యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. అదనంగా కోవూరు మండలంలోని



ఇనమడుగు గోదాముల్లో మరో 2.5 వేల టన్నులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అవసరమైతే కొన్ని గంటల్లోనే సొసైటీలు, డీలర్ల వద్దకు చేరుతాయన్నారు. కోవూరు మండలంలో 9 వేల ఎకరాలకు గాను 850 టన్నులు ఇచ్చామని, కొడవలూరు మండలంలో 10,200 ఎకరాలకు గాను 1100 టన్నులు ఇచ్చామన్నారు. విడవలూరు మండలంలో 8,800 ఎకరాలకు గాను 1 వెయ్యి టన్నులు పంపిణీ చేయగా, బుచ్చిరెడ్డి పాళెం మండలంలో 7600 ఎకరాలకు గాను 1350 టన్నులు ఇచ్చామన్నారు. ఇందుకూరుపేటలో 6 వేల ఎకరాలకు గాను 600 టన్నులు ఇవ్వడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు యూరియా కొరత ఉండకూడదని, యూరియా పంపిణీలో అక్రమాలకు తావు లేకుండా ఉండాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏపీ ఏఐఎంఎస్ యాప్ తీసుకువచ్చిందన్నారు. ఈ యాప్ ప్రయోగాత్మకంగా నెల్లూరులో ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో వ్యసాయశాఖ యాప్ ద్వారానే యూరియా పంపిణీ చేస్తోందన్నారు. యాప్‌లో మొదట ఎకరాకు ఒకటిన్నర బస్తాలు ఉండగా అది సరిపోదని సిఎం నారా చంద్రబాబు నాయుడుకి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు రెండున్నర బస్తాలకు పెంచారన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు మళ్లీ సంప్రదించి ఇప్పుడు ఎకరాకు 3 బస్తాలు వచ్చేలా చేశామన్నారు. భూమి యజమానులకు, చెరువు భూములు, వెబ్‌ల్యాండ్ రిజిస్టర్ కాని వారికి కూడా యాప్‌లో సమస్యలు లేవన్నారు. కేవలం కొందరు కౌలు రైతులకు మాత్రమే పంపిణీలో ఆలస్యం అవుతోందని, కౌలు రైతులకు భూమి యజమాని వివరాలు తెలియక పోవడమే ఈ ఆలస్యానికి కారణమన్నారు. వ్యవసాయ శాఖా అధికారులు రైతుల వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారని త్వరలోనే సమస్య తీరిపోతుందన్నారు. బుచ్చిరెడ్డిపాలెంలో 7600 ఎకరాలకు 1350 టన్నుల యూరియాను ఈపాటికి అందజేశామని, రాష్ట్ర అభివృద్ధి చూసి ఓర్వలేక వేరే పని లేక యూరియాపై రాద్ధాం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నాడెల్టా కమిటి ఛైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రావిళ్ల వీరేంద్రనాయుడు, కోవూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, సీనియర్ టిడిపి నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కొల్లారెడ్డి సునీల్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## వైభవంగా నృసింహుని కల్యాణోత్సవం

### రాబడి రూ. 11,79,036

**రాపూరు (నెల్లూరు), జూన్ 13, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో పెద్ద ఎత్తున శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో శనివారం ఆలయ ప్రాంగణం నిండిపోయింది. పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకొని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొని స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి ప్రత్యేకంగా అభిషేకం, గోపూజ, పూలాంగి సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారికి ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వైభవంగా స్వామి వారి కళ్యాణాన్ని ఆలయ అర్చక స్వాములు, వేద పండితులు వేదమంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం, గిరిజన వాయిద్యాల నడుమ వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన, వసతి సౌకర్యాలతో పాటు, క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, మజ్జిగ పంపిణీ వంటి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి ప్రత్యక్ష



పర్యవేక్షణ నిర్వహించారు.

శనివారం స్వామి వారికి భక్తుల ద్వారా రూ.11,79,036 రాబడి వచ్చినట్లు ఆలయ ఉప కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళల రూపేణా రూ.4,23,460లు, శ్రీవారి అభిషేకం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 29,250లు, నిత్య కళ్యాణం ద్వారా రూ, 50,061లు, 100 రూపాయిల ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,22,200లు,దేవస్థానం వసతి ద్వారా రూ.27,500లు, తలనీలలు 2,799 మంది సమర్పించగా తద్వారా రూ. 1,11,900 లు, లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 2,77,250లు, పులిహోరా విక్రయం ద్వారా రూ.36,350లు,వాహనాల పూజల ద్వారా రూ.1,065లు చొప్పున మొత్తం రూ.13,62,798 రాబడి వచ్చినట్లు జనార్ధన్ రెడ్డి తెలిపారు. స్వామి వారి అన్న ప్రసాదాన్ని 2466 మంది స్వీకరించారని, రాత్రి 7 గంటల 20 నిమిషాల వరకు మొత్తం 9,950 మంది భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి, దేవస్థానం సిబ్బంది తదితరులున్నారు.

## గుంతకల్ డివిజన్‌లో విస్తృత తనిఖీలు

**గుంతకల్ రైల్వే జూన్ 13, ప్రభాతవార్త :** గుంతకల్ రైల్వే డివిజనల్ లో దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ గుంకల్ డివిజన్ పరిధిలోని తిరుపతి నుండి గుంతకల్ డివిజన్ పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్లు, ముఖ్యంగా తిరుపతి రైల్వే స్టేషన్ మరియు తిరుపతి, గుంతకల్ సెక్షన్‌లో విస్తృత తనిఖీ నిర్వహించారు. కొత్తగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటైన తరువాత సెక్షన్‌లో ఆయన చేపట్టిన తొలి తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా సందీప్ మాథూర్ రాయచోటి,రాజంపేట రైల్వే స్టేషన్‌ను సందర్శించి, సర్క్యులేటింగ్ ఏరియా, వెయిటింగ్ హాల్, పార్కింగ్ ప్రాంతం మరియు ఇతర ప్రయాణికుల సౌకర్యాల అభివృద్ధి పనులను సమీక్షించారు. కడప రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి, సర్క్యులేటింగ్ ఏరియా, ప్లాట్‌ఫారాలు మరియు ఇతర ప్రయాణికుల సౌకర్యాలను వివరంగా పరిశీలించారు. పనుల నాణ్యతను అంచనా వేసి, అన్ని ప్రాజెక్టులను సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జనరల్ మేనేజర్ తాడిపత్రి, గుత్తి మధ్య విండో ట్రైలింగ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, ట్రాక్ పరిస్థితులు, భద్రతా అంశాలు మరియు కొనసాగుతున్న పనులను సమీక్షించారు. గుత్తిలో యార్డ్ రీమోడలింగ్ పనులను పరిశీలించి, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గుంతకల్లు లో రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేసిన పాత వస్తువులతో తయారుచేసిన నమూనాలను పరిశీలించారు. రైల్వే డ్రైవర్ల క్రూ లాబీని తనిఖీ చేసి, క్రూ నిర్వహణ వ్యవస్థలు, సంక్షేమ సదుపాయాలు, భద్రతా విధానాలు, అత్యవసర ప్రక్రియలను పరిశీలించారు. గుంతకల్లు లో నార్త్ కాలనీ లో నూతన అధికారుల భవనాలను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక గుంతకల్ డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా మరియు ఎడిఆర్‌ఎం శివప్రసాద్ మరియు ఈ తనిఖీలో ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ బి.ఎస్.కె. రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ టెలికాం ఇంజినీర్ ఓ.బి. సురేష్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వినీత్ కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా వై. బాలాజీ కిరణ్ (ముఖ్య ప్రజా సంబంధాల అధికారి) డివిజన్ స్థానిక ఉన్నతాధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భజలాల పెంపునకు రీఛార్జ్ బావులు నిర్మించాలి : కలెక్టర్ బాలాజీ

**గన్నవరం, జూన్ 13, ప్రభాతవార్త :** రోజురోజుకీ అడుగంటిపోతున్న భూగర్భజలాల మట్టాన్ని పెంపొందించేందుకు చేపట్టిన రీఛార్జ్ బావుల నిర్మాణాన్ని సక్రమంగా పూర్తిచేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజీ అధికారులను ఆదేశించారు. గన్నవరం మండలం ముస్తాబాద గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన రీఛార్జ్‌బావి పనులను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ప్రాజెక్టు అమలు విధానం, నిర్మాణ వ్యయం, భూగర్భజలాల పునరుద్ధరణకు కలిగే ప్రయోజనాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క రీఛార్జ్ బావి నిర్మాణానికి రూ.2లక్షలు ఖర్చు అవుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈప్రాజెక్టు నిర్మాణంలో ఎదురైన అనుభవాలను సమీక్షించి భూగర్భజలశాఖ గుర్తించిన ఇతర ప్రాంతాల్లోనూ బావుల నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఇదే గ్రామంలో ఉపాధిహామీ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఉపాధిహామీ



ముస్తాబాద గ్రామంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న కృష్ణా కలెక్టర్ బాలాజీ

పథకంలో భాగంగా గ్రామంలో పంటబోదె పూడికతీత పనులను పరిశీలించిన కలెక్టర్ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో డ్వామా పిడి శివప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ గుణకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రోత్సాహాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి : ఎన్టిఆర్ కలెక్టర్




అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, జూన్ 13, ప్రభాతవార్త :** మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎన్టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్‌సెంటర్‌లో మహిళలకు సోలార్ డ్రైయింగ్ పౌడర్ ప్రాసెసింగ్‌పై శనివారం అవగాహనా సదస్సును కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు అత్యంత కీలకమన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో సహజ సిద్ధమైన ఆహార ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సోలార్ డ్రైయింగ్ సాంకేతికత ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయగలిగితే మంచి ఆదాయం వస్తుందన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పంటలతోపాటు పలు రకాల పండ్లను సోలార్ డ్రైయింగ్ ద్వారా నిల్వచేసి పొడిరూపంలోకి మార్చి విక్రయించటం ద్వారా మంచి లాభాలు ఆర్జించవచ్చాన్నారు. మార్కెట్‌లో కూరగాయ పంటలకు గిట్టుబాటు ధరలు లేని సమయంలో వాటని ఈపద్దతిలో ప్రోసెసింగ్ చేయటం ద్వారా గిట్టుబాటుధరలు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. రైజ్‌సెంటర్ ద్వారా అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా సోలార్‌డ్రైయింగ్ ప్రక్రియ, ఉత్పత్తుల తయారీ, నాణ్యత ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాలపై నిపుణులు వివరించారు.

### రేపు గన్నవరం విమానాశ్రయంలో

## ప్రత్యేక కార్యక్రమాలు

**విజయవాడ, జూన్ 13, ప్రభాతవార్త :** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో గత 12ఏళ్ళ ప్రగతిని పురస్కరించుకుని ఈనెల 15వతేదీ యాత్రీ సువిధా దివస్ నిర్వహించేందుకు విమానాశ్రయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 15వతేదీ విమానాశ్రయం నుండి రాకపోకలు సాగించే ప్రయాణికులకు తిలకంతో బొట్టుపెట్టి స్వాగతం పలుకనున్నారు. ప్రయాణికుల కోసం ఉచిత వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరం నిర్వహించటంతోపాటు, వృక్షారోహణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. విమానాశ్రయంపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు విమానాశ్రయం పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి విమానాశ్రయంలోని వివిధ విభాగాలను విద్యార్థులు చూపించనున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసందర్బంగా విమానాశ్రయం టెర్మినల్ భవనాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దారుణహత్య

**గంగవరం, జూన్ 13, ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం దండపల్లె కురప్పల్లెలో సాఫ్ట్ వేర్ ఉద్యోగి జయదీప్ దారుణహత్యకు గురయ్యాడు. అమ్మాయి పిలిచిందని వెళితే అమ్మాయి బంధువులు కుటుంబ సభ్యులు జయదీప్‌ను కొట్టి మిద్దెపై నుండి కిందకు పడవేసినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ నెల 3న అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన అలస్యంగా వెలుగులోకి రాగా తీవ్రంగా గాయపడ్డ జయదీప్ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. బంగారుపాళ్యం మండలం జి.కురప్పల్లెకు చెందిన హేమావతి కుమారుడు జయదీప్ బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 3న సొంతగ్రామానికి వచ్చిన జయదేవ్‌కు దండపల్లె కురప్పల్లెలో ఒక అమ్మాయి నుండి ఫోన్‌కాల్ వచ్చినట్లు ఇంటివద్ద ఎవరూలేరు వెంటనే బయలుదేరి రావాలని ఫోన్‌చేసినట్టు సమాచారం. ఫోన్‌కాల్ అందుకున్న జయదేవ్‌ను వినీత్ అనే మరో యువకుడు మోటార్ సైకిల్‌పై ఈ నెల 3న సాయంత్రం 5గంటల సమయంలో దండపల్లె కురప్పల్లెలో లింగప్ప ఇంటికి తీసుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఐతే నలుగురు యువకులు కొట్టి మిద్దెపైనుండి కిందకు తోసివేయడంతో జయదేవ్ అపస్మారక స్థితిలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన మునిరాజ్ వెంటనే వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించారు. 9 రోజుల పాటు చికిత్సపొందినా ఫలితంలేక పోవడంతో తగిన స్థోమత లేక పలమనేరులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ జయదేవ్ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఐతే ప్రమాదవశాత్తు మిద్దెపైనుండి పడ్డాడని లింగప్ప కుటుంబ సభ్యులు చెపుతుండగా కొట్టి చంపేశారని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని శవ పరక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వఆసుపత్రిలో వుంచారు. గంగవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### తప్పుడు ప్రచారకర్తలపై కఠిన చర్యలు : ఇఒ వికె శీనా నాయక్

**ఇంద్రకీలాద్రి, జూన్ 13, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 17న మహామండపంలోని 6వ అంతస్థులో నిజ జేష్ఠమాస తదియ నాడు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగా 250 మందికి నిర్వహించబోయే సామూహిక అక్షరాభ్యాసాల కార్యక్రమానికి సంబంధించి ప్రచారంలో వున్న తప్పుడు ప్రచారాలపై ఇఒ వికె శీనా నాయక్ హెచ్చరికలు చేశారు. దేవస్థానానికి సంబంధించిన అంశాలపై తప్పుడు ప్రచారాలు చేసే వారిని కఠినంగా చట్టప్రకారం శిక్షిస్తామన్నారు. శాఖంభరీ ఉత్సవాలు, ఆషాఢ సారె, ఉచిత అక్షరాభ్యాసాలు మరియు కృష్ణానదీ పుణ్య హారతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవన భద్రతను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె.శీనా నాయక్ తెలిపారు. దుర్గమ్మ వారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి రు.1,00,116 విరాళాన్ని కడపకు చెందిన కె గోపిరెడ్డి వారి కుటుంబీకులు అయ్య వరమ్మ అందించారు. విజయవాడకు చెందిన వై.కనకదుర్గ మరియు కుటుంబీకులు పేరున రూ.1,01,116లు విరాళమును, విశాఖపట్నంకు చెందిన గోగినేని సావిత్రి, మౌక్తిక, మోహినీష్ సాయి ల పేరిట శనివారం రు.1లక్ష విరాళం అందించారు.

# హెల్త్ అవేర్‌నెస్ వీక్ ద్వారా కీలక సంస్కరణలు, సేవల విస్తరణ



## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో ఆరోగ్య శాఖ పనితీరు ప్రశంసనీయం

### అధికారులు, వైద్యులు, సిబ్బందిని అభినందించిన తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో హెల్త్ అవేర్‌నెస్ వీక్ ద్వారా ఆరోగ్య రంగంలో కీలక సంస్కరణలు, సేవల విస్తరణ చేపట్టినట్టు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలను మంత్రి దామోదర రాజనర్సింహా అభినందించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్యశాఖ చేపట్టిన కార్యక్రమాలు ప్రజల్లో విశేష స్పందన పొందాయని, ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ఆరోగ్యశాఖ కీలక పాత్ర పోషించిందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సహచరులు, ప్రజా ప్రతినిధులు ఆరోగ్య శాఖ పనితీరును ప్రత్యేకంగా అభినందించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రజలకు అత్యంత అవసరమైన విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆరోగ్య తెలంగాణ నిర్మాణ లక్ష్యంతో వైద్య సేవల విస్త రణ, ఆధునికీకరణ, మానవ వనరుల బలోపేతం, ప్రజా రోగ్య అవగాహన కార్యక్రమాలను సమాంతరంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 6 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించిన హెల్త్ అవేర్‌నెస్ వీక్ రాష్ట్రవ్యాప్తంగా విశేష విజయాన్ని సాధించిందన్నారు. వారంరోజుల పాటు 20కిపైగా ప్రధాన కార్యక్రమాలను నిర్వహించి ఆరోగ్యకర జీవనశైలి, వ్యాధుల నివారణ, మాతాశిశు ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ సేఫ్టీ, హెచ్ఐవీ నియంత్రణ, క్యాన్సర్ అవగాహన వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పిం చామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 35 ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్లు, స్పెషల్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్లను ప్రారంభించి మత్తు వ్యసన బాధితులకు స్క్రీనింగ్, చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలను అందు బాటులోకి తీసుకు వచ్చామన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొం దించేందుకు హైదరాబాద్ కేబుల్ బ్రిడ్జ్‌పై భారీ మానవహారం నిర్వహించామని, రాష్ట్రవ్యాప్తంగా హెచ్ఐవీ, టీబీ స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా, యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని అరికట్టేలా డ్రగ్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంథెనింగ్ డే నిర్వహించామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. నకిలీ మందులు, నాసిరకం ఔషధాలు, మెడిసిన్ల దుర్వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుం టోందని తెలిపారు. 692 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు, 174 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు సహా మొత్తం 866 మంది వైద్యులకు నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని పేర్కొ న్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో ఆరోగ్యశాఖలో భర్తీ చేసిన ఉద్యోగాల సంఖ్య సుమారు 15 వేలకు చేరుకుందని వెల్లడించారు. వైద్య విద్య, సేవల విస్తరణలో భాగంగా మహబూబ్‌నగర్‌ను దక్షిణ తెలంగాణ మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు ప్రారంభించామని, ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన హెల్త్ అవేర్‌నెస్ వీక్ ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో, ప్రజారోగ్యంపై అవగాహన పెంపొం దించడంలో, ఆధునిక వైద్య సేవలను విస్తరించడంలో, ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్యశాఖ కృషి కొనసాగిస్తుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

# తెలంగాణ పోలీసు శాఖకు ఇన్‌స్టిట్యూషనల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు

## 19న ఢిల్లీలో అందుకోనున్న డిజిపి ఆనంద్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నందుకు తెలం గాణ పోలీసు శాఖకు కేంద్ర విదేశాంగ శాఖ ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ నుంచి పోలీసు శాఖకు శనివారం సమాచారం అందింది. దీనికి సంబం ధించిన అవార్డును ఈ నెల 19న ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో డిజిపి సివి ఆనంద్ అందుకోనున్నారు. రాష్ట్ర పోలీసు శాఖకు మరో అవార్డు వరించింది. టెక్నాలజిని వాడడం, నేరాల నియంత్రణ, సిసిటి ఎన్ఎస్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు అనేక అవార్డులు రాగా పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలన, వాటికి సంబం ధించిన ధ్రువీకరణ ప్రక్రియను దేశంలోనే వేగంగా చేస్తున్న దుకు విదేశాంగ శాఖ 2025–26కు ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డును తెలంగాణ పోలీసు శాఖకు ప్రకటించింది. పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలన, ఇతర అంశాలను వేగంగా నిర్వహించినందుకు రాష్ట్ర పోలీసు శాఖకు ఇంతకుముందు పలు అవార్డులు వరించాయి. ఇప్పుడు వీటి సరసన ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు చేరింది. ఈ అవార్డును ఈ నెల 19న కేంద్ర విదేశాంగశాఖ మంత్రి జయశంకర్ నుంచి డిజిపి ఆనంద్ అందుకోనున్నారు. కాగా రాష్ట్ర పోలీసు శాఖకు ఇన్‌స్టిట్యూ షనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు రావడంపై డిజిపి ఆనంద్ సంతోషం వ్యక్తం చేశారు. పాస్‌పోర్టుల దరఖాస్తుల పరిశీలనలో ధ్రువీకరణ ప్రక్రియ కీలకమైన అంశమని, దీనిని నిర్వహిం చడంలో రాష్ట్ర పోలీసులు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలందించారని డిజిపి తెలిపారు.

# ఎల్‌నినోపై లఘుచిత్రం

## పంటల సాగుపై రైతులకు మెలకువలు

### రాష్ట్ర వ్యవసాయ శాఖ వినూత్నప్రచారం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం నైరుతి రుతు పవనాలపై పడి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎదురయ్యే ముప్పు మరింత వాస్తవరూపం దాల్చనున్నట్లు కనిపిస్తోంది. పంటల సాగులో ఎల్‌నినో పర్యవసానాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. ఇందుకు ప్రత్యేకంగా ఒక లఘు చిత్రాన్ని రూపొందింప చేసింది. ఎల్‌నినో తీవ్రత, అలాగే వర్షాలు సరిగ్గా కురవకపోవడం వల్ల కలిగే ప్రభావాలను నివారించడానికి రాష్ట్రంలోని రైతులు ఏమి చేయాలో తెలియ జేస్తూ ఒక లఘు చిత్రాన్ని రాష్ట్రంలోని అన్ని సినిమా థియేటర్లలో ప్రదర్శిం చనున్నారు. సుమారు నాలుగు నిమిషాల నిడివి గల ఈ లఘు చిత్రంలో, ఖరీఫ్ పంట కాలం ప్రారంభమవుతున్న తరుణంలో, ఎల్‌నినో అంటే ఏమిటి, ప్రత్యా మ్నాయ సాగు పద్ధతులు, స్వల్పకాలిక పంటలపై ఇచ్చే సలహాలను ఎందుకు పాటించాలి, అలాగే వ్యవసాయ శాఖ మార్గ దర్శకాలను ఎందుకు అనుసరించాలి అనే విషయాలపై రైతులు చర్చిస్తున్నట్లు ఈ లఘు చిత్రంలో చూపించారు. ఈ సీజన్‌లో ఎల్‌నినో అవగాహన, సురక్షిత వ్యవసాయ పద్ధతులపై రూపొందించిన ఈ లఘుచిత్రం ప్రదర్శించడం రైతుల్లో మరింత చర్చను తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించబడిందని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వ్యవసాయ శాఖ రూపొం దించిన ఇలాంటి అనేక ఇతర లఘుచిత్రాలను ఇప్పటికే వాట్సాప్ ద్వారా లక్షలాది మంది రైతులతో పంచుకోగా, వ్యవసాయ శాఖ తన ఎక్స్ హ్యాం డిల్‌లో కూడా వాటిని పొందుపరచింది. ఇప్పుడు వీటికి అదనంగా ఈ లఘుచిత్రాన్ని థియేటర్లలో విడుదల చేస్తున్నారు.

# ప్రభుత్వ బడుల మూసివేత ప్రకటనను ముఖ్యమంత్రి ఉపసంహరించుకోవాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల మూసివేతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను ఉపసం హరించు కోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశా రు. రాష్ట్రంలోని 23వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసి, వాటిని కేవలం 4వేలకు కుదిస్తామంటూ ముఖ్యమంత్రి ఒక ఇంటర్వ్యూలో చేసిన ప్రకటనను జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. తక్షణమే ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేవిధంగా ఆలోచించాలని డిమాండ్ చేశా రు. విద్యార్థుల ఆవాసాలకు సమీపంలోనే పాఠశాల అందుబాటులో ఉండాలని, ఈ బాధ్యతను ప్రభుత్వమే తీసుకో వాలని విద్యా హక్కు చట్టం 2009లో ప్రాథమిక హక్కుల్లో పొందు పర్చారని, కానీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు గ్రామీణ, పేద, దళిత, గిరిజన పిల్లల ప్రాథమిక విద్యా హక్కును కాలరాసే విధంగా ఉందన్నారు.

**ఉద్యోగ నోటిఫికేషన్ ప్రాసెసింగ్ ఫీజుల పెంపు భారం తగదు**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఉద్యోగ దరఖాస్తుల ప్రాసెసింగ్ ఫీజును రూ. 200 నుండి రూ. 1,000కి పెంచడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీపీఎస్సీ స్పందించి ఈ ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.



# జాతీయ రహదారిపై ఘోరప్రమాదం

## ఇద్దరు మృతి.. మరో నలుగురికి గాయాలు

**రఘునాథపల్లి, జూన్ 13, ప్రభాతవార్త :** వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి గ్రామంవద్ద శనివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి గాయాల్లయ్యాయి. హైదరాబాద్ నుంచి హన్మకొండ వైపు వెళ్తున్న టీజీ24 బి9237 నెంబర్‌గల ఎర్టిగా కారు ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రయాణిస్తున్నారు. తెల్లవారుజామున సుమారు 2.30గంటల సమయంలో గోవర్ధనగిరి గ్రామం దర్గా సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డుదిగి పక్కనే ఉన్నకాలువలో పడిపోయింది. ఈప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతిచెందిన వారిలో ఎండి.అసద్ (26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, అఫ్సా హబీబ్ (27) బీడీఎస్ వైద్యురాలుగా గుర్తించారు. వీరు వరంగల్‌లోని నయీంనగర్‌కు చెందినవారని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన రహముద్దీన్ ఖాన్ (డ్రైవర్), షాహీన్‌బేగం, ఇలేషా, రేష్మాలను వెంటనే జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

**ఘటన స్థలాన్ని పరిశీలించిన జనగామ డిసిపి**

వరంగల్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున రఘు నాథపల్లి మండలం గోవర్ధనగిరి వద్ద జరిగిన రోడ్డుప్రమాద స్థలాన్ని జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి ఆయన భాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వరంగల్ నుండి కర్ణాటకలోని వివాహ రెసెప్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు భాదితు కుటుంబసభ్యులు పోలీసులకు వివరించారు. డ్రైవర్ అజాగ్రత్తవల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు వారు భావిస్తున్నారు. డ్రైవర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిసిపి వెల్లడించారు. ఆయనవెంట ఎస్ఐ నరేష్ తదితరులు ఉన్నారు.

# ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

## ప్రభుత్వానికి తపస్ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర అధ్య క్షుడు వొద్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్య దర్శి హన్మంత్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తపస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శని వారం జరిగింది. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ఎన్‌సిటిఈ నిబంధనలకు అనుగుణంగా సెప్టెంబరు 1, 2025లో సుప్రీం కోర్టు తీర్పు వెలువడిందని, దీంతో ఆందోళన చెందిన సర్వీస్ ఉపాధ్యాయులు 65 రివ్యూ పిటి షన్స్ వేశారని తపస్ నేతలు తెలిపారు. నిబం ధనల ఆధారంగానే సుప్రీంకోర్టు ఆ రివ్యూలను కొట్టివేస్తూ 2028 ఆగష్టు 31 లోపు ఇన్ సర్వీస్ టీచర్స్‌కు చివరి అవకాశమని తీర్పు ఇచ్చింద న్నారు. దీని ప్రకారం సర్వీస్ రిమూవ్ చేసే అవకాశం ఉందని, తెలంగాణలో 30వేల మంది ఉపాధ్యా యులకు టెట్ పాస్ కావాల్సి న అవసరం ఏర్పడిందన్నారు. ఇన్‌సర్వీస్ టీచర్లకు ప్రత్యేకంగా 2సార్లు టెట్ నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం కాస్త ఊరట మాత్రమేన న్నారు. విద్యా హక్కు చట్టం అమలు ద్వారా టెట్ అంశం ప్రస్తావనకు వచినచందన్నారు. ఏప్రిల్ 1,2010 కంటే ముందు న్యాయబద్ధంగా నోటి ఫికేషన్ వచ్చి నియామకం అయిన ఉపాధ్యా యులకు ఆనాడు టెట్ అవసరం లేదు స్పష్టంగా పేర్కొనడం జరిగిందని, తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్‌లో టెట్ అర్హత ఆధారంగానే నియా మకాలు జరుగుతున్నాయన్నారు. గత 30 సంవత్సరాల నుండి ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న విషయంలో భోదిస్తున్నారని, టెట్‌లో మాత్రం అన్ని విషయాలు కలిపి పరీక్షలు పెట్టడం జరుగుతుందని, దీంతో భాషా ఉపాధ్యాయులకు, ఇతర సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా తమ బోధనకు సంబంధం లేని సబ్జెక్టు చదవి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంటప్పుడు ప్రత్యేకంగా టెట్ ఎన్ని సార్లు పెట్టిన ప్రయోజనం లేదనే భావన ఉపాధ్యాయుల్లో ఉంద న్నారు. ఎన్‌సిఈఆర్‌టీ, ఎస్‌సీఈ ఆర్‌టీ ఆధ్వ ర్యంలో, దీక్ష నిష్ఠ, లాంటి అనేక ఆన్‌లైన్ వృత్యంతర శిక్షణ ఇస్తూనే ఉన్నారన్నారు.

# దేశ భద్రతలో సీఐఎస్ఎఫ్ పాత్ర కీలకం

## హాకీంపేటలో ఎన్ఐఎస్ఎ దీక్షాంత్‌పెరేడ్‌లో పాల్గొన్న తెలంగాణ గవర్నర్ శివప్రతాప్‌శుక్లా



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** దేశ భద్రతా వ్యవస్థలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ శివప్రతాప్‌శుక్లా అన్నారు. హాకీంపేటలోని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ (ఎన్ఐఎస్ఏ) ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 39వ బ్యాచ్ అసిస్టెంట్ కమాండెంట్ ప్రొబేషనర్లు, 9వ బ్యాచ్ సబ్‌ఇన్‌స్పెక్టర శిక్షణార్థుల దీక్షాంత్ పరేడ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 76 మంది అసిస్టెంట్ కమాండెంట్ ప్రొబేషనర్లు, 124 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్ శిక్షణార్థులను గవర్నర్ అభినందించారు. పరేడ్‌లో ప్రదర్శించిన క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, వృత్తి నైపుణ్యం వారి అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలోని విమానాశ్రయాలు, ఓడరేవులు, అణు కేంద్రాలు, అంతరిక్ష సంస్థలు, ఇంధన ప్రాజెక్టులు, మెట్రో నెట్‌వర్క్‌లు, కీలక పారిశ్రామిక సంస్థల భద్రతలో సీఐఎస్ఎఫ్ విశిష్ట సేవలందిస్తోందని గవర్నర్ అన్నారు. సంస్థల భద్రతతో పాటు దేశ ఆర్థికాభివృద్ధి, ప్రజల విశ్వాసాన్ని కాపాడటంలో కూడా సీఐఎస్ఎఫ్ పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రస్తుత కాలంలో ఉగ్రవాదం, సైబర్ నేరాలు, డ్రోన్ ఆధారిత ముప్పులు వంటి సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యం, వేగవంతమైన నిర్ణయ సామర్థ్యంతో యువ అధికారులు ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. అధికారుల భుజాలపై అలంకరించిన నక్షత్రాలు కేవలం హోదాకు ప్రతీకలు మాత్రమే కాకుండా దేశం ఉంచిన విశ్వాసానికి, బాధ్యతకు, కర్తవ్యనిష్ఠకు సంకేతాలని గవర్నర్ అన్నారు. నాయకత్వానికి అధికారం కంటే వ్యక్తిత్వం, నిజాయితీ, ధైర్యం, సేవాభావమే నిజమైన పునాదులని సూచించారు. సాయుధ దళాల్లో సేవలందించిన అనంతరం మళ్లీ యూనిఫాం సేవను ఎంచుకున్న మాజీ సైనిక శిక్షణార్థులను ప్రత్యేకంగా అభినందించిన గవర్నర్, వారి దేశభక్తి, అంకితభావం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ హర్ ప్రీత్ కౌర్ సోహి పాసింగ్ అవుట్ అవుతున్న అధికారులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అసిస్టెంట్ కమాండెంట్ లలోప్రతిభ కనబర్చిన శిక్షణార్థులు సుమిత్ లాత్వాల్ (ఆల్ రౌండర్ , స్వోర్డ్ ఆఫ్ ఆనర్ కేటగిరి) ,ఆర్యన్ తివారి ( బెస్ట్ ఇన్ అవుట్ డోర్), అలోక్ తోమర్ ( బెస్ట్ ఇన్ ఇండోర్), సురేంద్ర కుమార్ మీనా ( బెస్ట్ ఇన్ ఫైరింగ్), సబ్ ఇన్స్పెక్టర్ ( ఎక్స్ సర్వీస్ మెన్ ) కేటగిరి లో ప్రతిభ కనబర్చిన సురేష్ కుమార్ (ఆల్ రౌండర్ కేటగిరి) , దీపక్ కుమార్ సింగ్( బెస్ట్ ఇన్ అవుట్ డోర్), గౌరవ్ శర్మ ( బెస్ట్ ఇన్ ఇండోర్), సురేంద్ర ధర్మేందర్ సింగ్( బెస్ట్ ఇన్ ఫైరింగ్) లకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పురస్కాలు అందించి అభినందించారు. అంతకు ముందు గవర్నర్ దేశ సేవలలో అమరులైన సిఐఎస్ఎఫ్ అధికారులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్, అదనపు డైరెక్టర్ జనరల్ ( హెడ్ క్వార్టర్స్) విజయ్ ప్రకాశ్, ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ హర్ ప్రీత్ కౌర్ సోహి, సీఐఎస్ఎఫ్ సీనియర్ అధికారులు, శిక్షకులు, శిక్షణార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న అమ్మకానికి టెండర్లు

## మూడు విడతలుగా విక్రయాలు

### రేపు 4.60 లక్షల టన్నుల వేలం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతుల నుండి సేకరించిన మొక్కజొన్న నిల్వలను విక్రయించాలని తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఈ మొక్కజొన్న నిల్వల విక్రయానికి మార్క్‌ఫెడ్ ఈ నెల 7వ తేదీన ఈ టెండర్లను అహ్వానించింది. రాష్ట్ర వ్యాప్తంగా నిల్వ ఉంచిన మొక్కజొన్నను మూడు విడతలుగా వేలం వేయడం ద్వారా విక్రయించనున్నారు. మొదటి విడతలో 16 లాట్లను ఈ నెల 15న వేలం వేసి విక్రయించనుండగా, రెండవ విడతకు జూలై 16, 17 తేదీలలో మరో రెండు విడతల్లో బిడ్లు నిర్వహిస్తారు. ప్రతి విడతలో సగటున 4.60 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న వేలం వేయనున్నట్లు మార్క్‌ఫెడ్ అధికారవర్గాల సమాచారం. కాగా తెలంగాణలో వరి తర్వాత మొక్కజొన్న అత్యంత ప్రాముఖ్యమైన రెండవ ప్రధాన పంట.

రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి సీజనుకు సంబంధించి 16.37 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. తద్వారా మొత్తంగా 43 లక్షల టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి అయ్యింది. రాష్ట్రంలోని నిర్మల్, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అత్యధికంగా మొక్కజొన్న పంటను రైతాంగం సాగు చేసింది. రైతులు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో, రాష్ట్ర ప్రభుత్వం నేరుగా మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నను కొనుగోలు చేస్తూ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో 22 లక్షల టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా, మార్క్‌ఫెడ్ రాష్ట్రం మొత్తం మీద దాదాపు 15 లక్షల టన్నులకు వరకూ మాత్రమే రైతుల వద్ద నుండి కొనుగోలు చేసింది. ఈ లెక్కన నిర్ధారించిన లక్ష్యం కన్నా ఇంకా సుమారు 7 లక్షల టన్నులకు పైగా మొక్కజొన్న తక్కువగా కొనుగోలు చేసింది. ఇప్పుడు ఈ మొక్కజొన్న నిల్వలను విక్రయించాలని మార్క్‌ఫెడ్ చర్యలు చేపట్టింది.

# ప్రజాపాలనలో పర్యాటక రంగానికి కొత్తఊపు

## మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక్త 99 రోజుల కార్యక్రమం విజయ వంతంగా ముగిసిందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రెండున్నరేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ రంగాల్లో సాధించిన ప్రధాన విజయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను ప్రపంచస్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, కళాకారుల సంక్షేమాన్ని ప్రోత్సహించడం, పర్యాటక మౌలిక సదుపాయాలను విస్తరించడం, పెట్టుబడులను ఆకర్షించడం, స్థానిక ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి లక్ష్యాలతో సమగ్ర కార్యాచరణ చేపట్టిందని మంత్రి తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం తొలిసారిగా తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030ను అమలు చేశామని మంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు, 3 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పీపీపీ విధానంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుస్థిర పర్యాటకం, డిజిటల్ ప్రచారం, అంతర్జాతీయ బ్రాండింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. టూరిజం కాన్‌క్లేవ్2025 ద్వారా 24 మంది పెట్టుబడిదారుల నుంచి రూ.15,285 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు లభించాయని మంత్రి తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025లో 18 మంది పెట్టుబడిదారులతో రూ.8,456 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదిరాయని చెప్పారు. వీటి ద్వారా 10 వేల ప్రత్యక్ష, 30 వేల పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడనున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.181 కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరయ్యాయని తెలిపారు. బుద్ధవనం, రామప్ప, సోమశిల, నిజాంసాగర్, బల్కంపేట ఆలయం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. 2023లో 5.84 కోట్లుగా ఉన్న దేశీయ పర్యాటకుల సంఖ్య 2024లో రికార్డు స్థాయిలో 8.82 కోట్లకు చేరిందన్నారు.

# తెలంగాణలో భారీ వర్షాలు..

## విద్యుత్ శాఖ అప్రమత్తం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణలో నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. ప్రస్తుతం చురుగ్గా కదులుతున్నాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో ఓ ఉపరితల ఆవర్తనం, అరేబియా సముద్రం నుండి బంగాళాఖాతం వరకు ద్రోణి కొనసాగుతోంది. వీటన్నింటి ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రాబోయే రెండు, మూడు రోజుల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. రాష్ట్రంలోని నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వీటితో పాటు హైదరాబాద్‌తో సహా దాదాపు 30కి పైగా జిల్లాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. ఈ నెల 14, 15 తేదీల్లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, ఖమ్మం, కొత్తగూడెం తదితర జిల్లాల్లో 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. మరోపక్క శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. హాకీంపేట్‌లో రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. హైదరాబాద్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో హాకీంపేట్‌లో 63 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, హైదరాబాద్‌లో 23.6 మిల్లీ మీటర్లు, ఖమ్మంలో 15.2 మిల్లీ మీటర్లు, మెదక్‌లో 15 మిల్లీ మీటర్లు, నిజామాబాద్‌లో 17.5 మిల్లీ మీటర్లు, పఠాన్‌చెర్వులో 16 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. కాగా ప్రకృతి వైపరీత్యాలు, భారీ గాలివానలు, వర్షాలు సంభవించిన సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సూచించింది. తెగిపోయిన విద్యుత్ వైర్లు, కూలిపోయిన విద్యుత్ స్తంభాలు లేదా విద్యుత్ సంబంధిత ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే కాల్ సెంటర్ 1912కు సమాచారం అందించాలని కోరింది. ప్రజలు స్వయంగా విద్యుత్ వైర్లు లేదా ఇతర విద్యుత్ పరికరాలను తాకేందుకు, తొలగించేందుకు లేదా మరమ్మత్తులు చేయడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని స్పష్టం చేసింది.

## నేటి నుంచి 21 వరకు సాలార్‌జంగ్ మ్యూజియం

# ప్లాటినం జూబ్లీ వారోత్సవాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వారోత్సవాలను ఘనంగా నిర్వహిం చేందుకు మ్యూజియం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సాలార్ జంగ్–3 నవాబ్ మీర్ యూసుఫ్ అలీ ఖాన్ జయంతిని పురస్కరిం చుకుని నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యా సంబంధిత కార్యక్రమాలు, ప్రత్యేక ప్రచురణలు, ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మ్యూజియం చారిత్రక వైభవాన్ని, అరుదైన కళాఖండాల ప్రాముఖ్యతను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు యువతలో వారసత్వ సంపద పట్ల అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదివారం సాయంత్రం 04.30 గంటలకు సాలార్ జంగ్ మ్యూజియంకు చేరుకుని సాలార్ జంగ్ మ్యూజియం ప్లాటినం జూబ్లీ వారోత్సవాలను ప్రారంభిస్తారు.

**నేడు ఉదయం 07.00 గంటలకు**

**ర్యాలీని ప్రారంభించనున్న గవర్నర్**

ఆదివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మార్గ్‌లో బి ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి సాగే ర్యాలీని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉదయం 07.00 గంటలకు జెండా ఊపి ప్రారంభించనున్నారు. అనంతరం లోక్‌భవన్ లో సంస్కృతి కమ్యూనిటీ హాల్లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రాష్ట్ర గవర్నర్ ప్రారంభించనున్నారు.



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై గందరగోళం వద్దు

## బిసి సంఘాల డిమాండ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త :** ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పై ప్రభుత్వం నిత్యం జారీ చేస్తున్న జీవోలతో విద్యార్థులు, తల్లి దండ్రులు తీవ్రగందర గోళానికి గురవుతున్నారని బీసీ సంఘాల ప్రతి నిధులు మండి పడ్డారు. పాత విధానాన్నే యథాతథంగా కొనసా గించాలని, పెండింగ్‌లో ఉన్న రూ. 6 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. శనివారం బీసీ భవన్‌లో డాక్టర్ ర్యాగ అరుణ్ కుమార్ అధ్యక్షతన 18 బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. 'ప్రభుత్వం జీవో నంబర్ 7ను జారీ చేసి, వ్యతిరేకత రావడంతో తాజాగా 8, 9 జీవోలను తీసుకురావడం దారుణం. రోజుకో జీవోతో విద్యార్థుల భవిష్యత్తును సందిగ్ధంలో పడేస్తున్నారు. పథకాన్ని ఎత్తివేయాలనుకుంటే ధైర్యంగా చెప్పండి, ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం' అని సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు గడిచినా, బకాయిలు చెల్లించలేదని, ఇప్పుడు నెలకు రూ. 300 కోట్లు ఇస్తామంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పాత విధానాన్ని పునరుద్ధరించి, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ఈ అంశంపై ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఆట

# డెబ్యూ మ్యాచ్‌లోనే వికెట్ల పంట



(వార్త క్రీడా విభాగం)

డెబ్యూ మ్యాచ్‌లోనే గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే అదరగొట్టాడు. టీమిండియా తరఫున గ్రాండ్‌తో ఎంట్రీ ఇచ్చారు. అఫ్గానిస్తాన్‌తో జరిగిన తొలి వన్డేలోనే ఇద్దరూ కుర్రాళ్లు మూడేసి వికెట్లు తీసి ఆ జట్టును కట్టడిచేశారు.

పంజాబ్‌కు చెందిన కుడిచేతివాటం పేసర్ గుర్నూర్ బ్రార్.. వస్తూనే తొలి ఓవర్ అయిదో బంతికే వికెట్ సాధించాడు. ఓపెనర్ జద్రాన్‌ను అద్భుత బంతితో పెవలియన్‌కు చేర్చి అఫ్గానిస్తాన్ వికెట్ పతనానికి నాంది పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తను వేసిన తొలి ఓవర్లో రెండు పరగులిచ్చి వికెట్ పడగొట్టడం ద్వారా ఆకట్టుకున్నాడు. ఇక ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌లో చివరి ఓవర్ వేసిన గుర్నూర్ బ్రార్.. ఆ ఓవర్లో ఏకంగా రెండు వికెట్లు పడగొట్టాడు. మొదట రషీద్ ఖాన్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన గుర్నూర్... ఆ తర్వాతి రెండో బంతికే జియావుర్ రహమాన్ కు చమ్కా ఇచ్చి అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్‌ను194రన్స్‌కు తెరదించాడు. వికెట్లపతనాన్ని ప్రారంభించిన గుర్నూర్..వికెట్ల ముగింపును శాసించాడు. మొత్తంగా 4.5 ఓవర్లలో 27 రన్స్ ఇచ్చి 3వికెట్లు పడగొట్టాడు. కెప్టెన్ గిల్ నమ్మకాన్ని నిలబెట్టాడు.

ఇక మరో డెబ్యూ బౌలర్ హర్ష్ దూబే కూడా సత్తా చాటాడు. అయితే తన తొలిఓవర్లోనే 16రన్స్‌తో కాస్ట్లీగా తేలాడు. రెండో ఓవర్‌లో మరో పది పరుగులిచ్చాడు. బ్రేక్ తర్వాత మరోసారి బౌలింగ్‌కు వచ్చి వికెట్లు సాధించాడు. 17వ ఓవర్లో కేవలం ఒక పరుగే ఇచ్చి హాస్మతుల్లాను బోల్తా కొట్టించి తొలి వికెట్ సాధించాడు. తన అయిదో ఓవర్లో మొదట అజ్మతుల్లాను, రెండుబంతుల తర్వాత ఘజనఫర్‌ను వికెట్లు కూల్చాడు. ఈ విధంగా ఒకే ఓవర్లో రెండు వికెట్లు సాధించాడు. మొత్తంగా 5 ఓవర్లు వేసి 47 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు.

**గిల్ మెచ్చిన క్రికెటర్ గుర్నూర్**

గుర్నూర్ బౌలింగ్ యాక్షన్ డెయిల్ స్టెయిన్‌లా ఉంటుంది. చిన్న వయసులో క్రికెట్ కంటే ఫుట్‌బాల్, టెన్నిస్ ఇష్టపడేవాడు. అయితే హైట్ అడ్వాంటేజ్ కారణంగా కొందరి మిత్రుల సలహాతో క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. రెండేళ్లలోనే ఇండియా అండర్19 జట్టుకు ఎంపియ్యాడు. అక్కడే గుర్నూర్‌కు గిల్ పరిచయమయ్యాడు. అతడి టాలెంట్‌ను గమనించిన గిల్ కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చాడు. అలా పంజాబ్ అండర్ 23 జట్టులో చోటు దక్కించుకున్న గుర్నూర్ బ్రార్ 2021లో లిస్ట్‌ఏతో పాటు ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. 2023లో పంజాబ్ కింగ్స్‌కు నెట్‌బౌలర్‌గా వచ్చిన గుర్నూర్ బ్రార్‌కు అనుకోకుండా జట్టుకు ఆడే అవకాశం వచ్చింది. సెలెక్టర్ల దృష్టిలో పడిన గుర్నూర్ బ్రార్‌ను గతేడాది ఇండియాఏ జట్టుకు ఎంపిక చేయడంతో అతడి కెరీర్ మలుపు తిరిగింది.

**నిఖార్సైన స్పిన్ ఆల్‌రౌండర్**

విదర్భకు చెందిన హర్ష్ దూబే నిఖార్సైన ఆల్‌రౌండర్, 2024-25సీజన్‌లో 69వికెట్లు తీసి విదర్భను రంజీ ఛాంపియన్‌గా నిలిపాడు. ఈ ప్రదర్శనతో ఇండియా-ఏ జట్టులోకి ఎంపికయ్యాడు. ఇక విజయ్ హజారే ట్రోఫీలో కెప్టెన్‌గా విదర్భను నడిపించిన హర్షదూబే ఆ జట్టుకు తొలి టైటిల్ అందించాడు. దేశవాళీ క్రికెట్‌లో ప్రదర్శనతో హర్ష్‌ను ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు ఎస్ఆర్‌హెచ్ కొనుగోలు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌తో ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన హర్ష్ దూబే ఆ సీజన్‌లో మూడు మ్యాచ్‌ల్లో ఐదు వికెట్లు తీశాడు. 2026 సీజన్‌కు ఎస్ఆర్‌హెచ్ అతడిని రిటైన్ చేసుకుంది. ఈ సీజన్‌లో 8 మ్యాచ్‌లాడిన హర్షదూబే 8 వికెట్లు తీశాడు.



# పరాగ్వేపై అమెరికా సూపర్ విక్టరీ

**న్యూయార్క్:** ఫిఫా వరల్డ్ కప్‌లో ఆతిథ్య అమెరికా శుభారంభం చేసింది. పరాగ్వేపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ 4-1 గోల్స్ తేడాతో సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలోనే ఒక మ్యాచ్‌లో నాలుగు గోల్స్ చేయడం అమెరికాకిదే తొలిసారి. సొంత ప్రేక్షకుల మధ్య మొదట్నుంచీ దూకుడుగా ఆడిన అమెరికా.. పరాగ్వేకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఆట ప్రారంభమైన ఏడు నిమిషాలకే డామియన్ గోల్ సాధించి అమెరికాకు ఆధిక్యం అందించాడు. ఇక ఫోలారిన్ వరుసగా రెండు గోల్స్ కొట్టడంతో తొలి అర్ధభాగం సమయానికే 3-0 ఆధిక్యం పొందింది. రెండో అర్ధభాగం 73వ నిమిషంలో మోరిసియో.. పరాగ్వేకు గోల్ అందించాడు. ఇక ఆట అదనపు సమయంలో అమెరికా ప్లేయర్ గివోన్నిరీనా అదిరిపోయే గోల్ సాధించిపెట్టాడు. దీంతో అమెరికా 4-1 తేడాతో పరాగ్వేపై నెగ్గింది.

**కెనడా-బోస్నియా మ్యాచ్ డ్రా**

అంతకుముందు అర్ధరాత్రి మరో ఆతిథ్య దేశం కెనడా తన తొలి మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. బోస్నియాతో జరిగిన పోరులో 1-1తో కెనడా సమంగా నిలిచింది. అయితే ఫిఫా ప్రపంచ కప్‌లో తొలిసారి కెనడా పాయింట్‌ను సాధించడం గమనార్హం. గత ఎడిషన్లలో ఆరు మ్యాచుల్లోనూ కెనడా ఓడింది.

# గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్ భారత్ బిగ్ విక్టరీ

**ధర్మశాల:** అఫ్గానిస్తాన్‌తో సొంతగడ్డపై జరుగుతున్న వన్డే సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. ధర్మశాల వేదికగా జరిగిన తొలి వన్డేలో 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. వర్షం అంతరాయంతో మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించారు. అఫ్గానిస్తాన్ విధించిన 195 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 22.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది.

లక్ష్య చేధనలో రోహిత్ శర్మ(16)వికెట్‌ను 46 పరుగుల వద్ద కోల్పోయింది. జోరుమీద కనిపించిన రోహిత్ రనౌట్‌గా వెనుదిరిగాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (66 బంతుల్లో 84 నాటౌట్).. ఇషాన్ కిషన్(34)తో కలిసి రెండో వికెట్‌కు 70 రన్స్ జోడించాడు. శ్రేయాస్‌అయ్యర్(12) నిరాశపరిచినా... రాహుల్ అండగా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో కేఎల్ రాహుల్ (19 బంతుల్లో 39 నాటౌట్) ధనాదన్ ఇన్నింగ్స్‌తో టీమిండియాకు విజయాన్ని అందించాడు. ఆఫ్ఘన్ బౌలర్లలో రషీద్, రెహమాన్ షరీఫ్ చెరొక వికెట్ తీశారు.

అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్తాన్ 24.5 ఓవర్లలో 194 పరుగులకు



ఆలౌటైంది. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (102) శతకంతో అదరగొట్టాడు. హాస్మతుల్లా (26) రాణించాడు. భారత బౌలర్లలో హర్ష్‌దూబే, గుర్నూర్ బ్రార్ చెరో 3 వికెట్లు తీయగా, నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్‌లు 2 వికెట్లు పడగొట్టారు. ఇరుజట్ల మధ్య రెండో వన్డే బుధవారం లక్నో వేదికగా జరగనుంది.

# సెమీస్‌లో సింధూకు మరోసారి నిరాశ

**సిడ్నీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. ఏకైక ఆశాకిరణంగా ఉన్న పీవీ సింధూ కూడా ఫైనల్ చేరకుండానే వెనుదిగిరింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో సింధూ 20-22, 12-20తో వరుస గేమ్‌ల్లో టాప్ సీడ్ జపాన్ షట్లర్ అకానే యమగుచి చేతిలో ఓడింది. 43 నిమిషాల పాటు జరిగిన ఈ సెమీస్ పోరులో నెగ్గిన ప్రపంచ ఛాంపియన్ యమగుచి ఫైనల్లో ప్రవేశించింది.


సెమీఫైనల్ పోరును పీవీ సింధూ మంచి ఈజ్‌తో ప్రారంభించింది. చక్కని నెట్ గేమ్‌తో దూకుడు ప్రదర్శించిన సింధూ.. 12-6తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే బ్రేక్ తర్వాత వరుసగా ఆరు పాయింట్లు సాధించిన సమవుజ్జీగా నిలిచింది. ఇద్దరూ పోటీపోటీగా పాయింట్లు రాబట్టడంతో 20-20 వరకు స్కోరు సమంగా కొనసాగింది. ఈ దశలో సింధూ గేమ్ లయ తప్పింది. కీలక దశలో ఎర్రర్స్ చేయడంతో.. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ యమగుచి వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌ను సొంతం చేసుకుంది. ఇక రెండో గేమ్‌లో సింధూ తేలిపోయింది. మరోవైపు జపాన్ షట్లర్ సింధూకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఆధిక్యంలో దూసుకుపోయింది. రెండే గేమ్‌ను మరింత అలవోకగా 21-12తో ముగించి ఫైనల్లో ప్రవేశించింది. ఈ ఓటమితో 2026 సీజన్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్ అందుకోవాలన్న సింధూ కల చెదిరింది. కాగా ఈ సీజన్ బీడబ్ల్యూఎఫ్ టూర్‌లో సింధూ... సెమీఫైనల్లో ఓడడం ఇది రెండోసారి. జనవరిలో జరిగిన మలేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నీలోనూ సింధూ సెమీస్‌లో చైనా షట్లర్ వాంగ్ జియి చేతిలో ఓడింది. చివరగా 2024లో లక్నో వేదికగా జరిగిన సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్ నెగ్గింది.



# నెయ్‌మార్‌కు గాయం:మొరాకోతో బ్రెజిల్ తొలి పోరు

**న్యూజెర్సీ:** ఫిఫా వరల్డ్ కప్‌లో మరో హాట్ ఫేవరెట్ బ్రెజిల్ తొలి మ్యాచ్‌ను సిద్ధమైంది. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు మొరాకోతో తలపడనుంది. ఈ కీలక పోరుకు ముందు బ్రెజిల్‌కు బిగ్ షాక్ తగిలింది. స్టార్ ఫుట్‌బాలర్ నెయ్‌మార్ గాయం కారణంగా తొలి మ్యాచ్‌కు దూరమయ్యాడు. యువ ఆటగాళ్లపై బ్రెజిల్ ఆశలు పెట్టుకుది. రఫిన్హా, వినిసియస్ జూనియర్, మాథ్యూస్ కున్హామెరుగైన ఫామ్‌లో ఉన్నారు. అలాగే ఎండ్రిక్, ఇగోర్ థియాగో వంటి యువ ఆటగాళ్లు కూడా ఆశలు రేకెత్తిస్తున్నారు. మిడ్‌ఫీల్డ్‌లో కాసేమిరో, బ్రూనో గిమారెస్, లూకాస్ పక్వేటా కీలక పాత్ర పోషించనున్నారు. మొరాకోను తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉంది. కెప్టెన్ అష్రఫ్ హాకీమ్, స్టార్ ఫార్వర్డ్ బ్రాహిమ్ డియాజ్ జట్టుకు ప్రధాన బలంగా ఉన్నారు. గత ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన చేసిన మొరాకో ఈసారి కూడా డార్క్ హార్స్‌గా బరిలోకి దిగుతోంది. సమష్టి ఆటతో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇవ్వగల సామర్థ్యం ఆ జట్టుకు ఉంది. బ్రెజిల్, మొరాకో జట్లు ఇప్పటివరకు రెండుసార్లు తలపడగా 1-1 విజయంతో సమవుజ్జీగా ఉన్నాయి. దీంతో ఈ మ్యాచ్‌పై ఆసక్తి మరింత పెరిగింది.






# వడ్డీరేట్లు పెంచిన కెనరా, బరోడా

**ముంబయి, జూన్ 13:** ప్రభుత్వ రంగానికి చెందిన రెండు దిగ్గజ బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకు సడెన్ షాక్ ఇచ్చాయి. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను పెంచేశాయి. ఎంపిక చేసిన టెన్యూర్లపై గరిష్ఠంగా 5 బేసిస్ పాయింట్ల వరకు ఎంసీఎల్ఆర్ పెంచాయి. సవరించిన ఎంసీఎల్ఆర్ రేట్లు జూన్ 12 నుంచి అమల్లోకి వచ్చాయని బ్యాంకులు పేర్కొన్నాయి. నిధుల వ్యయ ఆధారిత వడ్డీ రేటుగా చెబుతుంటారు. ఇప్పుడు ఎంసీఎల్ఆర్ పెంచిన నేపథ్యంలో ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉన్న లోన్ వడ్డీ రేట్లు పెరుగుతాయని చెప్పొచ్చు. ఇప్పటికే ఫ్లోటింగ్ రేటుపై లోన్లు తీసుకున్నవారికి ఈఎంఐ పెరుగుతుంది. ఫిక్స్‌డ్ వడ్డీ రేటుకు తీసుకున్నవారిపై ప్రభావం చూపించదని చెప్పొచ్చు. ఆర్బీఐ తన ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల్లో కీలక రెపోరేటును మూడోసారి 5.25శాతం వద్ద స్థిరంగానే ఉంచింది. ఎంసీఎల్ఆర్ అనేది కనీస వడ్డీ రేటు. అంటే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇంతకంటే తక్కువ వడ్డీకి లోన్లు ఇచ్చేందుకు వీల్లేదు. అన్ని బ్యాంకులకు ఒకే విధానం ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర బ్యాంక్ 2016లో ఈ విధానం తీసుకొచ్చింది. కెనరా బ్యాంకు ప్రధానంగా తన షార్ట్ టర్మ్ టెన్యూర్లపై ఎంసీఎల్ఆర్ సవరించింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరగ్గా 7.90 శాతం నుంచి 7.95 శాతానికి చేరింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 8శాతం, 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.25 శాతం, 6 నెలల ఎంసీఎల్ఆర్ కూడా 5 బేసిస్ పాయింట్లు పెరిగి 8.60 శాతానికి పెరిగింది. ఎక్కువగా కన్స్యూమర్ లోన్లకు లింక్ అయి ఉండే ఏడాది టెన్యూర్ ఎంసీఎల్ఆర్ 8.75 శాతంగా ఉంది. బ్యాంక్ ఆఫ్ బరోడా వడ్డీ రేట్లు మరో ప్రభుత్వ రంగ బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ బరోడా 5 టెన్యూర్లపై ఎంసీఎల్ఆర్ పెంచింది. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరిగి 7.80 శాతం నుంచి 7.85 శాతానికి చేరింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 7.95 శాతం, 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.20 శాతానికి చేరింది. 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.50 శాతం, ఏడాది టెన్యూర్ ఎంసీఎల్ఆర్ 5 బేసిస్ పాయింట్లు పెరగడంతో 8.75 శాతానికి చేరింది.




## వాడకంలో లేని బ్యాంకు ఖాతాలు తొలగించండి

# కస్టమర్లకు బ్యాంకర్ల హెచ్చరికలు

**ముంబయి, జూన్ 13:** డిజిటల్ చెల్లింపులు పెరిగిన తర్వాత యూపీఐ చాలా మందికి రోజువారీ జీవితంలో భాగమైంది. డబ్బు పంపాలన్నా, బిల్లు చెల్లించాలన్నా యూపీఐనే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. వాడకంలో లేని బ్యాంకు ఖాతాలను తొలగించుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. యూపీఐలో ఒకేమొబైల్ నంబర్‌కు ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలను లింక్ చేసే అవకాశం ఉంటుంది. కొత్తబ్యాంక్ ఖాతా జోడిస్తే పాతది ఆటోమేటిక్‌గా తొలగిపోదు. అది కూడా యాప్‌లో కనిపిస్తూనే ఉంటుంది. అందుకే అవసరం లేని అకౌంట్లను స్వయంగా తొలగించాలి. వాడని బ్యాంక్‌ఖాతా యూపీఐలో ఉంటే కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆ ఖాతా ఇక యాక్టివ్‌లో లేకపోతే లావాదేవీలు విఫలమవుతాయి. రిఫండ్‌లు ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది. కొన్ని ఆటో డెబిట్ చెల్లింపులు కూడా ప్రభావితమవుతాయి. ఒకే యాప్‌లో చాలా బ్యాంక్ ఖాతాలు కనిపిస్తే ఏ ఖాతా ప్రస్తుతం ఉపయోగంలో ఉందో గుర్తించడం కష్టమవుతుంది. ముఖ్యంగా వృద్ధులు లేదా డిజిటల్ చెల్లింపులకు కొత్తగా అలవాటు పడుతున్న వారికి ఇది గందరగోళం కలిగించవచ్చు. అందుకే ప్రస్తుతం వాడుతున్న ఖాతాలను మాత్రమే ఉంచుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు సూచిస్తున్నారు. బ్యాంక్ ఖాతామార్చిన తర్వాత యాక్టివ్ ఆటోపేలు, ఈఎంఐలు, సబ్‌స్క్రిప్షన్లు ఏ ఖాతాకు లింక్ అయ్యాయో ఒకసారి చెక్ చేయాలి. కొంతకాలానికోసారి యూపీఐలో ఉన్న బ్యాంక్ ఖాతాల జాబితాను పరిశీలించడం మంచిది. అవసరం లేని ఖాతాలను తొలగిస్తే యాప్ వినియోగం సులభంగా ఉంటుంది.

# ఈవీ డెలివరీ కోసం మూడునెలల వెయిటింగ్!

**ముంబయి, జూన్ 13:** పెట్రోలు డీజిల్‌ధరలు ఆకాశాన్నంటుతున్న క్రమంలో, వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాలు ఈవీల వైపు మళ్లుతుండటంతో ఈవీ కార్లకు ఒక్కసారిగా గిరాకీ పెరిగి, డెలివరీ కోసం నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మారుతి సుజుకి, టాటా మోటార్స్, మెర్సిడెస్‌బెంజ్, మహీంద్రా వంటి ప్రముఖ కంపెనీల పాపులర్ మోడళ్ల కోసం ప్రస్తుతం 3 నెలల వరకు వెయిటింగ్ పీరియడ్ నడుస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల పుణ్యమా అని బయ్యర్లు ఇపుడు విద్యుత్ వాహనాలవైపు దృష్టి మార్చారు. అధిక ధరలు, ఛార్జింగ్ సదుపాయాల కొరత వంటి కారణాలతో ఈవీల కొనుగోలుకు వెనుకాడిన వినియోగదారులు, ఇప్పుడు వాటపైనే ఆసక్తి కనబరుస్తున్నారు.

మార్చి నెల నుంచి తమ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల (బీఈవీ) డిమాండ్ 40 శాతం మేర పెరిగిందని మెర్సిడెస్‌బెంజ్ ఇండియా వెల్లడించింది. ఏప్రిల్‌లో విడుదలైన సీఎల్ఏ బీఈవీ మోడల్‌కు రెండు నుంచి 3 నెలల వెయిటింగ్ పీరియడ్ సమయం ఉందని,




దీనివల్ల డీలర్లు కొత్త బుకింగ్స్‌ను నిలిపివేశారని కంపెనీ ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. బీఎండబ్ల్యూ ఇండియా సైతం ఇదే తరహాపరిస్థితులను ఎదుర్కొంటోంది. మేనెలలో ఆ కంపెనీ మొత్తం అమ్మకాల్లో ఈవీల వాటా 33 శాతానికి చేరుకోవడం విశేషం.

దేశీయ దిగ్గజ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకికి చెందిన కొత్త ఈవిటారా ఎస్‌యూవీ బుకింగ్స్ గత నెలలో రెట్టింపయ్యాయని, దీంతో 6 నుంచి 8 వారాల నిరీక్షణ తప్పడం లేదని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ వివరించారు. అదే విధంగా మహీంద్రా ఎక్స్‌యూవీ 9ఈ మోడల్‌కు 6నుంచి 8 వారాలు, టాటా మోటార్స్ పంచ్, టియాగో ఈవీలకు 6 వారాల వెయిటింగ్ పీరియడ్ కొనసాగుతోంది. 2026 మేలో ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో 26,000 యూనిట్లను దాటాయి. ఇది గతేడాదితో పోలిస్తే 80 శాతం అధికం కావడం గమనార్హం. మొత్తం ప్యాసింజర్ వాహనాల్లో ఈవీల వాటా తొలిసారిగా 11 శాతాన్ని అధిగమించింది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని పెంచేందుకు ఆటోమొబైల్ సంస్థలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, సరఫరా వ్యవస్థలో తలెత్తిన సమస్యలు సవాలుగా మారాయి. ఇంధన ధరల అనిశ్చితి నేపథ్యంలో, ఆర్థికంగా పొదుపు మార్గంగా వినియోగదారులు సహజంగానే ఈవీల వైపు ఆకర్షితులవుతున్నారు.



## ఫోర్బ్స్ జాబితాలో భారత సంతతి సిఇఒ

# రూ.57వేల కోట్లతో ఏడో స్థానం

**సిలికాన్‌వ్యాలీ, జూన్ 13:** అమెరికా ఐటి నగరం సిలికాన్ వ్యాలీలో ఒక ఎన్ఆర్ఐ మహిళ రికార్డు సాధించారు. గ్లోబల్ టెక్నాలజీ సంస్థ అరిస్టా నెట్‌వర్క్స్ ప్రెసిడెంట్, సీఈఓ అయిన జయశ్రీ ఉల్లాల్ అగ్రరాజ్యంలో సరికొత్త రికార్డుని నెలకొల్పారు. 2026 సంవత్సరానికి గాను ఫోర్బ్స్ ప్రకటించిన సొంతంగా ఎదిగిన అత్యంత సంపన్న మహిళలు జాబితాలో ఆమె అత్యున్నత స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక లిస్ట్‌లో నిలిచిన ఏకైక భారత సంతతి మహిళ జయశ్రీ. ఫోర్బ్స్ జాబితా ప్రకారం జయశ్రీ ఉల్లాల్ నికర ఆస్తి విలువ ఏకంగా 6.8 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ. 56,700 కోట్లకు పైగా ఉంది. ఈ భారీ సంపదతో ఆమె ఫోర్బ్స్ వార్షిక జాబితాలో ఏడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రస్తుత రియల్ టైమ్ మార్కెట్ విలువ ప్రకారం ఆమె ఆస్తి 6.5 బిలియన్ డాలర్లుగా ఉన్నప్పటికీ ప్రపంచ బిలియనీర్ల సరసన ఆమె అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. నెట్‌వర్కింగ్, సెమీకండక్టర్ రంగాలలో ఆమె మూడు దశాబ్దాలుగా అందించిన అద్భుతమైన నాయకత్వ పటిమకు ఈ విజయం నిదర్శనంగా నిలిచింది.

2008 నుంచి ఆమె సారథ్యం వహిస్తున్న అరిస్టా నెట్‌వర్క్స్ సాధించిన విజయాలే ఆమెను ఈ స్థాయికి చేర్చాయి. జయశ్రీ ఉల్లాల్ లండన్‌లో జన్మించినప్పటికీ ఆమె బాల్యమంతా దేశ రాజధాని న్యూఢిల్లీలోనే గడిచింది. చిన్నతనం నుంచే టెక్నాలజీ, ఇంజినీరింగ్ రంగాలపై ఆమెకు అమితమైన ఆసక్తి ఉండేది. ఉన్నత విద్య కోసం ఆమె అమెరికాకు వలస వెళ్లారు. శాన్ ఫ్రాన్సిస్కో స్టేట్ యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన జయశ్రీ ఉల్లాల్ ఆ తర్వాత శాంటా క్లారా యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ పట్టా పొందారు.

అరిస్టా నెట్‌వర్క్స్ బాధ్యతలు చేపట్టడానికి ముందు జయశ్రీ సిలికాన్ వ్యాలీలోని దిగ్గజ సంస్థలైన ఏఎండీ, ఫెయిర్‌చైల్డ్ సెమీకండక్టర్స్ వంటి కంపెనీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం అరిస్టా సంస్థలో జయశ్రీకి 3 శాతం వాటా ఉంది. దీంతో పాటు జయశ్రీ ఉల్లాల్ ప్రముఖ క్లౌడ్ కంపెనీ స్నోఫ్లేక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లోనూ సేవలు అందిస్తున్నారు.

# స్పేస్‌ఎక్స్ ఐపిఒతో మిలియనీర్లుగా ఉద్యోగులు!

**న్యూయార్క్, జూన్ 13:** అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్‌ఎక్స్ భారీ స్థాయిలో నిర్వహించిన ఐపీఓ సంస్థ ఉద్యోగులను మిలియనీర్లు చేసింది. సంస్థ షేర్ల లిస్టింగ్ అనంతరం 4,400 మందికి పైగా ఉద్యోగులు మిలియనీర్లుగామారిపోయారు. నాస్‌డాక్‌లో ఒక్కో షేర్‌ను 150 డాలర్ల ధరకు స్పేస్‌ఎక్స్ లిస్టింగ్ చేయగా, ట్రేడింగ్ ప్రారంభమైన వెంటనే షేరు ధర మరింత పెరిగింది. దీంతో సంస్థలో పనిచేస్తున్న ఇంజినీర్లు, రాకెట్ ప్రయోగాల సిబ్బంది, గంటల వారీ వేతనంపై పనిచేసే కార్మికులు సైతం భారీ సంపదను సొంతం చేసుకున్నారు. వీరిలో దాదాపు 400 మంది ఉద్యోగుల ఆస్తుల విలువ 100మిలియన్ డాలర్లకు మించి ఉండనున్నట్లు అంచనా. సాధారణంగా చాలా ఐపీఓల్లో వ్యవస్థాపకులే బిలియనీర్లుగా మారుతారు. కానీ 400 మంది ఉద్యోగులు ఈ స్థాయికి చేరుకోవడం అరుదైన విషయమని హిల్ డాట్‌కో విశ్లేషకుడు ఆండ్రూబెన్సన్ పేర్కొన్నారు.




ఇక స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఈ లిస్టింగ్‌తో ప్రపంచంలో తొలి ట్రిలియనీర్‌గా నిలిచారు. కంపెనీ ఉద్యోగుల్లో గావిన్ పెటిట్ అనే ఉద్యోగి 2012లో 80వేల డాలర్ల జీతంతో సంస్థలో చేరాడు. ఆ సమయంలో ఒక్కో షేర్ విలువ కేవలం 13.80డాలర్లే. అప్పట్లో స్పేస్‌ఎక్స్ రాకెట్ ప్రయోగాలు వరుసగా విఫలమవుతున్నప్పటికీ, నగదు బోనస్‌లకు బదులుగా షేర్లను స్వీకరించాలని ఆతడు తీసుకున్న నిర్ణయం ఇపుడు అతనికి అపార సంపదను తెచ్చిపెట్టింది. ప్రస్తుతం అతని వద్ద 50,000కు పైగా షేర్లు ఉన్నాయి.

# ద్రవ్యోల్బణ పెరుగుదలతో రెపోరేట్లలో మార్పులు




**ముంబయి, జూన్ 13:** దేశంలో ద్రవ్యోల్బణం మళ్లీ పెరుగుతుండటంతో భారతీయ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను పెంచేదిశగా అడుగులు వేస్తోందని ఐసీఐసీఐ బ్యాంక్ గ్లోబల్ మార్కెట్స్ నివేదిక అంచనా వేసింది. రాబోయే రోజుల్లో ఆర్‌బీఐ రెపో రేటును 50 నుంచి 75 బేసిస్ పాయింట్ల వరకు పెంచే అవకాశం ఉందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఈ మార్పులు చోటుచేసుకోవచ్చని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ విశ్లేషణ ప్రకారం 2026-27ఆర్థిక సంవత్సరంలో దేశీయ ద్రవ్యోల్బణం 5 శాతానికి చేరే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల హెచ్చుతగ్గులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మరియు దేశంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల ఆహార వస్తువుల ధరలు పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడానికి ఆర్‌బీఐ సాధారణంగా వడ్డీ రేట్లను పెంచుతుంది. ప్రస్తుతం ఆర్‌బీఐ రెపో రేటు 5.25 శాతం వద్ద కొనసాగుతోంది. ఒకవేళ ఐసీఐసీఐ బ్యాంక్ అంచనాలే నిజమైతే, 50-75 బేసిస్ పాయింట్ల పెంపుతో రెపోరేటు 5.75నుంచి 6.00 శాతానికి చేరే ప్రమాదం ఉంది. గత కొన్ని త్రైమాసికాలుగా యథాతథ స్థితిని కొనసాగించినప్పటికీ మారుతున్న ఆర్థిక సమీకరణాల దృష్ట్యా రానున్న ద్రవ్య పరపతి సమీక్షల్లో కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఆర్‌బీఐ గనుక రెపోరేటును పెంచితే, వాణిజ్య బ్యాంకులు కూడా తమ రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

రాజమహేంద్రవరం ఆదివారం 14 జూన్ 2026 I


# మిస్టరీగా మారిన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం సంఘటన...?

- కేసుకు ఆధారంగా నిలిచిన పెంపుడు కుక్క మృతి
- ఎనిమిది రోజులు గడిచినా తెలియని చిన్నారి జాడ
- మిస్టరీని ఛేదించి చిన్నారిని కాపాడేందుకు శ్రమిస్తున్న పోలీస్ యంత్రాంగం
- కొండని జల్లెడ పట్టినా ఫలితం శూన్యం
- కిడ్నాప్ కోణంలో కూడా దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు







**తుని, జూన్ 13,( ప్రభాతవార్త )** తుని మండలం డొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారం గ్రామంలో ఈనెల 6వ తేదీన మూడేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి( జాహ్నవి ) అదృశ్యమైన సంఘటన మిస్టరీగా మారింది. అగ్రహారం గ్రామంలో కొండను ఆనుకుని ఉన్న పామాయిల్ తోటలో కాపలాదారుగా ఉంటున్న సుంకర గణేష్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి. అదే పామాయిల్ తోటలో గణేష్ కుటుంబం నివాసం ఉంటుంది. చిన్నారి జ్ఞానేశ్వరి ఆడుకుంటూ పెంపుడు కుక్కతో సహా ఈనెల 6వ తేదీన అదృశ్యమైంది. ఈ సంఘటనపై నమోదైన కేసులో భాగంగా చిన్నారి కోసం పోలీసులు అప్పటినుండి గాలింపు చర్యలు మొదలుపెట్టారు. నిర్విరామంగా పోలీసులు పాప కోసం గాలింపు చర్యలు చేపడుతున్న ఎటువంటి ఆధారం లభించలేదు. మూడు రోజుల తర్వాత చిన్నారితో పాటు అదృశ్యమైన పెంపుడు కుక్క చిన్న చిన్న గాయాలతో తిరిగి ఇంటికి చేరుకుంది. దీంతో పోలీసులు, కుటుంబ సభ్యులు కుక్క ద్వారా పాప ఆచూకీ లభిస్తుందని భావించారు. ఇంటికి వచ్చిన కుక్క ప్రవర్తన భిన్నంగా ఉండటంతో పోలీస్ అధికారులు వెటర్నరీ వైద్యులతో కుక్కకు వైద్య సేవలు అందించారు. కుక్క సాధారణ స్థితికి వచ్చిన తర్వాత సాంకేతిక నిపుణుల సహకారంతో పోలీసులు కుక్క మెడకు జిపిఎస్ ట్రాకర్ ని అమర్చి వదిలిపెట్టారు. జిపిఎస్ ట్రాకర్ ఆధారంగా కుక్క వెళ్ళిన ప్రాంతాలలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా పాపకు సంబంధించి ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో చిన్నారి మిస్సింగ్ కేసు మిస్టరీగా మారింది. చిన్నారి అదృశ్యం కేసును చేదించేందుకు ఆధారంగా భావించిన ట్రాకర్ అమర్చిన పెంపుడు కుక్క శనివారం మృతి చెందడంతో కుటుంబ సభ్యులలో ఆందోళన మరింత పెరిగి పాప కోసం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెద్దాపురం ఎస్డిపిఓ తిలక్ నేతృత్వంలో తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చెన్నకేశవరావు ఆధ్వర్యంలో తుని రూరల్ ఎస్సై కృష్ణమాచారి, కోటనందూరు ఎస్సై టి. రామకృష్ణ, తొండంగి ఎస్సై జగన్మోహన్ తో పాటు పెద్దాపురం డివిజన్ పరిధిలోని పోలీస్ యంత్రాంగం వారం రోజులుగా చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎటువంటి ఫలితం లేకపోవడంతో పాప కుటుంబ సభ్యులు, పోలీసులు విస్మయం చెందుతున్నారు. ఎస్ డి ఆర్ ఎఫ్, ఫైర్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ సుమారు 300 మంది పోలీసులు చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. డ్రోన్స్, డాగ్ స్క్వాడ్ తో కొండలను,తోటలను జల్లెడ పట్టిన పోలీసులు కిడ్నాప్ కోణంలో కూడా దర్యాప్తు వేగవంతం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. తుని బస్టాండ్, రైల్వే స్టేషన్, నర్సీపట్నం రోడ్డు తదితర ప్రాంతాల్లో సైతం పోలీసులు గాలిస్తున్నారు. ఎనిమిది రోజులు గడుస్తున్నా చిన్నారి మిస్సింగ్ కు సంబంధించి ఒక్క ఆధారం లభించకపోవడంతో పాప క్షేమంగానే ఉంటుందా అనే కోణంలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏది ఏమైనా ప్రజల ప్రార్ధనలు, పోలీసుల శ్రమ ఫలించి చిన్నారి జ్ఞానేశ్వరి క్షేమంగా అమ్మ ఒడికి చేరాలని కోరుకుందాం.



# జోరువానను సైతం లెక్కచేయని శ్రీవారి భక్తులు.

" గోవింద నామస్మరణతో మారుమ్రోగిన వాడపల్లి క్షేత్రం

" దగ్గరుండి పర్యవేక్షించిన డీసీ, చైర్మన్లు...







**ఆత్రేయపురం, జూన్ 13,(ప్రభాత వార్త).** శని త్రయోదశి పర్వదినం, ఏడువారాల భక్తులు జోరు వాన సైతం లెక్కచేయకుండా.. కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు వేలాదిగా తరలివచ్చారు.దీంతో మాడవీధులన్నీ భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగాయి.వేకువజామున తొలి హారతితో ప్రారంభమైన దర్శన కార్యక్రమాలు రాత్రి 10 గంటల వరకు కొనసాగాయి. కొంతమంది భక్తులు రాత్రికే ఆలయ ప్రాంగణానికి చేరుకుని స్వామివారి సన్నిధిలో గడిపారు. తెల్లవారుజాము నుండి స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్ లలో నిలిచి, ఆయన దర్శన భాగ్యాన్ని పొందుతున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తిశ్రద్ధలతో - ప్రవాహం! నిలబడ్డారు. వృద్ధులు, చిన్నారులు, అంగవైకల్యం గల భక్తులకు ఆలయంలో ప్రత్యేక దర్శన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అలాగే ఔట్ల వంతెన వద్ద నుండి ఆలయం వరకు ఉచిత వాహనాల ద్వారా భక్తులను తరలించారు. దీంతో జోరు వాన సైతం తట్టుకుంటూ.. గోవింద నామ స్మరణతో తన్మయత్వం చెందుతూ భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామివారి అన్న ప్రసాదాన్ని కూడా భక్తి శ్రద్ధలతో స్వీకరించారు. ఏడు వారాల వెంకన్నగా పేరుగాంచిన ఈ పవిత్ర క్షేత్రానికి ఏడువారాల వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు అత్యధికంగా విచ్చేశారు. విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, తదితర ప్రాంతాల నుండి కూడా అత్యధికంగా భక్తులు ఈ ఆలయానికి విచ్చేశారు. వచ్చిన ప్రతి భక్తుడి ముఖంలో ఓ విశ్వాసం, హృదయంలో ఓ భక్తి కనిపించింది. సుప్రభాత సేవతో ప్రారంభమైన ఆరాధనలు రోజంతా వైభవంగా కొనసాగాయి. ఆలయ ప్రాంగణం భక్తి భావనతో నిండిపోయింది. ఎండ తీవ్రతను లెక్కచేయకుండా స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి వేచివున్న భక్తులు "స్వామివారి కటాక్షమే మాకు శక్తి" అంటూ ఆనందం వ్యక్తం చేశారు. స్వామి సేవ కోసం పరితపించి వచ్చిన భక్తుల సేవే ప్రధాన లక్ష్యంగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు వెల్లడించారు. మండుటెండలను దృష్టిలో, చలువ పందిళ్లు, మంచినీటి సదుపాయం, మజ్జిగ పంపిణీ, చిన్నారులకు పాలు అందించడం వంటి సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం కల్పించడం జరిగిందన్నారు. ఎండ వేడిమి ప్రభావం తెలియకుండా ఆలయ ప్రాంగణంలో సమగ్ర చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే వివిధ టిక్కెట్ల ద్వారా దర్శనాలు సులభంగా అయ్యేలా క్యూ లైన్ లను అదనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాహనాల పార్కింగ్ ప్రాంతాలను కూడా విస్తరించడం వల్ల, పార్కింగ్ ఇబ్బందులు సుమారు లక్షకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని సుమారు 35 వేల మందికి అన్నప్రసాదం స్వీకరించారని స్వామి వారికి వివిధ సేవల ద్వారా 70 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వామి వారి దర్శనం జరిగేటట్లు లక్షణంగా పూర్తి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రతిరోజు, శనివారం ఆలయానికి వచ్చే భక్తులకు అన్నీ వాట్సాప్ మనమిత్ర విధానాన్ని భక్తులకు ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు వివరించారు. అలాగే అన్నిసేవల వినియోగించుకుని స్వామివారి దర్శనం వినియోగించుకోవాలన్నారు. వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశానన్నారు. ఏ ఒక్క భక్తునికి ఇబ్బందులు లేకుండా 104, 108, తో పాటు కిమ్స్ హాస్పిటల్ వారు ఒక అంబులెన్స్ ఏర్పాటు చేశారని అన్నారు. భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని వివిధ జిల్లాల ల్లాల ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామివారి సేవలో సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, మనోజ్, వర్మ, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీనివాస్, వరప్రసాద్, గ్రామస్తులు ఏపుగంటి సుబ్బారావు, ఏపుగంటి వెంకటేష్ తదితరులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# అర్ధరాత్రి మట్టి తోలకాలు

**ట్రాక్టర్ల జోరు జనం బేజారు - ఫిర్యాదులు పట్టించుకోని సంబంధిత అధికారులు**

**కొత్తపేట మండలంలోమట్టి మాఫియా దందా**



**కొత్తపేట, జూన్13,(ప్రభాతవార్త)** కొత్తపేట మండలంలో అర్ధరాత్రి వేళల్లో మట్టి తోలకాలు జోరుగా జరుగుతున్నాయి ట్రాక్టర్లు ట్రిప్పర్లు ద్వారా మట్టి తోలకాలు జోరుగా జరుగుతున్నాయి సమాచారం అందించిన అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజల వాపోతున్నారు రాత్రి 11:00 గంటలు మొదలుకొని ఉదయం నాలుగు గంటల వరకు తోలకాలు జరుగుతున్నాయి ముఖ్యంగా పలివెల గ్రామ పరిధిలోని ఆయకట్ల నుంచి మట్టి తీసుకుని డాక్టర్లపై మట్టితోలకాలు జరుపుతున్నారు వర్షాలు వస్తే మట్టి తోలకాలకు ఇబ్బంది కలుగుతుందని ఈలోపులోనే దందా కొనసాగించేస్తున్నారు ఎక్కువగా ట్రాక్టర్లు ద్వారా మట్టి రవాణా జరుగుతుంది ప్రభాతవార్త సంబంధిత రెవెన్యూ అధికారులకు ఫోన్ చేయగా వారు ఫోన్ లిఫ్ట్ చేయట్లేదు రాత్రికి రాత్రి అతి వేగంగా అక్రమ మట్టి తవ్వకాలు తోలకాలు జరుగుతున్నాయి స్థానిక తాసిల్దార్ ఆఫీస్ ముందు నుంచి పోలీస్ స్టేషన్ ముందు నుంచి ట్రాక్టర్లపై లారీలపై మట్టి రవాణా జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు అనుకుంటున్నారు ట్రిప్పులు ఎక్కువగాపడాలనే ఆశతో ట్రాక్టర్ డ్రైవర్లు అతివేగంగా రోడ్డుపై వెళ్తుంటే ఆ స్పీడ్ కు ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందో ఏమోనని జనాలు బేజార్లు ఎత్తుతున్నారు వీటి వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయని జనం అనుకుంటున్నారు దీనిపై స్థానిక ఆర్ ఐ రవి శంకర్ ను వివరణ కోరగా రెవెన్యూ డిపార్ట్మెంట్ పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని ఇతర అనుమతులు ఏమన్నా ఉన్నాయేమో పరిశీలించి మట్టితోలకాలపై నిఘా పెడతామని తెలిపారు సంబంధిత జిల్లా అధికారులు కొత్తపేట మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను తోలకాలను నిరోధించాలని ప్రజలు కోరుకుంటున్నారు

## వాడపల్లి వెంకన్న ను దర్శించుకున్న సినీ నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్.

**స్వామివారి నిత్యాన్న పథకానికి రూ ,50,116/- విరాళం**



**ఆత్రేయపురం, జూన్,13,(ప్రభాత వార్త).** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కొనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని స శనివారం ప్రముఖ సినీ కొరియోగ్రఫర్ శేఖర్ మాస్టర్ శ్రీ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.స్వామివారి నిత్యాన్న పథకానికి రావులపాలెం వాస్తవ్యులు మండ వెంకటేశ్వర రెడ్డి , బంగారు లక్ష్మి దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ ,50,116/- రూపాయలు అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా డిప్యూటీ కమిషనర్ ఈఓ నల్లం సూర్య చక్రధరరావు, జూనియర్ అసిస్టెంట్, వై శ్రీనివాస్ లు స్వామివారి చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు.

## రక్తదాత డాక్టర్ ప్రసాద్ కు జిల్లా కలెక్టర్ సత్కారం.



**తాళ్లరేవు, జూన్ 13 (ప్రభాతవార్త ):** తాను స్వయంగా రక్తదానం చేయడంతో పాటు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి అనేక మంది ఆపదలో ఉన్న ప్రజలకు రక్తాన్ని అందించడంలో దశాబ్దాలుగా కృషి చేస్తున్న కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి. మల్లవరం గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి, గ్రామీణ వైద్యులు వి. ఆర్. ఎన్. బి. ప్రసాద్ కు జిల్లా కలెక్టర్, హరేంధీర ప్రసాద్ ఘన సత్కారం చేశారు. ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 2వ తేదీన మెగా బ్రదర్స్ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజులు సందర్భంగా పి. మల్లవరంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి తలసీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 150 పైబడి బ్లడ్ యూనిట్స్ అందజేయడం జరిగిందని వైద్యులు ప్రసాద్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైతే రక్తదాతలను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలకు గుర్తింపుగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా వి అర్ యన్ బి ప్రసాద్ ను కాకినాడ జిల్లా కలెక్టర్ యం యన్ హరేంధీర ప్రసాద్, రెడ్ క్రాస్ ఛైర్మన్ వై డి రామారావు సత్కరించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కు రక్తం ఎక్కిస్తున్న సందర్భంగా ఇలా సత్కారం అందుకోవడం ఆనందాన్నిచ్చిందని వైద్యులు ప్రసాద్ అన్నారు. ఈ ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా రక్తదాన కార్యక్రమాలు చేపడతానని ప్రసాద్ శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు.

## త్రిపుల్ ఐటిల్లో 5 సీట్లు సాధించిన శంఖవరం ఏపి మోడల్ స్కూలు విద్యార్థులు





**శంఖవరం జూన్ 13 ప్రభాతవా ర్త** మండల కేంద్రం శంఖవరంలో గల ఏపి మోడల్ స్కూలుకు చెందిన 5గురు విద్యార్థులు త్రిపుల్ ఐటిల్లో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఏ వీరరాజు తెలిపారు. రాష్ట్రంలోని ఏపి మోడల్ స్కూళ్ళలోనే అత్యధికంగా 594 మార్కులు సాధించిన ఎస్ స్వాతి, ఇ దేవకి 581 మార్కులు, వై అపర్ణదేవి 581 మార్కులు, జి గౌతమి శరణ్య 577 మార్కులు, బి నవ్య 573 మార్కులు సాధించగా, వీరికి శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు త్రిపుల్ ఐటిల్లో సీట్లు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ వీరరాజు, స్కూలు కమిటి ఛైర్మన్ జి లక్ష్మీజ్యోతి, కాకినాడ జిల్లా డిఇఓ పి రమేష్, శంఖవరం మండలం ఎంఇఓలు ఎస్వీ రమణ, టి గోవింద్, ఉపాధ్యాయులు, మోడల్ స్కూలు సిబ్బంది అభినందించారు.

## సోకిలేరు వ్యూ పాయింట్ -అమ్మవారి గుడి మధ్య ఆగిపోయిన లోడ్ లారీ.పెద్ద వాహనాలకు కష్టం.

**చింతూరు -మారేడుమిల్లి మధ్య ట్రాఫిక్ జామ్.**





**చింతూరు జూన్ 13 ప్రభాత వార్త.** చింతూరు మండలం సోకిలేరు వ్యూ పాయింట్ -అమ్మవారి గుడి దిగువ రెండొవ మలుపు వద్ద లోడ్ లారీ అప్ ఎక్కుతూ యాక్సిల్ విరిగిపోయి ఆగిపోయింది. కార్లు, బొలెరో వంటి వాహనాలకు ఏ టువంటి ఇబ్బంది లేదు. లారీ, బస్సు వంటి వాహనాల రాకపోకలు కష్టమే. సో వాహన దారులు చింతూరు - మారేడుమిల్లి మధ్య ప్రయాణం కాస్త అలోచించి వెళ్ళండి. మారేడుమిల్లి మండలం పాములేరు సమీపంలో రోడ్ వెడల్పు చేస్తున్నారు. చింతూరు వైపు నుండి వరి పొట్టు లారీ వచ్చి ఇరుకుంది. దాదాపు గంట సేపు అక్కడ ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఘాట్ రోడ్ పై ఊక లారీలు వెళ్తున్న ఆర్ టీ ఓ అధికారులు చూసి చూడనట్టు ఉండటంతో ఘాట్ రోడ్ లో నిత్యం రాత్రి సమయంలో ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఇప్పుడు వర్షలు కురుస్తున్నాయి. సైడ్ ఇవ్వటం చాలా కష్టం. సో అధికారులు దీనిపై దృష్టి పెట్టండి. ప్రజలకు వాహనాలకు అసౌకర్యం కలగకుండా చూడండి.

# వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం కృషి

**ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీ పురందేశ్వరి**



**రాజమహేంద్రవరం సిటీ జూన్ 13( ప్రభాతవార్త)** 2004 7నాటికి దేశాన్ని వికసత్ భారత్ తీర్చిదిద్దాలని లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సమగ్రంగా కృషి చేస్తుందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శనివారం దివాన్ చెరువులో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి గత 12 సంవత్సరాల్లో నరేంద్ర మోడీ దేశానికి సుపరిపాలన అందించారని పేర్కొన్నారు. అవినీతికి తావులేని పారదర్శక పాలన ద్వారా దేశ అభివృద్ధికి బలమైన పునాదివేశారని గడిచిన 12 ఏళ్లలో సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడడానికి కేంద్ర ప్రభుత్వం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు దోహదపడుతున్నాయని అన్నారు. 385 కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని అక్టోబర్ 2027 నాటికి పూర్తి చేయలేని లక్ష్యంగా ఉన్నప్పటికీ గోదావరి పుష్కరాలు నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఉద్దేశంతో జులై 2027 నాటిక పనులు పూర్తి చేయాలని నిర్మాణ సంస్థలను కోరినట్లు తెలిపారు. ఆరులేన్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం జరుగుతుండగా పది మీటర్లు సర్వీస్ రోడ్డు పాదచారుల కోసం మూడు మీటర్ల వెడల్పుతో ప్రత్యేక మార్గం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదనముగా గ్రీనరీ అభివృద్ధి వాహనాల పార్కింగ్ సదుపాయాల కల్పనకు కూడా కాంట్రాక్ట్ సంస్థ సానుకూలంగా స్పందించడం అభినందనీయం అన్న. ఈ ప్రాజెక్టు మంజూరు చేసి అమలకు సహకరించిన ప్రధానమంత్రి, కేంద్ర రహదారుల జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీలకు ఎంపీ పురందేశ్వరి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈమె వెంట పార్టీ నాయకులు కార్యకర్తలు కూటమి నాయకులు ఉన్నారు.


## నిరుపేద కుటుంబాలకు సిఎం సహాయనిది వరం... : ఎమ్మెల్యే ఆనందరావు.

**సహాయ నిధి చెక్కుల పంపిణీ.. 29 మందికి రూ18 లక్షల ఆర్థిక సాయం**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్13,ప్రభాతవార్త.** అమలాపురం నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలు, అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న బాధితులకు అండగా నిలిచేందుకు సిఎం సహాయనిది ఓ వరం అని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు.ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం18 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎంఎల్ఏ పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన మొత్తం 29 మంది లబ్ధిదారులకు సంబంధించి స్వయంగా బాధితులకు,వారి కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో ఉన్న ప్రజలను గుండెలకు హత్తుకుని ఆదుకోవడంలో మన కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన నిధులు మంజూరయ్యేలా తాము ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, దానికి అనుగుణంగానే పెద్ద ఎత్తున చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. నిరుపేదల ఆరోగ్యం, సంక్షేమమే ధ్యేయంగా గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారని, భవిష్యత్తులోనూ నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను ఎల్లప్పుడూ ముందుండి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆపత్కాలంలో తమకు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నందుకు చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కష్టసమయంలో తమ దరఖాస్తులపై ప్రత్యేక చొరవ తీసుకుని, నిధులు త్వరగా మంజూరయ్యేలా చేసిన ప్రియతమ ఎమ్మెల్యే కి, అలాగే కూటమి ప్రభుత్వానికి వారు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు,కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఘనత




రామచంద్రపురం, జూన్ 13 (ప్రభాతవార్త): ద్రాక్షారామ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) విద్యార్థులు అత్యంత ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్ ఐటీ ఆర్జీయూకేటీ సీట్లను సాధించి సరికొత్త రికార్డు సృష్టించారు.పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పేరిచర్ల శేఖర్ తెలిపారు.?క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల వివరాలు ?కోన అభిశ్రీ -- నూజివీడు క్యాంపస్,?కె. అభిరామ్ -- ఒంగోలు క్యాంపస్,?ఎమ్.సతీష్ చంద్ర -- శ్రీకాకుళం క్యాంపస్,?ఎన్. లిఖిత సారా -- ఇడుపులపాయ క్యాంపస్లలో సీట్లు సాధించారు.?ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల నిరంతర కృషి,విద్యార్థుల అంకితభావం,క్రమశిక్షణతో పాటు గ్రామస్తుల సహకారం వల్లే ఈ అద్భుత విజయాలు సాధ్యపడ్డాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ సంస్థలకు దీటుగా రాణించి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడం పట్ల విద్యార్థులను,వారి తల్లిదండ్రులను పాఠశాల ఉపాధ్యాయ బృందం,విద్యా కమిటీ చైర్మన్,మరియు గ్రామ పెద్దలు అభినందించారు.

## ద్రాక్షారామంలో బిజెపి నియోజకవర్గ కార్యవర్గ సమావేశం



**రామచంద్రపురం, జూన్ 13 (ప్రభాతవార్త):** గ్రామస్థాయిలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరూ నడుం బిగించాలని, నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అనకాపల్లి బిజెపి జిల్లా ఇంచార్జి కర్రి చిట్టిబాబు పిలుపునిచ్చారు.ద్రాక్షారామంలో నియోజకవర్గ బి ఎల్ ఏ-1 ఇంచార్జి సలాది శేఖర్ అధ్యక్షతన బిజెపి నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా బిజెపి ఇంచార్జి,ఎస్.ఐ.ఆర్ జిల్లా కన్వీనర్ తమనంపూడి రామకృష్ణా రెడ్డి, కర్రి చిట్టిబాబులు హాజరయ్యారు.?ఈ సందర్భంగా తమనంపూడి రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ నుండి భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో బూత్ స్థాయిలో జరగనున్న సమగ్ర ఎన్నికల సర్వే ప్రక్రియలో బిజెపి తరపున ఉన్న బి.ఎల్.ఏ-2 ఇన్చార్జీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వేలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ఓటు హక్కును కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. మన ప్రాంతానికి ఇతర దేశాల నుంచి వలస వచ్చిన వారు,ఇప్పటికీ ఆధార్ లేని వారు,డేటాకు లింక్ అవ్వని వారిని ఈ సర్వే ద్వారా గుర్తించనున్నట్లు రామకృష్ణా రెడ్డి తెలిపారు. వార్డులలో ఉండే సంఘ వ్యతిరేక శక్తులను ఏరివేయడానికి, దేశ భద్రతను కాపాడటానికి భారత ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి అందరూ సహకరించాలని, మ్యాప్‌లో డేటా అప్‌లోడ్ చేయడానికి ఈ సమగ్ర సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు గానాల కళ్యాణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టువాడ హరిబాబు, నియోజకవర్గ మండల బిజెపి అధ్యక్షులు, ఇన్చార్జీలు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడా ప్రోత్సాహం... ఆధ్య రమేష్



**రాజవొమ్మంగి, జూన్ 13, ప్రభాతవార్త** యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడా ప్రోత్సాహం ఇస్తున్నట్లు రంపచోడవరం నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు ఆద్య రమేష్ అన్నారు. నియోజకవర్గ వైస్సార్సీపీ ఇన్ ఛార్జి నాగులపల్లి ధనలక్ష్మి సూచనలతో రాజవొమ్మంగి జడ్డంగి గ్రామంలో. శనివారం క్రికెట్ క్రీడాకారులకు వైస్సార్సీపీ నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు ఆధ్య రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీ షర్ట్ లను మండల వైస్సార్సీపీ కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్రటరీ కొంగర మురళీకృష్ణ, వైస్సార్సీపీ నాయకులు సింగిరెడ్డి రవి, మండల సోషల్ మీడియా ప్రతినిధి కొప్పిశెట్టి దుర్గబాబులు 45 మందికి పంపిణీ చేశారు. కొమరాపురం, రాజవొమ్మంగి, బలిజిపాడు గ్రామాలకు చెందిన క్రీడాకారులు రూ. 18 వేలు విలువైన టీషర్ట్ లను అందుకొన్నారు. ఈకార్యక్రమంలోమండల వైస్సార్సీపీ కన్వీనర్ సింగిరెడ్డి రామకృష్ణ, రాష్ట్ర యువజన విభాగ జనరల్ సెక్రటరీ కొంగర మురళీకృష్ణ, వైస్సార్సీపీ నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు ఆధ్య రమేష్, వైస్సార్సీపీ నాయకులు సింగిరెడ్డి రవి, మండల సోషల్ మీడియా ప్రతినిధి కొప్పిశెట్టి దుర్గబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## మైనింగ్ లారీలపై కేసులు నమోదు.



**రౌతులపూడి, జూన్ 13.(ప్రభాత వార్త)** మండల కేంద్రం రౌతులపూడిలో మైనింగ్ లారీలపై రెండవ సారి శనివారం కేసులు నమోదు చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాస్ తెలిపారు. అధిక లోడు, టాక్స్, ప్రమాద కరమైన డ్రైవింగ్ ల పై దృష్టి సారించి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న తనిఖీలలో ఈ రోజు పంతొమ్మిది వాహనాలపై కేసులు నమోదు చేసి లక్షా తొంబది వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. ఈ కార్య క్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ఎం. కళా జ్యోతి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# పేరు రైతులది...

## సొమ్ము దళారులది, అధికారులది

**ఎంఎల్ఏ ఆదేశాలు బేఖాతరు**

**అధికారుల కనుసన్నలలోనే మట్టి తవ్వకాలు**

**.రోడ్లపై జారి పడుతున్న వాహనదారులు**







**పెదపూడి.ప్రభాతవార్త** దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్న చందంగా తయారయింది పెదపూడి మండల అధికారుల పరిస్థితివేసవిలో రైతుల పొలాల్లో మెరక పనులు చేసుకోవడాన్ని ఆసరాగా తీసుకుని పలు గ్రామాల్లో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మండలంలో పెదపూడి, పెద్దాడ, సంపర, కైకవోలు, శహపురం, దోమాడ, జి మామిడాడ,గంగ్రేడు, కుమారప్రియం,తదితర గ్రామాల్లో ఈ దందా సాగుతోంది. రైతుల పొలాల్లో మెరక తీస్తామని చెప్పి అక్రమార్కులు.. ట్రాక్టర్ల ద్వారా స్థానిక పుంతరోడ్లపై గుట్టలుగా వేసి నిల్వ చేస్తున్నారు. పెదపూడి, పెద్దాడ, జి.మామిడాడ, రాజుపాలెం, కాండ్రే గుల గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇటుకల బట్టీల యజమానులతో మాట్లాడుకుని ఆ గుట్టలను రాత్రికి రాత్రే టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా గనులు, రెవెన్యూ శాఖలు తమకేమీ పట్టనట్లు ఊరుకుంటున్నారు. రైతు పొలంలో తీసిన మట్టికి ఒక్క రూపాయి ఇవ్వకుండా టిప్పరుకు సుమారు రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పైగా అక్రమార్కులు సొమ్ములు చేసుకుంటున్నారు. రోడ్లపై భారీ లోడు, శబ్దాలతో వెళుతున్నా పోలీసు యంత్రాంగం చూస్తూ ఊరుకుంటుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత నెలలో అర్ధరాత్రి కొన్ని ట్రాక్టర్లు, టిప్పర్లను పట్టుకుని పేరుకు మాత్రమే నిలుపుదల చేశారని, మళ్లీ యధేచ్ఛగా దందా సాగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. మండలంలో ఎవరికీ మట్టి తవ్వకాలకు, తరలింపులకు అనుమతులు ఇవ్వలేదని తహసీల్దార్ సీతాపతిరావు పేర్కొన్నారు. అక్రమ తవ్వకా లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## అడ్డతీగల మండలంలో ఘనంగా యోగాంధ్ర సెలక్షన్స్

**-ఒత్తిడిని జయించడానికి యోగా ఎంతో అవసరం ఎంపీడీవో ఏ.వి.వి. కుమార్**



**అడ్డతీగల, జూన్ 13, (ప్రభాతవార్త)** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అడ్డతీగల మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు మండల స్థాయి యోగా ఎంపిక పోటీలు మండల్ లెవెల్ సెలక్షన్స్ అత్యంత ఉత్సాహభరితంగా జరిగాయి. మండల విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావు మరియు వ్యాయామ ఉపాధ్యాయుల పీడీ ఆధ్వర్యంలో వయస్సు, ప్రతిభ ఆధారంగా మూడు కేటగిరీలలో ఈ ఎంపికలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.వి.వి. కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ యోగా అభ్యాసం ఎంతో అవసరమని పేర్కొన్నారు. యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించడమే కాకుండా, ఉల్లాసం, సంతోషం లభిస్తాయని తెలిపారు. ప్రతిరోజు యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో తమ విధులను సక్రమంగా నిర్వర్తించుకోవచ్చని ఆయన సూచించారు. మండల స్థాయి నుండి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన అభ్యర్థులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి, మన అడ్డతీగల మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ మరియు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు ఈ ఎంపికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగాజూన్ 5, 6 తేదీలలో మొదటగా వ్యాయామ ఉపాధ్యాయులకు పీడీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జూన్ 8, 9, 10 తేదీలలో శిక్షణ పొందిన పీడీలు సచివాలయాల వారీగా అభ్యర్థులకు శిక్షణ అందించారు. జూన్ 11, 12 తేదీలలో విలేజ్ స్థాయిలో ఉత్సాహంగా పోటీలు నిర్వహించారు. శనివారం నాడు విలేజ్ స్థాయి విజేతలకు ఇక్కడ మండల స్థాయిలో తుది సెలక్షన్స్ నిర్వహించినట్లు అధికారులు స్పష్టం చేశారు. ?ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావుతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు పీడీలు టి. శ్రీను, మల్లేశ్వరరావు, రాంబాబు, కన్నారావు, నాగమణి, లావణ్య, వివిధ గ్రామ సచివాలయాల సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## అడ్డతీగల సబ్‌స్టేషన్‌లో రూ. 6 లక్షలతో కొత్త ప్యానల్ బోర్డు ఏర్పాటు



**అడ్డతీగల, జూన్ 13,ప్రభాతవార్త** పోలవరం జిల్లా అడ్డతీగల మండల కేంద్రంలోని 33/11 ఖు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రూ. 6 లక్షల వ్యయంతో నూతన ఆన్ అండ్ ఆఫ్ కంట్రోలింగ్ ప్యానల్ బోర్డును శు క్రవారం సాయంత్రం విజయవంతంగా ఏర్పాటు చేశారు. వివరాల్లోకి వెళితే సబ్‌స్టేషన్ పరిధిలోని రాయిపల్లి ఫీడర్ నుండి వేటమామిడి, మిట్టపాలెం, తుంగమడుగుల, ధన్యంపాలెం, దాకోడు, బందమామిలు, రేగులపాడు, సోమన్నపాలెం, రాయిపల్లి, సాకిరేవుల సహా ఇంచుమించు 50 గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతోంది. అయితే, గత కొంతకాలంగా పాత కంట్రోలింగ్ ప్యానల్ బోర్డు సాంకేతిక సమస్యల కారణంగా తరచూ అంతరాయాలకు గురవుతోంది. దీంతో ఈ 50 గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. డివిజనల్ ఇంజనీర్ వెంకటరమణ, రంపచోడవరం రూరల్ సబ్ డివిజన్ ఇంజనీర్ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన కొత్త ప్యానల్ బోర్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలకు అడ్డుకట్ట వేసేందుకే రూ. 6 లక్షల వ్యయంతో ఈ ఆధునిక ఆన్ అండ్ ఆఫ్ ప్యానల్ బోర్డును ఏర్పాటు చేశాం. దీనివల్ల ఇకపై 50 గ్రామాలకు ఎటువంటి సాంకేతిక లోపాలు లేకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందుతుందని సుదర్శన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల విద్యుత్ శాఖ లైన్‌మెన్లు, జూనియర్ లైన్మెన్, హెల్పర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొని ప్యానల్ బోర్డు అమరిక పనులను విజయవంతంగా పూర్తి చేశారు.

## ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి అశేష భక్త జనం.



**ఆత్రేయపురం, జూన్ 13,(ప్రభాత వార్త)** ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆలయం ,శని త్రయోదశి కావడంతో అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి తరలివచ్చి శ్రీ స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శ్రీ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ర్యాలి గ్రామస్తులు లలితా పారాయణదారులు లలిత సహస్రనామ, మణిద్వీప పారాయణలు చేశారు. ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, శ్రీ స్వామి వారి సేవలో పాల్గొని వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేశారు.

## స్వామి వారి కళ్యాణోత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



**మామిడికుదురు.జూన్ 13(ప్రభాతవార్త)** అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి కళ్యాణోత్సవాల ఆహ్వాన పత్రికలను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం ఆవిష్కరించారు.గన్నవరం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ ఆవిష్కరణ జరిగింది.ఈ నెల 24 నుంచి 28వ.తేదీ వరకు స్వామి వారి వార్షిక దివ్య తిరు కళ్యాణ మహోత్సవాలు జరుగుతాయన్నారు.25 వ.తేదీ రాత్రి గం.9.11 నిముషాలకు స్వామి వారి దివ్య తిరు కళ్యాణం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో ఆలయ ఈఓ ఎం.రాంబాబు రెడ్డి కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం.

**-100 మందికి కంటి పరీక్షలు.**



**తాళ్లరేవు, జూన్ 13( ప్రభాతవార్త):** కోరంగి అభయారణ్యం ప్రాంతంలోని ఈడీసీ ల పరిధి లోని గ్రామ ప్రజలకు అటవీశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడ జిల్లా అటవీ శాఖ తాళ్లరేవు మండలం కోరింగలోని ఫారెస్ట్ కాంప్లెక్స్ వద్ద శనివారం సూర్య ఐ కేర్ వైద్యులచే ఈ ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది.20 ఎకో డెవలప్మెంట్ కమిటీ ల (ఇడిసి) పరిధిలోని ప్రజల కంటి సమస్యలు పరిష్కరించడానికి ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు అటవీశాఖ రేంజర్ ఎస్ ఎస్ ఆర్ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా కాకినాడకు చెందిన ఎ ఎల్ ఐ ఫౌండేషన్ సహకారంతో సూర్య ఐ కేర్ కంటి ఆసుపత్రి వైద్యులు సుమారు 100 మంది కి కంటి పరీక్షలు నిర్వహించారు. ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ, కంటి ఆసుపత్రి సీఈవో ఎ.టి. రాంప్రసాద్ మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్ళే మత్స్యకారులకు, సముద్రం దగ్గరలో పనిచేసేవాళ్ళకు తీవ్రమైన సూర్యరశ్మి (యు.వి. కిరణాలు), ఉప్పు నీటి తుంపర్లు, బలమైన గాలులు, ఇసుక దుమ్ము వలన కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. సముద్రపు నీటిపై సూర్యకాంతి పడి తిరిగి కళ్ళపైకి పరావర్తనం చెందటం వలన కళ్ళకు మరింత సమస్యలు వస్తాయని తెలిపారు. ఇటువంటి కంటి శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని చక్కని కంటి చూపుని పొందాలని కోరారు. ఎ ఎల్ ఐ ఫౌండేషన్ అంధత్వ నివారణకు చేస్తున్న కృషిని రేంజర్ వరప్రసాద్ కొనియాడారు. ఈ శిబిరంలో సుమారు వందమందికి కంటి పరీక్షలు చేయగా అందులో 20 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించామని తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకున్న అందరికీ ఉచిత మందులు, కళ్ళజోళ్ళు అందజేశారు. శస్త్ర చికిత్స అవసరమైన 20 మందికి కంటి శుక్ల ఆపరేషన్లు అడ్వాన్స్ ఫాకో కేటరాక్ట్ ఆపరేషన్లు, అడ్వాన్స్ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ లో త్వరలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరంలో డాక్టర్ పప్పు సత్యనారాయణ, టెక్నీషియన్స్ విజయ్ కుమార్, రమణ, కూటమి నాయకులు కొప్పిశెట్టి చంటి, రేవు వాసు, దాసరి వేణుగోపాల్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్. వీరభద్ర రావు, బీట్ ఆఫీసర్ జి. గోపి నాగేంద్ర కుమార్ కె. ధనుంజయరావు, సిబ్బంది వి.విష్ణు, కె. అప్పారావు ,కోరంగి ఈ.డి.సి. చైర్మన్ పి. ఆనందరావు, వైస్ చైర్మన్ బి. సీతారామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి కోసం పొడగట్లపల్లి రైతుల ఎదురు చూపులు

**-పూడిక తొలగించి సాగునీరు అందించాలని వినతి**



**రావులపాలెం, జూన్ 13 (ప్రభాతవార్త) :** గన్నవరం పెద్ద కాలువ నుంచి పంట పొలాలకు సాగునీరు అందించే తూము పూడికతో నిండిపోవడంతో ఆయకట్టుకు నీరు చేరడం లేదని పొడగట్లపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో జుత్తుగపాడు నవజీవన నగర్ వద్ద గన్నవరం పెద్ద కాలువ నుంచి పంట పొలాలకు నీరు అందించేందుకు తూము ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ తూము ద్వారా మెట్ట చేలు, ఊడుపు చేలు కలిపి సుమారు 120 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని రైతులు పేర్కొన్నారు. అయితే గత రెండేళ్లుగా తూము నుండి సుమారు 400 వందల మీటర్లు పూడికతో నిండిపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయిందని చెప్పారు. కాలువలకు నీరు విడుదల చేసి రోజులు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఆయకట్టుకు నీరు చేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు ఇప్పటివరకు నారుమడులు కూడా వేయలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తూములోని పూడిక, అడ్డంకులను తొలగించి సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు అండగా నిలవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

## గోదావరి నదిలో పర్యాటక బోట్లు తాత్కాలికంగా నిలిపివేత

**-భద్రతా ప్రమాణాల పరిశీలన అనంతరమే అనుమతులు: ఆర్డీవో కె. స్వాతి**



**రంపచోడవరం జూన్ 13 ప్రభాతవార్త .** గోదావరి నదిలో నిర్వహిస్తున్న పర్యాటక బోట్ల నిర్వహణ తీరుపై పలు ఆరోపణలు, భద్రతాపరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా పర్యాటక బోట్ల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె . స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు గోదావరి నదిలో నడుస్తున్న అన్ని పర్యాటక బోట్లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. బోట్ల ఫిట్‌నెస్, సాంకేతిక పరిస్థితి, ప్రయాణికుల సామర్థ్యం, భద్రతా ప్రమాణాలు, లైఫ్ జాకెట్లు, అత్యవసర రక్షణ పరికరాలు, బోట్ యాజమాన్యాలు పర్యాటకుల భద్రత కోసం తీసుకున్న చర్యలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరుగుతుందన్నారు.రెవెన్యూ, పోలీసు, పర్యాటక, మత్స్యశాఖ, విపత్తు నిర్వహణ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కూడిన సంయుక్త బృందం తనిఖీలు నిర్వహిస్తుందని తెలిపారు. బృందం నివేదిక ఆధారంగా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నట్లు నిర్ధారణ అయిన అనంతరమే సంబంధిత బోట్లకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని, తనిఖీలు పూర్తయ్యే వరకు గోదావరి నదిలో పర్యాటక బోట్లను నడపరాదని బోట్ యాజమాన్యాలను ఆర్డీవో స్వాతి హెచ్చరించారు. భద్రతా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

## అడ్డతీగల మండలంలో తాగునీటి సమస్యకు సత్వర పరిష్కారం



**అడ్డతీగల, జూన్ 13, ప్రభాతవార్త** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం, అడ్డతీగల మండలం కోనలోవ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇటీవల తలెత్తిన తాగునీటి సమస్యకు అధికారులు, స్థానిక నాయకుల చొరవతో సత్వర పరిష్కారం లభించింది. వివరాల్లోకి వెళితే తాగునీటి సమస్యను స్థానికులు స్థానిక పెసా చైర్మన్ ఒడుగుల వీరబాబు దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన తక్షణమే స్పందించారు. ఈ విషయాన్ని పంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి, బోర్లు పనిచేయకపోవడానికి గల సాంకేతిక కారణాలను అడిగి తెలుసుకున్నారు.సమస్యపై సానుకూలంగా స్పందించిన పంచాయతీ సెక్రటరీ, బోర్ల మరమ్మతులకు అవసరమైన కొత్త మెటీరియల్‌ను అత్యవసరంగా తెప్పించారు. వెంటనే సిబ్బందిని పురమాయించి, పాడైపోయిన అన్ని బోర్లకు యుద్ధప్రాతిపదికన రిపేర్లు చేయించి మళ్లీ నీరు వచ్చేలా చర్యలు తీసుకున్నారు.సర్పంచులు లేని సమయంలో తాము పడుతున్న తాగునీటి కష్టాలను గుర్తించి, తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించినందుకు గానూ కోనలోవ, వీరభద్రపురం గ్రామస్తులు పెసా చైర్మన్ ఒడుగుల వీరబాబుకు, అలాగే పంచాయతీ సెక్రటరీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాట్రేనికోన గేట్ సెంటర్‌లో ట్రాఫిక్ ఇక్కట్లు

**-ట్రాఫిక్ వద్దు చలానా ముద్దు**



**కాట్రేనికోన జూన్ 13 (ప్రభాతవార్త)** కాట్రేనికోన మండల కేంద్రం గేట్ సెంటర్ వద్ద ప్రతిరోజు సాయంత్రం వేళ ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బంది పడుతున్న పరిస్థితి తలెత్తుతోంది. ఈ సమయంలో ట్రాఫిక్ నియంత్రించడానికి ఒక్క కానిస్టేబుల్ కూడా అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. మండల కేంద్రం కావడంతో సాయంత్రం వేళ వివిధ అవసరాల నిమిత్తం ఎక్కువమంది వినియోగదారులు, వాహనదారులు వస్తుంటారు. దాంతో ఇక్కడ నిత్యం రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇదే సమయంలో ఆర్టీసీ,హైదరాబాద్ వెళ్ళే బస్సులు, ప్రైవేట్ పాఠశాలల బస్సులు శివారు ప్రాంతాలకు వెళ్లే ప్రజలు రావడంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ఒకవైపు ఆబోతుల విహారం ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఆ సమయంలో ఒక్క పోలీసు సిబ్బంది అక్కడ లేకపోవడంతో అస్తవ్యస్తంగా ఉంటుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి 7 గంటల సమయంలో పోలీసులు కాట్రేనికోన పరిసరాల్లో వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. లైసెన్స్, హెల్మెట్, తదితర ధ్రువపత్రాలు పేరుతో చలానాలు విధిస్తున్నారు. కానీ అదే సమయంలో ట్రాఫిక్ క్లియర్ చేయడానికి మాత్రం ఎవరూ రావడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ వాహనాలను తనిఖీ చేసే సమయంలో ఎస్సై గానీ, ఏఎస్ఐ గానీ అక్కడ ఉండడం లేదని, పోలీసులు తమకు ఇష్టం వచ్చినట్టు చలానాలు, ఫైన్‌లు మాత్రమే విధిస్తున్నారని , ట్రాఫిక్ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ కంట్రోల్ చేయాల్సిన పోలీసులు, చలానాలు కొట్టడంలో మాత్రమే బిజీగా ఉంటున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో కనీసం ట్రాఫిక్ మళ్లించిన దాఖలాలు లేవు అని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. రోజూ ఇదే పరిస్థితి నెలకొంటోందని, సాయంత్రం రద్దీ సమయంలో కనీసం ఇద్దరు కానిస్టేబుళ్లతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని వాహనదారులు , ప్రయాణికులు, వ్యాపారులు కోరుతున్నారు. చలానాల కంటే ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఎంతో ముఖ్యమని పోలీసులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు , ప్రయాణికులు కోరుతున్నారు.ఫ్రెండ్లీ పోలీసింగ్ ఎక్కడా పోలీస్ స్టేషన్ కు వెళ్ళినా, రోడ్డుపై ట్రాఫిక్ చలానాలు రాసినా.. వాహనాలు ఆపినా.. పోలీసులు ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగాలని ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు నిత్యం పలు ప్రకటనలు చేస్తుంటారు. అవి క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కానీ పరిస్థితి ఉంది. కాట్రేనికోన పోలీస్ స్టేషన్ లో కొంతమంది సిబ్బంది వివిధ పిర్యాదులు నిమిత్తం వచ్చిన ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగడం లేదనే ఆరోపణలు ఎక్కువగా వినబడుతున్నాయి. కొంతమందిని మర్యాద లేకుండా ఏకవచనంతో పిలుస్తున్నారని ప్రజలు అంటున్నారు. ఇదేనా ఫ్రెండ్లీ పోలీసింగ్ అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి స్టేషన్ కి వచ్చే ప్రజల పట్ల , వాహనదారుల పట్ల మర్యాదగా మెలిగి ఫ్రెండ్లీ పోలీసింగ్ పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించాలని వారంతా కోరుతున్నారు.

## ఎరువుల కొరతపై రైతులు ఆందోళన


**అయినవిల్లి జూన్ 13 ప్రభాతవార్త** తొలకరి ఖరీఫ్ సీజన్ దాదాపుగా ప్రారంభమైంది ములగసరి కార్తి ప్రవేశం రుతుపవనాలు అగమనంతో వర్షాలు ప్రారంభమయ్యాయి రాష్ట్రంలోనూ దేశంలోనూ విస్తృతంగా వర్షాలు కురవడంతో రైతులు తొలకరి పంట వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు అయితే ఈ సంవత్సరం గత సంవత్సరాలకు భిన్నంగా రైతుల పరిస్థితి మారనుంది మన దేశానికి అధిక శాతం ఎరువులు కొరకు ఇతర దేశాలపై ఆధారపడింది గత కొంతకాలంగా గల్ఫ్ దేశాల్లో అమెరికా ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ఎరువుల సరఫరాకు అంతరాయం ఏర్పడి దేశంలో ఎరువుల కొరత ఏర్పడటంతో ప్రభుత్వం ఎరువుల ధరలను భారీగా పెంచేసింది దీంతో గతంలో ఉన్న నిలవలను సైతం వ్యాపారులు బ్లాక్ మార్కెట్లకు తరలించడంతో రైతులకు ప్రస్తుతం కావలసిన ఎరువులు దొరకటం లేదు ముందుగానే పంటకు సరిపడా ఎరువులను కొనుగోలు చేసి సిద్ధం చేసుకోవడానికి రైతులు ఎగబడటంతో ఎరువులు కొరత మరింత తీవ్రతరం అవుతుంది దీనిపై ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక ద్వారా ప్రతి రైతుకు తగినంత రసాయనికి ఎరువులు అందేలా చూడవలసిన అవసరం ఉంది తొలకరి వర్షాలు ప్రారంభమైన వెంటనే అరటి చెరకు మొక్కజొన్న వరి కొబ్బరి కూరగాయల పంటలకు రసాయనిక ఎరువుల వాడకం తప్పనిసరి రైతులు కూడా రసాయనిక ఎరువుల వాడకం గతం కన్నా తగ్గించి వాడి ఎరువుల కొరతను ఎదుర్కోవలసి ఉంది రసాయనక ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట ఎరువులు పశువుల పెంట వాడకం పెంచవలసి ఉంది

## ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలి. ఎస్. ఐ. చినబాబు



**రాజవొమ్మంగి, జూన్ 13, ప్రభాతవార్త** ప్రతీ ద్విచక్ర వాహనదారుడు ప్రయాణ సమయంలో హెల్మెట్ ను తప్పనిసరిగా ధరించాలని జడ్డంగి ఎస్. ఐ. చినబాబు అవగాహనను కల్పించారు. శనివారం సాయంత్రం జడ్డంగి పోలీస్ స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై వాహన తనిఖీలను నిర్వహించారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహన రికార్డులు ప్రయాణ సమయంలో వెంట ఉండాలన్నారు. వేగ నియంత్రణ పాటించాలని ఎస్. ఐ. వివరించారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానాలను వేశారు. ఈకార్యక్రమంలో ఎస్. ఐ. చినబాబు, హెడ్ కానిస్టేబుల్ రాజ్ కుమార్, కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి, ఏ.పి. ఎస్. పి. సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర కార్యదర్శి రాంబాబుకు వైసిపి నేత రమణారావు సత్కారం.



**ఉప్పలగుప్తం,జూన్13 ,ప్రభాతవార్త** చల్లపల్లి కి చెందిన వైసిపి సీనియర్ నేత దంగేటి రాంబాబు ను వైసిపి అధిష్టానం రెండోసారి వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమించింది.ఈ నేపథ్యంలో శనివారం చల్లపల్లిలోని రాంబాబు స్వగృహంలో రాంబాబును అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు కుంచే రమణారావు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. వైసిపి బలోపేతానికి కృషిచేసి పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు పాటుపడదామని అన్నారు. అభినందించిన వారిలో వారిలో మాజీ సర్పంచ్,వైసిపి మహిళా విభాగం మండల అధ్యక్షురాలు జొన్నాడ శ్రీదుర్గ,మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్,వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్,నాయకులు వేగిరాజు సాయిరాజు, మహాపాతు కుమార్, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, జొన్నాడ చిన్ని తదితరులు ఉన్నారు.

## ఓ టి పి లు..నగదు జమపై సమాచారంపై స్పందించి మోసపోవద్దు.. డి.ఎస్పీ ఆశ్రఫ్ అలీ



**రాజవొమ్మంగి, జూన్ 13, ప్రభాతవార్త** రాజవొమ్మంగిలో వారపుసంతలో రంపచోడవరం డిఎస్పీ ఆశ్రఫ్అలీ ఆన్ లైన్ మోసాలపై వివిధ గ్రామాలు నుండి సంతకు వచ్చిన వారికి అవగాహనను కల్పించారు. ఓ టి. పి ఎవరికి చెప్పరాదన్నారు. లింకు ఓపెన్ చేస్తే డబ్బులు వస్తాయని ఆశచూపుతారన్నారు. ఆన్ లైన్ మోసాలు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డబ్బుతోనే అవసరాలు ముడిపడి ఉన్నాయని అన్నారు. డబ్బులు ఊరికే రావు కదా అని అన్నారు. సమస్యలు ఉంటే తెలుపాలన్నారు. మా పోలీసులు వల్ల ఇబ్బందులు ఉన్నా చెప్పాలని అన్నారు. గంజాయి వల్ల అనర్ధాలను వివరించారు. పశువుల వల్ల జాతీయ రహదారి పై జరిగే ప్రమాదాలపై తెలిపారు. ప్రతీ మహిళ శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకొని అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహకారాన్ని పొందవచ్చునని అన్నారు. రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ సందర్శించి రికార్డులను తనిఖీలు చేసి కేసులు ప్రగతిని అడగటం జరిగిందని సి. ఐ. గౌరీశంకర్ తెలిపారు. రాజవొమ్మంగి ఎస్. ఐ. వెంకట్రావు, జడ్డంగి చినబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో గోపాలపురం విద్యార్థుల సత్తా..!





**గోపాలపురం, జూన్ 13 (ప్రభాతవార్త):** గోపాలపురం మండలంలో పదో తరగతి విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల విడుదలైన ట్రిపుల్ ఐటీ ప్రవేశాల ఎంపికల్లో గోపాలపురం మండలం నుంచి ఏకంగా 11 మంది విద్యార్థులు సీట్లు పొంది ఘనత సాధించారు. ఇందులో ఇద్దరు బాలురు ఉండగా, 9 మంది బాలికలు ఉండటం విశేషంగా నిలిచింది.మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలకు చెందిన వై.లీలా భవాని, వినిలా జాస్మిన్, జి.పల్లవి, ఎం.పద్మిని, సౌమ్యశ్రీ భవాని, గగనశ్రీ, హారిక, గీతిక ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి పాఠశాలకు పేరు తీసుకొచ్చారు.అలాగే కొవ్వూరుపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థి సరెడ్ల జగన్ బాబు, రాజంపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు జశ్వంత్, కౌసల్య కూడా తమ ప్రతిభతో ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందారు.ఇటీవల నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించడం పట్ల ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు ఎంపికైన వారిని అభినందిస్తూ వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు.మండలం నుంచి ఒకేసారి 11 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలు పొందడం గోపాలపురం విద్యారంగానికి గర్వకారణమని విద్యావేత్తలు పేర్కొన్నారు. విద్యార్థుల విజయంతో మండలంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

మరిన్ని వార్తలు 6లో

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# రాష్ట్రంలో దుష్టపాలన అంతమై రెండేళ్లయింది..

## -కలావికలమైన వ్యవస్థలు కోరుకుంటున్నాయి..ఎమ్మెల్యే గిడ్డి..



**పి.గన్నవరం(అంబాజీపేట), జూన్ 13, (ప్రభాతవార్త):** రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి,అన్ని సామాజిక వర్గీయులను ఇబ్బందులకు గురిచేసి దుష్ట పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వం అంతమై రెండేళ్ల అయిందని, అప్పటినుండి వ్యవస్థలన్నీ క్రమక్రమంగా కోలుకొని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.పి. గన్నవరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి జూన్ 4 కి రెండేళ్లు పూర్తయిందన్నారు. అప్పటినుండి రెండేళ్లుగా నియోజకవర్గంను అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. ప్రజల ఆగ్రహానికి గురై 151 సీట్ల నుండి 11 సీట్లకు పడిపోయిన వైసిపి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని,సుఖసంతోషాలతో జీవిస్తున్న ప్రజలను చూడలేక వెన్నుపోటుకు రెండేళ్లు అంటూ కొత్త నాటకంను తెరమీదకి తీసుకువచ్చి ప్రజలను అయోమయానికి గురిచేస్తుందన్నారు. రూ.3 వేలు ఇస్తున్న పెన్షన్ను రూ.4 వేలు చేయడం వెన్నుపోటా? ఓకే ఇంటిలో ఎంతమంది చదువుకుంటే అంత మంది విద్యార్థులకు అమ్మఒడి వేయడం వెన్నుపోటా? అన్నదాత సుఖీభవ పథకంలో రైతుల ఖాతాలో రూ.20 వేలు వేయడం వెన్నుపోటా? వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల పాలనా కాలంలో రోడ్లపై నడవలేని దుస్థితి నుంచి సుందరమైన,విశాలమైన రహదారులను అభివృద్ధి చేయడం వెన్నుపోటా? మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంలో భాగంగా స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వెన్నుపోటా? లంక గ్రామాలను కలుపుతూ ఊడిమూడి లంక వారధి నిర్మించడం వెన్నుపోటా? అప్పనపల్లి కాజ్వే నిర్మాణ పనులు చేపట్టడం వెన్నుపోటా? రెండేళ్ల కాలంలో రూ.700 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడం వెన్నుపోటా? కుల,మత, పార్టీల భేదం లేకుండా అనారోగ్యానికి గురై వైద్య చికిత్స కోసం ఖర్చులు భరించలేని నిరుపేద కుటుంబాలకు రెండేళ్ల కాలంలో 27 సార్లు రూ.7 కోట్ల నిధులతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించడం వెన్నుపోటా?మీ ప్రభుత్వంలో రద్దు చేసిన అన్నా క్యాంటీన్లను తెరిపించి ఐదు రూపాయలకే అన్నం పెట్టి పేదల ఆకలి తీర్చడం వెన్నుపోటా? వైసీపీ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హితవు పలికారు. రాష్ట్ర ప్రజలు ఆశీర్వదించి ఇచ్చిన గెలుపు వెన్నుపోటు అవ్వదని, ఆస్తిలో వాటా అడిగిన తల్లిని, చెల్లిని ఇంటి నుండి గెంటి వేయడం వెన్నుపోటు,ఇంటిపోటు అంటారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమంను చూడలేని వైసీపీ నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు నిరసన పేరుతో రోడ్లమీద రావడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఎద్దేవా చేశారు.రైతు అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం:రైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. "పొలం నుండి పాలన వరకు రైతులతో ముఖాముఖి"అనే అనే వినూత్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించారు. రైతుకు అనుసంధానమైన వివిధ శాఖల అధికారులతో, పంటల పండించే సమయంలో రైతులు ఎదుర్కొని సమస్యలపై అధికారులతో ముఖాముఖి చర్చించారు. రైతుల సంక్షేమం ప్రజా రంజక పాలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.తాము ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, అదే సమస్యను తన దృష్టికి తీసుకువస్తే వారం రోజుల్లో పరిష్కరించి న్యాయం చేస్తానని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి శ్రేణులు, నియోజకవర్గంలోని పి.గన్నవరం, అంబాజీపేట, మామిడికుదురు, అయినవిల్లి మండలాలకు చెందిన రైతులు, ఆత్మ కమిటీ సభ్యులు, నీటి సంఘాల చైర్మన్ లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## మందపల్లిలో పోటెత్తిన భక్త జనం శ్రీ ఉమా మందేశ్వర(శనీశ్వర)స్వామి వారికి త్రయోదశి పూజలు


### -స్వామి వారికి రూ 31.58 లక్షల ఆదాయం



**కొత్తపేట, జూన్,13(ప్రభాతవార్త)** మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసి యున్న పురాణ ప్రసిద్ధిగాంచిన శ్రీ ఉమా మందేశ్వర (శనేశ్వర) స్వామివారికి శని త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు రాష్ట్రంలో ఏకైక శని నివారణ క్షేత్రం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తుల తరలి వచ్చారు తైలాభిషేకములు తిలదానములు సర్వదర్శనములు ప్రత్యేక పూజలు భక్తుల నిర్వహించారుభక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు ధర్మాదాయ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అలాగే ఆలయ కార్య నిర్వహణ అధికారి దారపురెడ్డి సురేష్ బాబు భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు వేసవిని దృష్టిలో పెట్టుకుని చల్లని త్రాగునీరు చలివేంద్రాలు ఏర్పాటు మరుగుదొడ్ల ఏర్పాట్లు సరిపడా క్యూలైన్లు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు భక్తులకు అసౌకర్యాలు కలగకుండా దగ్గరుండి పర్యవేక్షించారు రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్ ఆదేశాలతో కొత్తపేట ఎస్సై జి సురేంద్ర శాంతిభద్రతలు నిర్వహించారు స్వామి వారికి పరోక్ష పూజలు ప్రత్యక్ష పూజలు ద్వారా మొత్తం రు31 లక్షల 58 వేల 576 ఆదాయం వచ్చినట్లు ఈవో సురేష్ బాబు తెలిపారు

## గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం.. ముగ్గురు యువకులకు రిమాండ్.

**కడియం, జూన్ 13 ( ప్రభాతవార్త)** కడియం మండలంలో గంజాయి



సేవిస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ ఏ. శివప్రియ ఆదేశాల మేరకు కడియం సీఐ అల్లు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శుక్రవారం మండలంలోని అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు యువకులను అదుపులోకి తీసుకుని గంజాయి వినియోగ పరీక్షలు నిర్వహించగా, ముగ్గురు యువకులు గంజాయి సేవించినట్లు తేలిందని సీఐ తెలిపారు. అలాగే సుమారు రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన వారికి పరీక్షల్లో నెగిటివ్ ఫలితాలు వచ్చినట్లు వెల్లడించారు.కడియపుసావరం, మాధవరాయుడుపాలెం, వేమగిరి తోట గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. డీఎస్పీ ఆదేశాల మేరకు శనివారం కూడా అనుమానిత యువకులకు పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. గంజాయి పరీక్షల కోసం అవసరమైన కిట్లు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.మండలంలోని ప్రతి గ్రామంలో అనుమానిత యువతను గుర్తించి పరీక్షలు నిర్వహించడంతో పాటు, అనుమానాస్పద ప్రాంతాల్లో నిరంతరం దాడులు కొనసాగిస్తామని సీఐ హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.గంజాయి సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని, ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల బారిన పడి ఆరోగ్యం, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని, మైనర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. అలాగే గ్రామ పెద్దలు యువత ప్రవర్తనను పర్యవేక్షించి పోలీసులకు సహకరించాలని సూచించారు.

## వెయ్యి బిందులతోశ్రీ ఉమా చంద్రశేఖరస్వామి కిసహస్ర ఘటాభిషేకం



**జూన్ 13జగ్గంపేట (ప్రభాతవార్త)** జగ్గంపేట మండలం గుర్రంపాలెం శ్రీఉమా చంద్రశేఖర స్వామి వారి ఆలయంలో శనివారం వెయ్యి బిందులతో సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు వర్షాలు సంవృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని,గ్రామ అభివృద్ధి, సంక్షేమశీ కోరుకుంటూ శివాలయం కమిటీ వారి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో పురోహితుల సమక్షంలో ఆలయ శిఖరం పై నుండి జలాభిషేకం నిర్వహించారుపంచామృతాలు తో శ్రీ ఉమా చంద్రశేఖర స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## జేగురుపాడులో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్..

### - 15 బైకులు స్వాధీనం, బెల్ట్ షాపుపై కేసు




**కడియం, జూన్ 13 ( ప్రభాతవార్త)** తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు కడియం సీఐ ఏ. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున జేగురుపాడు గ్రామ పరిధిలోని పాములమెట్ట కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు కాలనీలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి, సరైన పత్రాలు లేని 15 మోటార్ సైకిళ్లను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న ఓ బెల్ట్ షాపును గుర్తించి, అక్కడి నుంచి 35 క్వార్టర్ డీపీఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు.తనిఖీల సందర్భంగా కొత్తగా గ్రామంలోకి వచ్చిన మరియు అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తుల వివరాలను పోలీసులు నమోదు చేసుకున్నారు. గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై నాగ దుర్గాప్రసాద్, ఈగల్ టీమ్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్వేదిలో ఘనంగా యోగాంధ్ర 2026...




**సఖినేటిపల్లి జూన్ 13, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో యోగాంధ్ర-2026 కార్యక్రమం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జేసీ మాట్లాడుచూ వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కంటే ముందస్తు జాగ్రత్తలే ఉత్తమమని, యోగా ద్వారా ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవు తుందని ఆమె తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర ను బీచ్ లో జరగవలసిన కార్యక్రమం వర్షం వల్ల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ ప్రాంగణం లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి ప్రజలతో కలిసి యోగాసనాలు చేశారు. యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా యోగా చేస్తే మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధుల వంటి అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యోగా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ జిల్లా ఏసీ వి సత్యనారాయణ, ఆలయ అసిటెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు, ఇన్స్పెటర్ రామలింగ రాజు, ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, అధికారులు, యోగా శిక్షకులు, మహిళలు, విద్యార్థులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

## త్రిబుల్ ఐటీకి నలుగురు విద్యార్థులు..



**అంబాజీపేట, జూన్ 13, (ప్రభాతవార్త):** మండలంలోని తొమ్మిది జెడ్పీ హైస్కూళ్లకు సంబంధించి నలుగురు విద్యార్థులు త్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు కొత్తపేట ఇన్చార్జి డీవైఈఓ కాంద్రేగుల వెంకటేశ్వరరావు, అంబాజీపేట ఎంఈఓ-2 మోకా ప్రకాష్ లు శనివారం తెలిపారు. పుల్లేటికుర్రుకు చెందిన రోళ్ల లోకిక సంగీత కీర్తి ఒంగోలు, ఇసుకపూడికి చెందిన సూదా హరీష ఒంగోలు, అంబాజీపేటకు చెందిన కె.యశ్వస్విని ఒంగోలు, గంగలకుర్రు అగ్రహారంకు చెందిన రాయుడు మౌనిక శ్రీకాకులం త్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నలుగురు విద్యార్థులకు రెండేళ్లపాటు ఇంటర్మీడియట్, అనంతరం నాలుగేళ్లపాటు బీటెక్ కు ఉచిత విద్యను పొందుతారన్నారు. సుమారు ఒక్కొక్క విద్యార్థికి రూ.18లక్షలు ఖర్చు అవుతుందన్నారు. త్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు ఎంఈఓలతో పాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి చైర్మన్లు అభినందనలు తెలిపారు

## మహిళల భద్రత, బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



**కూనవరం, జూన్ 13, ప్రభాతవార్త :** పోలవరం జిల్లా కూనవరం మండలంలో పోలిపాక గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మహిళల భద్రత, మహిళలకున్న చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో పోలవరం జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సిఐ కన్నపరాజు, స్థానిక ఎస్సై బొడ్డు రామకృష్ణలు మాట్లాడారు. మహిళల భద్రత గురించి, మహిళలకున్న చట్టాలపై సదస్సుకు హాజరైన మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలను ఈ అవగాహన సదస్సులో వారు వివరించడం జరిగింది. గృహహింసకు వ్యతిరేకంగా మహిళలంతా పోరాడాలన్నారు. ఈ చట్టాలపై అవగాహన తప్పనిసరి అని తెలిపారు. ఎవరైనా గృహహింసలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే భద్రత కల్పిస్తామన్నారు. రోడ్డు భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగింది. రహదారులపై ద్విచక్ర వాహనాల మీద వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లపై ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. ఈ సదస్సులో సుమారు 100 మంది గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్, కాలేజీలకు ప్రవేశాలకు నోటిఫికేషన్..

**అంబాజీపేట, జూన్ 13, (ప్రభాతవార్త):** ఏపీ సార్వత్రిక విద్యాపీఠంలో భాగంగా ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయ్యిందని, అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని హెచ్ఎం,కో-ఆర్డినేటర్ కడలి సాయిరామ్ తెలిపారు. 10 వ తరగతి ప్రవేశాలకు 1 నుండి 9వ తరగతి మధ్యలో చదువు మానేసిన పాఠశాల నుండి రికార్డు షీటు లేదా ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్, ఇంటర్ ప్రవేశాలకు 10వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్లుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీటితో పాటు ఆధార్ కార్డు, ఫోటో ఉండాలన్నారు.మరిన్ని వివరాలకు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ పనివేళల్లో సంప్రదించాలని హెచ్ఎం సాయిరామ్ కోరారు.

## మండల స్థాయి ఐఐటీ లో విద్యార్థిని ఆర్హత...



**సఖినేటిపల్లి జూన్ 13, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం ఆంధ్రప్రదేశ్ లోఈరోజు వెలువడిన త్రిబుల్ ఐటీ ఫలితాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంతర్వేదికర విద్యార్థిని చుట్టాల అనన్య లక్ష్మి సాయి శ్రీ నూజివీడు క్యాంపస్ లో త్రిబుల్ ఐటీ కి అర్హత పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుని నారిన ప్రసూనాంబ, తెలియజేశారు. మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్ర కుమార్, విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని అనన్యను అభినందించారు.

## మండలంలో 4గురు విద్యార్థినులు ఐ ఐ టీ కి ఎంపిక.

**రౌతులపూడి, జూన్ 13.(ప్రభాత వార్త)** మండల కేంద్రం రౌతులపూడి నుంచి 4గురు విద్యార్థినులు ఐ ఐ టీ కి ఎంపిక అయినట్లు మండల విద్యాధికారి సతీష్ బాబు తెలిపారు. వీరికి పాఠాలు చెప్పి ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఐ ఐ టీ లో సీట్లు సాధించిన వారిలో బర్ల ఉమా సత్య శివాని, దార్ల పూడి వర్ష, గోపల్లి విజ్ఞ ప్రవల్లిక. కొల్లు పుష్ప నవ్య లను మండల2వ,విద్యాధికారి గాడి కొండబాబు, స్థానికులు గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు అభినందించారు.

## బ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్13,ప్రభాతవార్త.** బ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయమని బ్రాహ్మణ వెల్ఫేర్ విభాగం డైరెక్టర్ ఆకెళ్ళ వెంకట నారాయణమూర్తి పేర్కొన్నారు.బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ నుఈడబ్ల్యూఎస్ శాఖ పరిధి నుండి ఎండోమెంట్స్ శాఖ పరిధిలోనికి తీసుకొని వస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బ్రాహ్మణ సమాజ అభ్యున్నతికి అర్చకుల సంక్షేమానికి ధార్మిక వ్యవస్థ బొలోపేతానికి ఎంతో దోహద పడుతుందని అన్నారు. కేవలం పరిపాలన మార్పు మాత్రమే కాదు బ్రాహ్మణుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి నిబద్ధతకు నిదర్శనం అని తెలిపారు. బ్రాహ్మణ సమాజం ఎదురుచూస్తున్న అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందుకు హర్షనీయ మన్నారు.బ్రాహ్మణుల సంక్షేమం, అర్చకుల అభ్యున్నతి , దేవాలయ వ్యవస్థ,పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని విషయాన్ని ఈ నిర్ణయం మరోసారి స్పష్టం చేసిందన్నారు. భవిష్యత్తులో కూడా బ్రాహ్మణ సమాజ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని విశ్వాసం ఉందని తెలియపరిచారు ఈడబ్ల్యూఎస్ నుండి బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ను ఎండోమెంట్స్ డిపార్ట్మెంట్ కు మార్చడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కి,బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ కి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ్ నారాయణకి కూటమి నాయకులకి ధన్యవాదములు తెలిపారు.

## ఉరేసుకుని బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

**కొత్తపేట, జూన్13,(ప్రభాతవార్త)** బ్యాంకు ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపేట ఎస్సై జి సురేంద్ర తెలిపారు ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి ఒడిస్సా రాష్ట్రంలోని నైగర్ జిల్లా దంగరగోడి గ్రామానికి చెందిన కుమార్ దివ్య జ్యోతి (23) బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒరిస్సా క్యాడర్ లో ఎంపికయ్యారు మూడు నెలల శిక్షణ నిమిత్తం కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ కు వచ్చాడు కొత్తపేట ధర్నాల హైట్స్ లో ఓ ప్లాట్ లో అద్దెకు ఉంటున్నాడు 24 రోజులు ట్రైనింగ్ పూర్తి అయింది గురువారం యధావిధిగా బ్యాంకుకు వెళ్లి డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్ళిపోయాడు శుక్రవారం ఉదయం కుమార్ డ్యూటీకి వెళ్లకపోయేసరికి మేనేజర్ ఫోన్ చేయగా ఆన్సర్ లేకపోయేసరికి ఇంటి ఓనర్ శ్రీఘాకోకళ్ళపు సునీల్ కు ఫోన్ చేయగా సునీల్ తన గుమస్తాను కుమార్ ప్లాట్ కి పంపించాడు అతను తలుపులు తెరచి చూసేసరికి ఉరేసుకొని ఫ్యాన్ కు వేలాడుతూ కనిపించాడు ఇంటి ఓనర్ సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేంద్ర తెలిపారు

## వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం






**శంఖవరం జూన్ 13 ప్రభాతవార్త** మండల కేంద్రం శంఖవరంలో గల శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఆలయం 15వ వార్షిక మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని వేకువ జామునే స్వామి, అమ్మవార్లకు అర్చకులు చదువుల సాయికుమార్ శర్మ, డి ఆదిత్య, శ్రీనివాస్ శర్మ, గణేష్ శర్మ ఆధ్వర్యంలో పంచామృత రుద్రాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమ పూజ నిర్వహించి, స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద 18 రకాల పిండి వంటకాలతో మహా అన్నదానం నిర్వహించారు. ఆలయ ప్రోత్సాహకులు దాసరి లోవరాజు మాట్లాడుతూ భక్తులు, గ్రామ ప్రజల సహకారంతో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగిందని తెలిపారు. స్వామి, అమ్మవార్ల ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై కలకాలం ఉండాలని లోవరాజు ఆకాంక్షించారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps